ఆంధ్రప్రదేశ్ శాసన సభ కార్యకలాపాలు

# LEGISLATIVE ASSEMBLY DEBATES

అధికార నివేదిక

## OFFICIAL REPORT

సోమవారం, మార్చి 25, 2013

13 వ శా. స. XII సమావేశం, వాల్యూం -- II నంబరు -- 3

శక సంవత్సరం – 1935, చైత్రం – 4

**MONDAY, THE 25th MARCH, 2013**

**13 L.A. XII SESSION, VOL— II No. - 3**

**4 - Chaitra, 1935 - S.E.**

#

శాసన సభ సచివాలయం
పబ్లిక్ గార్డెన్స్
హైదరాబాదు – 500 004.

**LEGISLATURE SECRETARIAT**
**PUBLIC GARDENS**
**HYDERABAD**
**500 004.**

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ నాదెండ్ల మనోహర్ |
| ఉప సభాపతి | : | శ్రీ మల్లు భట్టి విక్రమార్క |
| అధ్యక్షుల పేర్ల పట్టిక | : | శ్రీ పి. కిష్టా రెడ్డి<br>శ్రీ జి. వెంకట శేషు<br>శ్రీ ఆర్.వి. సుజయ కృష్ణ రంగారావు<br>శ్రీమతి ఎ. ఉమా మాధవ రెడ్డి<br>శ్రీమతి వంగా గీతా విశ్వనాథ్ |
| కార్యదర్శి | : | శ్రీ ఎస్. రాజ సదారాం |
| ఉప కార్యదర్శులు | : | శ్రీమతి వి.గిరిజాసుందరి<br>శ్రీ కె. సత్యనారాయణ రావు<br>శ్రీ జి. వెంకటకృష్ణ<br>శ్రీ పి. బాలకృష్ణమాచార్యులు<br>శ్రీమతి వై. వెంకట రమణమ్మ |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ వి. నరసింహాచార్యులు<br>శ్రీమతి టి. సుశీల<br>శ్రీ జె. రామలింగేశ్వర రావు<br>శ్రీ హెచ్. ఎ. షఫీ<br>శ్రీ ఎం. విజయ రాజు<br>శ్రీ వి. రమేష్ కుమార్<br>శ్రీ పి. వి. సుబ్బారెడ్డి<br>శ్రీ టి. బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సూరజ్ బహదూర్<br>శ్రీ కె. రాజ్ కుమార్<br>శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీ ఎస్. రామ నరసింహం<br>శ్రీమతి టి. సత్యవేద కుమారి<br>శ్రీమతి ఎ. చంద్రభాగ |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ బి.ప్రభాకర్ రావు |

-------------

# ఆంధ్రప్రదేశ్ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

**( 13వ శాసన సభ )**

**(12వ సమావేశం : తొమ్మిదవ రోజు)**

**సోమవారం, మార్చి 25, 2013**

**సభ ఉ. గం.9.00 లకు ప్రారంభమైనది**

**(గౌ. సభాపతి అధ్యక్ష స్థానములో ఉన్నారు)**

----------

## విషయ సూచిక


1. సభా కార్యక్రమం
   వాయిదా తీర్మానాలను అనుమతించుట గురించి
2. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు
3. నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు (అనుబంధం–1)
4. సభా సమక్షంలో ఉంచబడిన పత్రం
5. 2013–2014 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ వ్యయ పట్టిక (బడ్జెట్)
6. 2012–13 సం.నికి వ్యయపు అనుబంధ అంచనాల సమర్పణ
7. లఘుచర్చ
   రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి గురించి


-----

ఉ.9.00

**ఆంధ్రప్రదేశ్ శాసన సభ**

**సోమవారం, మార్చి 25, 2013**

***

## సభా కార్యక్రమము

## వాయిదా తీర్మానాలను అనుమతించుట గురించి

*****

MR.SPEAKER: - Adjournment Motions have been received today.

Adjournment Motion given notice of by Sri M.Narsimhulu Garu and others regarding the need to discuss Law and Order situation in the State is disallowed.

Adjournment Motion given notice of by Sri Etala Rajender Garu and others, regarding the need to supply uninterrupted Power to the Farmers in Telangana is disallowed.

Adjournment Motion given notice of by Smt. Y.S.Vijayamma Garu and others regarding the need to discuss the scarcity of Drinking Water in the State is disallowed.

Adjournment Motion given notice of by Sri G. Mallesh Garu, Sri Julakanti Ranga Reddy Garu, and Dr.Nagam Janardhan Reddy Garu regarding the need to discuss power situation in the Situation is disallowed.

Adjournment Motion given notice of by Sri E.Lakshminarayana Garu regarding the need to adopt a Resolution for separate Telangana State is disallowed.

Now, we will go into Question Hour.

శ్రీ టి.హరీష్ రావు (సిద్ధిపేట): (మైకు లేకుండా) సార్, పవర్ మీద నేరుగా చర్చ చేపట్టండి. దానికంటే బర్నింగ్ టాపిక్ ఇంకొకటి లేదు. అందువలన మీరు నేరుగా పవర్ మీద చర్చ టేకప్ చేయండి. మాకు అనేక సమస్యలున్నా వాటన్నింటినీ విద్యుత్ సమస్య అధిగమిస్తున్నది కాబట్టి నేరుగా పవర్ అంశాన్ని టేకప్ చేయాలని కోరుతున్నాను.

MR.SPEAKER: That happens only after Question Hour.

శ్రీ టి.హరీష్ రావు : అధ్యక్షా, రాష్ట్రంలో చాలా సందర్భాల్లో.......

MR.SPEAKER: The Minister for Revenue will make a statement today. మీరందరూ కోఆపరేట్ చేయాలి. సభా సమయాన్ని ఇప్పటికే మనం బాగా వృధా చేసుకున్నాం. దయచేసి మీరందరూ సహకరిస్తే మనం ఉన్న సమయాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకుని కార్యక్రమాలు జరుపుకుందాం. ప్రశ్నోత్తరాల సమయం తీసుకుని తరువాత ఉదయం 10 గంటలకు మనం షార్ట్ డిస్కషన్ ఆన్ పవర్ అంశానికి వెళాదాం. We will go into Question Hour.

శ్రీ టి.హరీష్ రావు ః (మైకు లేకుండా) సార్, క్వశ్చన్ అవర్ అంటే మనకు సమయం సరిపోదు. సార్, వర్కింగ్ లంచ్ పెట్టి సభను సాయంత్రం దాకా నడుపుతారా?

(ఈ సందర్భంలో కళ్లకు నల్ల గంతలు కట్టుకుని, హైటెన్షన్ వైరును చెరొక వైపు మెడలో వేసుకుని సిపిఐ సభ్యులు శ్రీ గుండా మల్లేష్ మరియు సిపిఎమ్ సభ్యులు శ్రీ జూలకంటి రంగారెడ్డి వెల్‌లోకి వచ్చారు. తదుపరి ఇతర సిపిఐ సభ్యులు కూడా వెల్‌లోకి వచ్చారు)

మిస్టర్ స్పీకర్ః గౌరవ సభ్యుల హక్కులు కూడా మనం కాపాడాలి. ప్రతీ రోజూ ప్రశ్నోత్తరాల సమయం వృధా అవుతోంది. కాబట్టి మనం ప్రశ్నోత్తరాలకు ఒక గంట సమయాన్ని కేటాయించుకున్నాక.....

శ్రీ జూలకంటి రంగారెడ్డి (మిర్యాలగూడ)ః సార్, కరెంటు ఛార్జీల మోత – కరెంటు కోతలు – రాష్ట్రమంతా చీకటిమయం. మమ్మల్ని ఈ విధంగా చూస్తే మీకు సంతోషంగా ఉందా?

MR.SPEAKER: I appeal to the Members to please go back to your seats.

శ్రీ జి. మల్లేష్ (బెల్లంపల్లి)ః సార్, గత మూడు రోజులుగా జాతీయ పార్టీల నాయకులు, వామపక్ష నాయకులు నిరాహార దీక్షలు చేస్తుంటే ఈ సమస్య పరిష్కారానికి ఒక మంత్రి అయినా అక్కడకు వెళ్లారా? సమస్య గురించి చర్చ జరిపి వారిని నిరాహార దీక్ష విరమింప చేసి శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పే బాధ్యత మంత్రుల మీద లేదా?

మిస్టర్ స్పీకర్ః అదే సమస్యపైన మనం చర్చించుకుంటున్నాం కాబట్టి మల్లేష్ గారూ, చర్చలో మీరు చెప్పాలనుకున్నది చెప్పండి. పవర్ పైన చర్చ తీసుకుంటున్నాను.

(ఈ సందర్భంలో సిపిఎమ్, సిపిఐ సభ్యులు తమ స్థానాల్లోకి వెళ్లారు)

MR.SPEAKER: Question No.5836 Minister for Municipal Administration.

శ్రీ టి.హరీష్ రావుః సార్, నేరుగా విద్యుత్ అంశాన్ని టేకప్ చేయండి.

మిస్టర్ స్పీకర్ః క్వశ్చన్ అవర్ అయిన తరువాత ఆ అంశం మీద మాట్లాడండి. we will take one hour for Question Hour. Please cooperate.

(ఈ సందర్భంలో టిఆర్ఎస్, వైఎస్ఆర్‌సిపి సభ్యులు పోడియం వద్దకు వెళ్లారు.
సిపిఐ, సిపిఎమ్ సభ్యులు వెల్‌లోకి వెళ్లారు)

(అంతరాయం)

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు
## జి.హెచ్.ఎం.సి. పరిధిలో రాజీవ్ ఆవాస్ యోజన క్రింద మురికివాడల అభివృద్ధి

ప్రశ్న నెం.1(5836)

శ్రీ ఏ.రాజేందర్ (**మల్కాజ్‌గిరి**) – గౌరవనీయులైన మునిసిపలు పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి గారు దయచేసి ఈ క్రింది సమాచారం తెలియజేస్తారా:-

అ) గ్రేటర్ హైదరాబాద్ మునిసిపలు కార్పోరేషను పరిధిలో రాజీవ్ ఆవాస్ యోజన క్రింద అభివృద్ధి పరచాలని ప్రతిపాదించిన మురికివాడల వివరాలేమిటి ;

ఆ) ఆ కార్యక్రమాల నిమిత్తం సమకూర్చే నిధుల వివరాలతో పాటు అట్టి మురికివాడలలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వివరాలేమిటి ?

**మునిసిపలు పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి (శ్రీ ఎం.మహీధర్ రెడ్డి) :**

అ) గ్రేటర్ హైదరాబాదు మునిసిపలు కార్పోరేషన్ (18 సర్కిళ్లు)లో మొత్తం 1476 మురికివాడలు ఉన్నాయి. జిహెచ్ఎంసి మురికివాడలు లేని నగర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి సామాజిక హోదా, మౌలిక సదుపాయాలలో వ్యత్యాసాల ఆధారంగా మురికివాడలను ప్రాధాన్యీకరించింది. ఆ ప్రకారంగా 290 మురికివాడలను మొదటి సంవత్సరంలో అభివృద్ధి చేయడం కోసం ఎంపిక చేయడమయింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం అందవలసి వుంది. ఆ ప్రకారంగా, జిహెచ్ఎంసి శేరిలింగంపల్లి సర్కిల్‌లోని కేశవ్ నగర్‌ను ప్రయోగాత్మక మురికి వాడగా ఎంపిక చేయడం జరిగింది. దానిని రూ.5874.60 లక్షల ప్రాజెక్టు వ్యయంతో రాష్ట్ర స్థాయి స్టీరింగ్ కమిటీ మరియు కేంద్ర మంజూరు, పర్యవేక్షక కమిటీ(సిఎస్ఎంసి)లు ఆమోదించాయి.

ఆ) 1476 మురికివాడల అభివృద్ధిని క్రింద చూపిన విధంగా 5 సంవత్సరాల కాలంలో చేపట్టాలని ప్రతిపాదించడమైంది.

| సంవత్సరం | మురికివాడల సంఖ్య | గృహ నిర్మాణం | పర్యావరణ మౌలిక సదుపాయాలు (స్థలంలో, స్థలం బయట) | సామాజిక మౌలిక సదుపాయాలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| మొదటి సంవత్సరం | 290 | 1672.55 | 530.99 | 89.06 | 2292.60 |
| రెండవ సంవత్సరం | 299 | 1771.10 | 391.45 | 12.45 | 2175.00 |
| మూడవ సంవత్సరం | 299 | 2096.44 | 475.79 | 15.09 | 2587.32 |
| నాల్గవ సంవత్సరం | 299 | 2058.67 | 524.48 | 14.96 | 2598.11 |
| ఐదవ సంవత్సరం | 289 | 1586.96 | 475.58 | 16.84 | 2079.38 |
| మొత్తం | 1476 | 9185.72 | 2398.29 | 148.40 | 11732.41 |

అందువల్ల, 5 సంవత్సరాలకు అవసరమైన మొత్తం నిధులు రూ.11732.41 కోట్లు పై మొత్తానికి గాను గృహ నిర్మాణం కోసం రూ.9185.72 కోట్ల మొత్తం అవసరమవుతుంది.

గృహ నిర్మాణం కోసం వాటా విరాళ విధానం కేంద్రప్రభుత్వం వాటా 50 శాతం గానూ, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20 శాతం గానూ, లబ్ధిదారుని వాటా 30 శాతం గానూ ఉన్నది.

అదేవిధంగా, పర్యావరణ మౌలిక సదుపాయాలు, సామాజిక మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.2546.69 కోట్ల మొత్తం అవసరం ఉన్నది.

మౌలిక సదపాయాల కోసం వాటా విరాళ విధానం కేంద్ర ప్రభుత్వం వాటా 50 శాతం గానూ, రాష్ట్ర ప్రభుత్వం వాటా 20 శాతం గానూ, పట్టణ స్థానిక సంస్థల వాటా 30 శాతం గానూ ఉన్నది.

(ఈ సందర్భంలో టిఆర్ఎస్ సభ్యులు, వైఎస్ఆర్సిపి సభ్యులు పోడియం వద్ద విద్యుత్ అంశంపై వెంటనే చర్చ చేపట్టాలని కోరసాగారు)

(అంతరాయం)

ఉ.9.10

(అప్పటికే పోడియం వద్దకు చేరుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు విద్యుత్ సమస్యపైన చర్చకు అనుమతించాలని కోరుతూ గౌరవ సభాపతి గారికి విజ్ఞప్తి చేయసాగారు)

మిస్టర్ స్పీకర్ః అవునండీ. మీరు సహకరిస్తే ప్రశ్నోత్తరాల సమయం అయిన తరువాత తప్పకుండా మనం విద్యుత్ సమస్యపైన చర్చించుకుందాం. పది గంటలకే ప్రశ్నోత్తరాల అంశాన్ని ముగించుకుందాం. అనేకమంది సభ్యులు కష్టపడి ప్రశ్నలు వేస్తే, అవి అడగకుండా మీరు అడ్డుకుంటే ఎట్లా?

(ఈ సందర్భంలో పోడియం వద్దకు వచ్చిన శ్రీ జూలకంటి రంగారెడ్డి, సీపీఎం మరియు శ్రీ గుండా మల్లేష్, సీపీఐ విద్యుత్ సమస్యపైన చర్చించాలని గౌరవ సభాపతి గారిని కోరసాగారు)

మిస్టర్ స్పీకర్ః దయచేసి సహకరించండి. You must cooperate.

(ఈ దశలో అప్పటికే పోడియం వద్దకు వచ్చిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు – పవర్‌పైన చర్చ జరగాలి అంటూ నినాదాలు చేస్తుండగా, తెలంగాణా రైతాంగానికి ఏడు గంటల కరెంటు ఇవ్వాలంటూ తెలంగాణా రాష్ట్ర సమితి సభ్యులు నినాదాలు చేయసాగడంతో సభకు అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః రాజేందర్ గారూ... కూర్చోండి.

(నినాదాలు కొనసాగాయి)

MR.SPEAKER: Minister for Legislative Affairs.

శ్రీ డి. శ్రీధర్ బాబు (శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి)ః అధ్యక్షా, నేను ప్రతిపక్షాలకు సంబంధించిన గౌరవ సభ్యులను ఒక్కటే కోరుతున్నాను. అజెండాలో పవర్‌పైన డిస్కషన్ వుంటుందని ఉంది. మొన్న కూడా కేశవ్ గారు పవర్‌పైన డిస్కషన్ మొదలుపెట్టడం జరిగింది. ప్రతిపక్షాలకు సంబంధించిన గౌరవ సభ్యులు లేవనెత్తిన అంశాలు కూడా ఈ క్వశ్చన్ అవర్‌లో వున్నాయి. వాటి విషయంలో కూడా మేము జవాబు చెప్పాలనే ఆతృతతో వున్నాము. ఈ రోజు suicidal deaths of Handloom weavers అని ప్రశ్న ఇచ్చారు. అదేవిధంగా అనంతపురం జిల్లాకు సంబంధించిన స్పెషల్ ప్యాకేజీ విషయంలో ప్రభుత్వం ఏమేం చేస్తోందన్నది కూడా చెప్పే అవకాశం క్వశ్చన్ అవర్‌లో వుంది. దుమ్ముగూడెం ప్రాజెక్టు విషయమై పెద్దలు తుమ్మల నాగేశ్వరరావు గారు కూడా క్వశ్చన్ వేయడం జరిగింది. అలాగే ఈ రోజు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విషయంలో... ముఖ్యంగా హైదరాబాద్ పట్టణంలో ఉంటున్న పేద ప్రజానీకానికి సంబంధించి రాజీవ్ ఆవాస్ యోజన గురించి వారికి పట్టింపు లేదు. పవర్ విషయంలో మాత్రం ఈ రోజు రాజకీయం చేస్తున్నారు. వారికి చిత్తశుద్ధి వుంటే 10 గంటల తరువాత పవర్‌పైన జరిగే చర్చలో పాల్గొనమని చెప్పండి. ఇంతమంది సభ్యులు లేరు. అయినా పోడియం వద్దకు రావడం జరిగింది. కేవలం ఒక్క గంట ఓపిక పట్టమని చెప్పడం జరిగింది. ఈ క్వశ్చన్ అవర్ అనేది వన్ అవర్ వుంటుంది. సభ్యులకు సంబంధించిన ప్రధానమైన హక్కు ఇది. ఈ హక్కును

కూడా విస్మరించి చాలా మంది ఈ విధంగా చేయడం దురదృష్టకరం. రాజకీయపరంగా చేస్తున్న కార్యక్రమాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారు. విద్యుచ్ఛక్తి విషయంలో మీరు చెప్పగానే, షార్ట్ డిస్కషన్‌కి మీరు అనుమతివ్వగానే జవాబుతో మేం రెడీగా వున్నాము. 10 గంటలకి మీరు డిస్కషన్ మొదలుపెడతామని చెప్పారు. దానికి అనుగుణంగా వారు ఛైర్‌కి సహకరిస్తే, తప్పకుండా 10 గంటల సమయంలో ఎన్ని క్వశ్చన్స్ అయితే, అన్ని క్వశ్చన్స్ మనం ఆన్సర్ చేసుకుని, వెంటనే పది గంటలకు పవర్‌పైన చర్చ మొదలు పెట్టమని వారికి చెప్పండి. మాకేవిధమైన అభ్యంతరం లేదు. గవర్నర్స్ అడ్రస్ పైన రేపు రిప్లై చేపట్టే కార్యక్రమం చేస్తే, మాకు ఏ విధమైన అభ్యంతరం లేదని మనవి చేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: మనకి అనేక అంశాలున్నాయి. ప్రధానంగా గవర్నర్ గారి ప్రసంగానికి ధన్యవాదాలు తెలపాల్సిన అంశముంది. రెవిన్యూ మినిస్టర్ గారు ఈ రోజు రెవిన్యూ సదస్సులపైన స్టేట్‌మెంట్ ఇస్తున్నారు. See, Question Hour is Member's Hour. All the Members cutting across party lines would want to speak about Question Hour. ఒక్క రోజన్నా మీరు సభ్యులకు అవకాశమివ్వకపోతే ఎట్లా? మీ పార్టీల పరంగా మీకు కొన్ని అంశాలుంటాయి? అలాగే ఇతర సభ్యులకు కూడా కొన్ని అంశాలుంటాయి కదా? నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలుంటాయి. You must cooperate. Please go back to your seats. I appeal to all the Members to please go back to your seats. Immediately after Question Hour, we will discuss on Power. ప్రశ్నోత్తరాల సమయం అయిపోగానే, విద్యుత్ సమస్యపైన మనం చర్చను తీసుకుందాం. దయచేసి, మీరందరూ సహకరించండి. ఎవరి రూల్స్ వాళ్లకుంటాయి. సభ అన్నాక అందరి హక్కులు అందరికీ వుంటాయి. వాటిని కాపాడాల్సిన అవసరం మనందరికీ ఉంటుంది.

శ్రీ జూలకంటి రంగారెడ్డి : విద్యుత్ సమస్యపైన చర్చించండి.

మిస్టర్ స్పీకర్: పది గంటలకు చర్చించుకుందామని చెబుతున్నాను కదా? We will begin discussion on power at 10'o clock. 45 నిమిషాలు మీరు ఓపిక పట్టలేరా? సభ్యులందరికీ మీరు అవకాశమివ్వండి. Please go back to your seats. Please go back to your seats.

శ్రీ బాలినేని శ్రీనివాస రెడ్డి (ఒంగోలు): స్పీకర్ సార్, వర్కింగ్ లంచ్ అన్నా పెట్టండి.

MR.SPEAKER: Yes, I request the Members to please go back to your seats. We will take up the Discussion on power immediately after the Question Hour.

శ్రీ బాలినేని శ్రీనివాస రెడ్డి: వర్కింగ్ లంచ్ లేదా సార్?

MR.SPEAKER: You cannot ask that here. సభ సజావుగా జరుగుతున్నప్పుడు ఎన్ని గంటలైనా చర్చించుకుందాం. మీ పార్టీ తరఫున కూడా ఇవాళ ప్రధానమైన ప్రశ్నలున్నాయి. వీవర్స్‌పైన, అనంతపురం జిల్లాకు స్పెషల్ ప్యాకేజీ విషయమై ప్రశ్న వుంది. దయచేసి సహకరించండి.

(పోడియం వద్ద నున్న విపక్షాల సభ్యులచే సభకు అంతరాయం)

Now, the House adjourned at 9.17 A.M

**(The House then adjourned at 9.17 A.M. to meet again at 10. A.M.)**

ఉ.10-20

( The House reassembled at 10-28 am.)
(Mr. Speaker in the Chair.)

## నక్షత్రపు గుర్తుగల ప్రశ్నలు – వాగ్రూప సమాధానములు (అనుబంధం–1)

MR. SPEAKER :All the questions are deemed to have been answered.

## సభా సమక్షంలో ఉంచబడిన పత్రం

MR. SPEAKER : All the papers shown in the Agenda are deemed to have been laid on the Table of the House.

**74th Annual Report of the Nizam Sugars Limited for the year 2011-2012**

MR. SPEKER: “A copy of the 74th Annual Report of the Nizam Sugars Limited for the year 2011-2012 as required under Section 619-A of the Companies Act, 1956.”

## 2013–2014 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ వ్యయ పట్టిక (బడ్జెట్)

SRI ANAM RAMANARAYANA REDDY, Minister for Finance:- Sir, I beg to move—

“ That the Government be granted a sum not exceeding Rs. 34675, 61, 49, 000/- in advance in respect of the essential expenditure for a part of the financial year 2013-14 as per the Heads of Demands shown in the notice dated 18th March, 2013. “

MR. SPEAKER : Motion moved. The question is –

“ That the Government be granted a sum not exceeding Rs. 34675, 61, 49, 000/- in advance in respect of the essential expenditure for a part of the financial year 2013-14 as per the Heads of Demands shown in the notice dated 18th March, 2013

(Pause)

The motion was adopted and the amount requested for was granted.

## 2012–13 సం.నికి వ్యయపు అనుబంధ అంచనాల సమర్పణ

MR. SPEAKER : The question is --

“That the Government be granted a sum not exceeding RS.10904,67,56,000/- for further expenditure in the year 2012-2013 as per the Heads of Demands shown in the Notice dated 22nd March, 2013”.

(Pause)

The Motion was adopted and the Supplementary Estimates of expenditure for 2012-13 were granted.

MR. SPEAKER: There is a brief statement by the Minister for Revenue….

( Interruptions )

ఉ. 10.30

Yes, Minister for Legislative Affairs.

శ్రీ డి. శ్రీధర్ బాబుః అధ్యక్షా, గౌరవ ప్రతిపక్ష సభ్యులను కోరుతున్నదేమిటంటే our Hon'ble Revenue Minister will appeal to the House. Just it is an appeal to all the Members. It is not a statement just it is an appeal to all the Members of the Assembly. 28,000 రెవెన్యూ సదస్సులకు సంబంధించిన విషయంలో వారు సభను ఎన్‌లైటెన్ చేసి ఏ విధంగా రెవెన్యూ యంత్రాంగం పనిచేస్తుందనే విషయాన్ని చెప్పడానికి వారు ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ ఇబ్బందుల గురించి మీ అభిప్రాయాలను తీసుకునే ప్రయత్నం తరవాత చేస్తాం. I appeal to all floor leaders only five minutes time will take for Revenue Minister's appeal.

(తెలుగు దేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

MR.SPEAKER: O.K. We will move into the short discussion on Power. Yes, Mr.Payyavula Keshav Garu.

## లఘుచర్చ
## రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితి గురించి

శ్రీ పయ్యావుల కేశవ్ (ఉరవకొండ)ః అధ్యక్షా, వారం రోజులపాటు రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఎదురుచూస్తున్న చర్చ గురించి ఈ రోజుకైనా వచ్చే అవకాశం కలిగినందుకు సహకరించిన మిత్రులకు కూడా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇంతకు ముందు ఎంత కోరినా స్పందించనటువంటి ప్రభుత్వం చివరికి దిగివచ్చి చర్చపెట్టాల్సిన స్థితికి రావడం ప్రతిపక్షాలు ఒక్క అడుగు ముందుకు వేసినట్లుగా మేం భావిస్తున్నాం. విద్యుత్‌కు సంబంధించిన చర్చ శాసనసభలో జరగకుండా ఉండాలని ఎన్ని రకాలుగా ఈ ప్రభుత్వం ప్రయత్నం చేసినా విధిలేని పరిస్థితులలో శాసనసభలో చర్చకు వచ్చింది.

MR.SPEAKER: One Minute. Yes, Minister for Legislative Affairs.

శ్రీ డి. శ్రీధర్‌బాబుః అధ్యక్షా, గౌరవ సోదరుడు కేశవ్ గారిని కోరుతున్నదేమిటంటే we have to set the records straight. ప్రభుత్వం దిగివచ్చి మాత్రం కాదు. విద్యుత్ విషయంలో రాష్ట్ర ప్రజలనుద్దేశించి బాధ్యతగా ప్రతిపక్షాలు లేవనెత్తిన ప్రతి అంశంపై జవాబు చెప్పాలనే బాధ్యతాయుతమైన కార్యక్రమం మేం చేస్తున్నాం తప్ప మీరు అడిగినందుకు మాత్రం కాదని చెబుతున్నాను.

MR.SPEAKER: Yes, Keshav Garu.

శ్రీ పయ్యావుల కేశవ్: అధ్యక్షా, రికార్డ్ సెట్‌రైట్ చెయ్యడానికని చెప్పారు తప్ప కొత్త విషయమేం చెప్పలేదు. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మొట్టమొదటి రోజున ప్రభుత్వమే ముందుకొచ్చి అజెండాలో పెట్టి ఇక్కడ టేబుల్ మీద పెడితే మేం సంతోషించేవాళ్లం. విద్యుత్ గురించి పదే పదే మేం ఒత్తిడి చేసిన తరవాత అజెండాలో నాలుగో అంశంగా పెట్టి ప్రభుత్వ ప్రాధాన్యతాంశంగా చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నది. అటువంటి దుస్సాహసమైన ప్రయత్నం ఇంకొకసారి చేయొద్దని ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఏది ఏమైనప్పటికీ ఈ రోజున విద్యుత్ అంశం చర్చకు వచ్చినందుకు సంతోషంగా ఉన్నది. గ్రామాలలో ఉన్న పరిస్థితులను సభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చే అవకాశం దొరికినందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అనుకుంటున్నాను. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు విద్యుత్ గురించి ఏం చెప్పిందనే అంశాన్ని గుర్తు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ చెప్పిందేమిటంటే, వారు అధికారంలోకి వచ్చిన వెంటనే 2000 సంవత్సరం నాటి ధరలకు తగ్గిస్తాం, రోల్‌బ్యాక్ చేస్తామన్నారు. ఒక బల్బ్, ఒక ఫ్యాన్‌కు విద్యుత్ ఉచితమన్నారు. ఆక్వా రైతులకు కరెంట్ ఉచితమన్నారు. వ్యవసాయానికి పన్నెండు గంటల కరెంట్ సరఫరా చేస్తామన్నారు. అప్పటివరకు పెండింగులో ఉన్న అప్లికేషన్‌లన్నింటిని క్లియర్ చేస్తామన్నారు. వీటన్నింటిని మించి పి.పి.ఏలను సమీక్షిస్తామన్నారు. 2009 ఎన్నికలకొచ్చేసరికి ఏం చెప్పారంటే వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఇవ్వాళ ఇవన్నీ కొత్తగా, వింతగా వింటున్నట్టున్నది. ఎందుకంటే ఇవేవీ ఈ రాష్ట్రంలో నిజాలు కావు, ఇవి అమల్లోకి రాలేదు. ఈ విషయాలను మేం చెప్పామా అన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు, అధికారపక్ష శాసనసభ్యులు ఎపుడో మర్చిపోయారు.

ఇవ్వాళ ఏ పత్రిక చూసినా మొదటి పేజీలో రాష్ట్ర కరెంట్ సమస్య గురించే ఉంటున్నది. "విద్యుత్ కోతలపై అన్నదాతల ఆగ్రహం" "కరెంట్ చార్జీల ప్రతిపాదన వెనక్కి తీసుకోవాలంటూ రైతుల కన్నెర్ర" " పరిశ్రమలకు విద్యుత్ ఘాతం" " పరిశ్రమలు ఢమాల్" " పాడె కడుతున్న కరెంట్ " ఎక్కడ చూసినా కరెంట్, కరెంట్, కరెంట్. రాష్ట్రంలో రైతులు, గృహిణులు, విద్యార్థులు , చేనేత కార్మికులు, చేతి వృత్తుల వారు, పరిశ్రమలు, ఆసుపత్రులు, దినసరి కూలీలు కరెంట్ కోతలతో తల్లడిల్లిపోతున్నారు. రాష్ట్రం మొత్తం కరెంట్ బాధితులుగా మారిన పరిస్థితులు ఏర్పడ్డాయంటే దీనికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వం. కచ్చితంగా ఈ ప్రభుత్వం నిర్వాకం, అవగాహనా రాహిత్యం, అసమర్థత, అవినీతి వల్ల రాష్ట్రంలో ఈ రకమైన దురవస్థ ఏర్పందనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. మా నియోజకవర్గంలో 37 ప్రారంభోత్సవాలకు రెవెన్యూ మంత్రి గారు వస్తే వారు ఎక్కడికి వెళ్లినా రైతులు కోరుతున్నది విద్యుత్ గురించే. విద్యుత్ కోసం వారి ఆవేదన, ఆక్రోశాన్ని వ్యక్తపరుస్తున్నారు. వాళ్లు అడుగుతున్నటువంటి ఏడు గంటల కరెంట్ మాత్రమే. ముందుగా పన్నెండు గంటలకు ప్రామిస్ చేశారు, తరువాత తొమ్మిది గంటలన్నారు, కిరణ్ కుమార్ రెడ్డి గారు అధికారంలోకి వచ్చాక నాలుగు గంటలకు పడిపోయింది. రైతులు రబీలో ఎవ్వరు కూడా పంటలు వేసుకోని పరిస్థితిలో ఉన్నారు. విద్యుత్ సమస్య కారణంగా రబీలో పంటలు వేసుకునే సాహసం ఈ రాష్ట్ర రైతాంగం చెయ్యడం లేదు. ఇప్పటివరకు ఉన్న పంటలను కాపాడుకోవాలని, వారు పెంచుకున్న తోటలను కాపాడుకోవాలనే ఆవేదనతో ఈ రాష్ట్ర రైతాంగముంటే కేవలం రెండు, మూడు గంటల కరెంట్ సరఫరా చేయడమే కాకుండా దాంట్లో కూడా పది ఇంటరప్షన్‌లతో సరఫరా చేస్తున్నందున తడిచిన భూమే మళ్లీ తడుస్తున్నది తప్ప పండ్ల చెట్లను కాపాడుకునే మార్గం మాత్రం కనబడటం లేదు. ఈ ప్రభుత్వం మాటలను నమ్మి రైతులు పండ్ల తోటలను పెట్టుకుంటే ఈ ప్రభుత్వం కోతల ప్రభుత్వమని అర్థమైంది.

వేల కోట్ల రూపాయలను రాష్ట్ర రైతాంగం నష్టపోతుంటే ప్రభుత్వం ఆ నష్టాన్ని ఏ రకంగా భర్తీ చేస్తుందని నేను ప్రశ్నిస్తున్నాను.

విద్యుత్ కోతలతో నష్టం వాటిల్లి రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం గ్రామాలలో చూశాం. ఇప్పుడు రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల ఆత్మహత్యలు కూడా మొదలయ్యాయి. ఇవ్వాళ కుత్‌బుల్లాపూర్‌లో శైలేందర్ కండెమ్‌వాల్ అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ప్రభుత్వం. ప్రభుత్వం విధిస్తున్న కరెంట్ కోతలతో తన పరిశ్రమ నడుపుకునే పరిస్థితి లేదు. తనను నమ్ముకున్న కార్మికులకు ఉపాధి కల్పించే పరిస్థితి లేదని ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. వందలు, వేల సంఖ్యలో పరిశ్రమలను మూసివేసే పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే విధంగా చిన్న తరహా పరిశ్రమలను కూడా మూసివేసే పరిస్థితులు ఉన్నాయి. చిన్న చిన్న జిరాక్స్ సెంటర్ల వారు, కుట్టు మిషన్లను పెట్టుకున్నవారు కూడా కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నారు. భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జనవరి, ఫిబ్రవరి మాసాల నుంచే విద్యుత్ కోతలు మొదలయ్యాయి. విద్యార్థులు క్యాండిల్స్ పెట్టుకుని చదివి పరీక్షలు రాస్తున్నారు. కార్యాలయాలలో కూడా కొవ్వొత్తులు పెట్టుకొని సమీక్షలు పెట్టుకుంటున్నారు.

మహిళల పరిస్థితి ఇంకా దయనీయంగా ఉన్నది ఎందుకంటే వారు పొద్దున్నే పిల్లలను పాఠశాలలకు పంపించాలి. భర్తకు క్యారియర్ రెడీ చేయాలంటే ఇంట్లో నీళ్లు ఉండాలి. మన జీవితాలన్నీ కరెంట్ మీద ఆధారపడి బతుకుతున్న పరిస్థితులలో విద్యుత్ కోతల వల్ల ఏ ఒక్క వస్తువు కూడా పని చేయని పరిస్థితులు ఏర్పడ్డాయి. గర్భిణులు ఆపరేషన్ కోసం ఆసుపత్రులకు వెడితే టార్చి లైట్లు పెట్టుకొని ఆపరేషన్ చేశారంటే ఈ ప్రభుత్వ పనితీరుకు ఇంతకంటె నిదర్శనం ఇంకొకటేమైనా ఉన్నదా అని అడుగుతున్నాను.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు షేమ్, షేమ్ అని అన్నారు)

ఇవ్వాళ అన్ని పత్రికలలో పతాక శీర్షికలలో వచ్చినా మీరు ఆల్టర్‌నేటివ్ అరేంజ్‌మెంట్ చేసుకోమని చెబితే ఆసుపత్రుల వారు ఎక్కడి నుంచి చేసుకుంటారు? ఆల్టర్‌నేటివ్ అరేంజ్‌మెంట్ చేసుకోవడానికి జనరేటర్లకు మీరేమైనా నిధులిచ్చారా అని నేను అడుగుతున్నాను.

చేనేత కార్మికులకు సంబంధించి ట్యూబ్‌లైట్లు ఉంటే తప్ప మా ఉరవకొండలో మగ్గాలు ముందుకు సాగవు. ఉరవకొండలో గతంలో పన్నెండు వేల మగ్గాలుంటే ఇప్పుడు కేవలం రెండు వేల మగ్గాలకు మించి పని చేయని పరిస్థితికొచ్చింది. చీకట్లో ఉండి గుంతల్లో కూర్చుని పని చేసుకునే చేనేత కార్మికునికి మగ్గం మీద ట్యూబ్‌లైటు ఉంటే తప్ప ఒక నేత పని ఒక అంగుళం ముందుక పోదు. అటువంటి పరిస్థితుల్లో చేనేత కార్మికులు వారి ఉపాధిని కొనసాగించుకోలేని పరిస్థితిలోకి వచ్చారు.

గ్రామాలలో త్రాగు నీటికి సంబంధించి కటకట మొదలైంది. ప్రభుత్వం మాత్రం ఒకటే లైన్‌లో ఉన్నది. పగటి పూట సూర్యకాంతి మీద ఆధారపడండి, రాత్రి పూట చంద్రుడి మీద ఆధారపడమని సలహా చెప్పి ప్రభుత్వం ముందుకు పోతున్నది తప్ప ఇంకొకటి కాదు. ఇవి నేను చెప్పే మాటాలు కావు. సాక్షాత్తూ డి.సి.సి.ప్రెసిడెంట్ చెప్పిందేమిటంటే రాష్ట్రంలో కరెంట్ కష్టాలకు కారణం ప్రకృతి అనే

స్టేట్‌మెంట్‌నిచ్చి చేతులు దులిపేసుకునే ప్రయత్నం రాష్ట్ర పాలకులు చేస్తే ఏ రకంగా మేం అర్థం చేసుకోవాలి? సామాన్యుడు ఏ రకంగా అర్థం చేసుకుంటాడని నేను ప్రశ్నిస్తున్నాను.

రాష్ట్రంలో ఏడు గంటల కరెంట్ కాదు ఏడు నిమిషాల కరెంట్ కూడా గ్రామాలకు సరఫరా కావడం లేదంటే దీనికంతా కారణం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థత, అవినీతి, ఆలోచనారాహిత్యం, అవగాహనారాహిత్యం, ముందుచూపు లేకపోవడమేనని నేను కచ్చితంగా చెప్పగల్గుతాను. విద్యుత్ కోసం కష్టపడుతూ ప్రజలుంటే మరొకవైపు రూ.31,000 కోట్ల భారాన్ని ఈ రాష్ట్రంలో కరెంట్ బిల్లుల రూపంలో వేస్తే ప్రజలు ఏ రకంగా తట్టుకుంటారని నేను ప్రశ్నిస్తున్నాను. రాష్ట్రంలో కరెంట్ వైర్లు ముట్లుకుంటే కాదు కరెంట్ బిల్లులు ముట్టుకుంటే షాక్ కొట్టే పరిస్థితి కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వంలో ఉన్నది.

గతంలో చంద్రబాబునాయుడు గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వారు నిద్ర పోకుండా సమీక్ష చేసి ఈ రాష్ట్ర ప్రజలు నిద్రపోయే పరిస్థితులు కల్పించేవారు. రాష్ట్రంలో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోయే పరిస్థితులు ఉండేవి. ఈ రాష్ట్రంలోని ప్రజలు కరెంట్ లేనప్పుడు దోమలతో, ఉక్కపోతతో నిద్ర పోవడం లేదు. కరెంట్ ఉన్నప్పుడేమో కరెంట్ బిల్లుల భయంతో ప్రజలు నిద్రపోలేని పరిస్థితులలో ఉన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసిన కరెంట్ కోసం ధర్నాలు, రాస్తారోకోలు, అరెస్టులు, బందులు, బతకడం కోసం బందులు చేయాల్సిన దురవస్థ ఒక్క కరెంట్ విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం కల్పించే పరిస్థితికొచ్చింది.

ఉ.10.40

ఆఖరికి కరెంటు కోసం కరీంనగర్‌లో మా పార్టీ శాసనసభ్యులైన శ్రీ సి. విజయ రమణా రావు, శ్రీ సుద్దాల దేవయ్య తదితరులు ఉద్యమం చేపడితే మూడు రోజుల పాటు వారిని నిర్దాక్షిణ్యంగా ఈ ప్రభుత్వం జైళ్లో పెట్టింది. వాళ్లు చేసిన తప్పేమిటి సార్? ప్రభుత్వం చెప్పిన మాటను నిలబెట్టుకోవాలని వారు నిలదీస్తే, వాళ్లను జైళ్లలో పెట్టే పరిస్థితికి ఈ రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందంటే కేవలం పోలీస్ జులుంతో, పోలీస్ జులంతో శాసనసభ్యుల గొంతులు సైతం నొక్కాలనేటటువంటి మీ ఆలోచన సరైంది కాదనే విషయాన్ని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ఇవాళ మా గొంతులు నొక్కినంత మాత్రాన ప్రజల మనస్సులను మార్చలేరనేటటువంటి విషయాన్ని ఈ ప్రభుత్వం గుర్తుకు తెచ్చుకోవాల్సినటువంటి పరిస్థితి ఉంది. గౌరవ ముఖ్యమంత్రి గారు విద్యుత్‌కు సంబంధించిన అంశంపై ఎందుకు రెవ్యూ చేయలేకపోతున్నారనే విషయాన్ని నేను అర్థం చేసుకోగలను. వారి పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను. మేం ఆ రోజున శ్రీ చంద్రబాబునాయుడు గారి హయాంలో ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది, ఎన్ని మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయ లేదనే విషయాలను రెవ్యూ చేస్తే, ఇవాళ ఎంత మంది ఎమ్మెల్యేలు పార్టీలో మిగిలారు, ఎంత మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడి పోతున్నారనేది తెలుస్తుంది. ఆ విషయాలపైన రెవ్యూ చేసుకోవలసిన పరిస్థితుల్లో గౌరవ ముఖ్యమంత్రి గారున్నారు.

ఇవాళ ఎట్లాంటి రాష్ట్రాన్ని ఏ పరిస్థితికి ఈ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకువచ్చింది సార్.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: అధ్యక్షా..........

మిస్టర్ స్పీకర్: ఒక నిమిషం కేశవ్ గారు కూర్చోండి. శ్రీనివాసరావు గారు మాట్లాడండి?

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు (విశాఖపట్నం(దక్షిణం): అధ్యక్షా, గౌరవ స్పీకర్‌గా మీరు ఇచ్చిన సూచనమేరకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ప్రధానమైనటువంటి గవర్నర్ గారి ప్రసంగాన్ని కూడా చర్చ మధ్యలో నిలిపి, ప్రతిపక్షాలు వెలిబుచ్చే అభిప్రాయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని, ప్రధానమైనటువంటి చర్చగా భావించి ప్రభుత్వం చిత్తశుద్ధితో విద్యుత్ అంశాన్ని సభలో చర్చించాలని ముందుకు రావడం జరిగింది. ప్రతిపక్ష పార్టీలు విద్యుత్‌పై సలహాలు, సూచనలిస్తారని మేమంతా భావించాం. వారిచ్చే సలహాలు, సూచనలను బట్టి ఏమైనా ప్రభుత్వపరంగా లోటుపాట్లుంటే, వాటిని సవరించుకొని రాష్ట్రం ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని, నిర్మాణాత్మకమైన చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావించింది. సభలో ఉన్నటువంటి అందరూ ప్రజల చేత ఎన్నుకోబడిన వారే కనుక ప్రజలకు మేలు చేకూర్చాలనే ఉద్దేశం అందరికీ ఉంది కనుక అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రి గారు కూడా ప్రజాస్వామ్యవాది కనుక, వారు విద్యుత్‌పై చర్చ జరుగుతున్న సందర్భంగా ప్రతిపక్షపార్టీ సభ్యుల అభిప్రాయాలను, సలహాలను, సూచనలను పరిగణనలోకి తీసుకొని, నిర్మాణాత్మకంగా ప్రభుత్వం విద్యుత్ విషయంలో చేస్తున్న ప్రయత్నాలను, చర్యలను గురించి సభకు వివరించాలనే సదుద్దేశంతో ఉన్నారు. కానీ గౌరవ సభ్యులు కేవలం ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే సమయాన్ని వినియోగిస్తున్నారు. శ్రీ పయ్యావుల కేశవ్ గారు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదు. విద్యుత్ విషయంలో ప్రభుత్వం ఏ రకమైన చర్యలు చేపట్టలేదనే విషయాన్ని చెబుతున్నారు. కానీ వారి పార్టీ ప్రభుత్వం ఆనాడు ఎన్నికల అనంతరం, ప్రజల తిరస్కారానికి గురైన తదుపరి విద్యుత్ విషయంలో రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీకి అప్పజెప్పింది అందరికీ తెలిసిందే. ఆనాడు మీ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, వామపక్ష పార్టీలతో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన నాయకులు కలిసి విద్యుత్ విషయమై ప్రజాస్వామ్య పద్ధతుల్లో రాష్ట్ర రాజధాని నగరంలోని ప్రధాన ప్రదేశమైన బషీర్‌బాగ్‌లో మీ ప్రభుత్వం పైన ప్రజా ఉద్యమాన్ని చేస్తే, ఆనాడు మీ పార్టీ ప్రభుత్వం చేసిన నిర్వాకం ఏమిటి? ముగ్గురు అమాయకులు ఆనాడు జరిగిన పోలీస్ కాల్పుల్లో తుపాకి గుండ్లకు బలైపోయారా, లేదా అని అడుగుతున్నాను? అలాంటి మీరు ఈరోజున ఉద్యమాల గురించి మాట్లాడుతున్నారు. రాష్ట్రంలో శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం "తెరిచిన పుస్తకం" లాంటిది. ప్రతిపక్ష పార్టీలు సలహాలు, సూచనలిస్తారని మేం భావిస్తే, కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడానికే సమయం వృధా చేస్తూ గౌరవ సభ్యులు శ్రీ కేశవ్ గారు మాట్లాడడం తగదు. వారు అదే విధంగా ప్రభుత్వం పైన విమర్శలే చేయాలనుకుంటే, మేం కూడా ఊరుకునేదిలేదు.

మిస్టర్ స్పీకర్: కొంచెం ఓపిక పట్టండి శ్రీనివాస రావు గారు. దయచేసి మీరు కూర్చోండి. కేశవ్ గారు మీరు మాట్లాడండి?

శ్రీ పయ్యావుల కేశవ్: అధ్యక్షా, ముదిగొండలో ఇళ్ల స్థలాల కొరకు ఉద్యమం చేస్తున్న పేద ప్రజలపై కాకరాపల్లిలో కాల్పులు జరిపినటువంటి ఈ ప్రభుత్వంలోని పెద్దలు కూడా మాపైన మాట్లాడతారు. బషీర్‌బాగ్‌లో జరిగినటువంటి పోలీస్ కాల్పులకు సంబంధించిన అంశంపైన "దురదృష్టకరమైన సంఘటన" గా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం చాలా స్పష్టంగా ఆనాడే చెప్పింది. అవే కమ్యూనిస్ట్ పార్టీలు ఈరోజున నిరాహారదీక్షకు కూర్చున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాల్సిన అవసరముందనే విషయాన్ని మేం చెబుతున్నాం. పాలకులు కళ్లు తెరవాల్సిన అవసరముంది. మేం

చెబుతున్నదేమిటంటే రోల్‌బ్యాక్ చేయమని అడుగుతున్నాం. ప్రభుత్వం నిద్రపోతుంది, పాలకులు కళ్లు తెరవండి అని మేం అంటున్నాం. "అమ్ముకుంటాం, కుమ్ముకుంటాం" అనేటటువంటి కథనాలు ఈరోజున పతాక శీర్షికల్లో ప్రచురితమైనాయి. రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాలను ఉల్లంఘించి, ఈ రాష్ట్రానికి రావాల్సినటువంటి కరెంటును విద్యుత్ కంపెనీలు కరెంటును బయటి రాష్ట్రాలకు అమ్ముకుంటున్నా, ప్రభుత్వం నిద్రపోతోందనే విషయాన్ని పత్రికలు గగ్గోలు పెడుతుంటే, అదే విషయాన్ని ముఖ్యమంత్రి గారు సమీక్షించలేదనే విషయాన్ని మేం చెబితే, ముఖ్యమంత్రి గారి వెనుక కూర్చునటువంటి వీళ్లకు ఉలుకెందుకు సార్? వాస్తవాలు తప్ప మేమేం మాట్లాడం సార్. మీరు అధికారంలోకి వచ్చిన విషయాన్ని గుర్తు చేస్తున్నాను. రోల్‌బ్యాక్ అనే మాటను ప్రజలకు చెప్పి, అధికారంలోకి వచ్చిన మీ పార్టీ ప్రభుత్వం, ఈనాడు ఒకటి కాదు, రెండు కాదు, రూ.31,000.00 కోట్లు ప్రజల నెత్తిన ఈ ప్రభుత్వం బాదుతోందనే విషయాన్ని మేం చెబుతున్నాం. మా పార్టీ ప్రభుత్వం ఆనాడు వేల మెగావాట్ల విద్యుత్ జనరేషన్‌ను పెంచితే, వేల మెగావాట్ల చీకటిని ఈ ప్రభుత్వం మన రాష్ట్రానికి కురిపించే పరిస్థితిని తెచ్చింది. మా పార్టీ ప్రభుత్వ హయాంలో కూడా అప్పుడప్పుడు కరెంటు పోయేది కానీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో అప్పుడప్పుడు కరెంటు వస్తోంది. మన రాష్ట్రంలో కరెంటు విషయంలో ఉన్న పరిస్థితికి కారణం ఒక కిరణ్ కుమార్ రెడ్డి గారిదేనని నేను అనను. కచ్చితంగా ఆ విషయంలో రోశయ్య గారి పాలన ఉంది, అంతకు ముందు ఉన్నటువంటి డా.వైఎస్. రాజశేఖర్‌రెడ్డి గారి పాలన ఉంది. ఆ విషయాలన్నింటినీ నా ప్రసంగం మధ్యలో ప్రస్తావిస్తాను. ఎవరి నిర్వాకం వల్ల రాష్ట్రానికి విద్యుత్ విషయంలో ఈ పరిస్థితి దాపరించిందనే విషయాన్ని ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆ విషయాలను కచ్చితంగా నేను ప్రస్తావిస్తాను.

అయితే, ఈరోజు అధికారంలో ఉన్నటువంటి ముఖ్యమంత్రికి, వారికున్నటువంటి బాధ్యతను గుర్తుచేసేటటువంటి ప్రయత్నాన్ని నేను చేస్తున్నాను. విద్యుత్ సప్లై, డిమాండ్‌లపైన సరైనటువంటి నిరంతర పర్యవేక్షణ ప్రభుత్వానికి లేకపోవడం వల్ల, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా గతంలో డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ఏ మాత్రం విద్యుత్ జనరేషన్ పెంచేటటువంటి ప్రయత్నం, నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల ప్రస్తుతం రాష్ట్రం ఈ పరిస్థితుల్లో ఉంది. కానీ ముఖ్యమంత్రి గారికి పవర్ ఏంటో తెలియదు? పవర్ ఎక్కడుంది, ఎట్లా వస్తుంది అని తెలియదు అని చెప్పేటటువంటి దుస్సాహసం నేను చేయను. కచ్చితంగా ముఖ్యమంత్రి గారి ఆలోచన అవగాహన పట్లగానీ నాకు సంపూర్ణమైనటువంటి విశ్వాసం ఉంది. కచ్చితంగా పవర్ ఎక్కడుందనే విషయం వారికి తెలుసు. వారి పవర్ సెంటర్ ఢిల్లీ అనే విషయం కూడా వారికి తెలుసు. ఆ పవర్‌ను ఎట్లా తెచ్చుకోవాలో, ఆ పవర్‌ను ఎట్లా రిటైన్ చేసుకోవాలో, ఎవరి పవర్‌ను ఎట్లా కట్ చేయాలో, ఏ రకంగా పోటీదారుల పవర్‌ను లిమిట్ చేయాలనే విషయాల పట్ల వారికి పూర్తి స్పష్టత ఉంది.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి : అధ్యక్షా ...........

మిస్టర్ స్పీకర్: కేశవ్ గారు, దయచేసి ఒక నిమిషం కూర్చోండి. గౌరవ ముఖ్యమంత్రి గారు మాట్లాడతారు.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి (ముఖ్యమంత్రి): స్పీకర్ సార్, విద్యుత్ అనే అంశం చాలా ప్రాముఖ్యత కల్గిన అంశం. ప్రజా సమస్య కాబట్టి ప్రతిపక్షపార్టీ సభ్యులను మీ ద్వారా కోరుతున్నాం. జనరల్‌గా స్వీపింగ్ రిమార్క్స్ చేయకుండా కాంక్రీట్‌గా సలహాలిస్తే, ఎందుకు విద్యుత్ కొరత రాష్ట్రానికి వచ్చింది, ఆ కొరత నుండి ఏ విధంగా రాష్ట్రం గట్టెక్కాలి, ఏ విధంగా విద్యుత్ చార్జీలను తగ్గించుకోవచ్చు

అనే విషయాలపైన ప్రతిపక్షాలను సలహాలను, సూచనలను ఇవ్వమనండి. విద్యుత్‌పైన సభలో చర్చ జరగాలనేటటువంటి తాపత్రయం నాకు చాలా ఉంది. ప్రతిపక్షాలు మంచి సలహాలు, సూచనలిస్తారని నేను భావించాను. వాటిని పరిగణనలోకి తీసుకొని విద్యుత్ కొరత నుండి రాష్ట్రం గట్టెక్కే మార్గాలను అన్వేషిద్దామనే ఉద్దేశంతో మేమంతా ఎదురుచూస్తున్నాం. విద్యుత్‌కు సంబంధించి ప్రస్తుత పరిస్థితి నుంచి గట్టెక్కించాలనే తాపత్రయం నాకు చాల ఉంది. అందుకే మంచి సలహాలు ఇవ్వాల్సిందిగా మేం ప్రతిపక్షాలను కోరుతున్నాం. అనవసరంగా స్వీపింగ్ రిమార్క్స్, పొలిటికల్ రిమార్క్స్‌పైన మనం మళ్లీ మాట్లాడుకోవచ్చు. విద్యుత్ అంశం చాలా సీరియస్ ఇష్యూ. రాష్ట్రంలో చాలా ఇబ్బందికరమైన పరిసిత్థి విద్యుత్ విషయంలో ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నేను ఆ విషయాన్ని కాదనడం లేదు. విద్యుత్ విషయంలో ప్రభుత్వానికి ప్రతిపక్షాలు సరైన సలహాలు, సూచనలివ్వాల్సిన అవసరముంది. వాటిని పరిగణనలోకి తీసుకొని ఏ విధంగా విద్యుత్ కొరత నుండి రాష్ట్రం గట్టెక్కాలనే విషయాన్ని అందరం పరిశీలిద్దాం. శ్రీ పయ్యావుల కేశవ్ గారు చాలా చక్కగా ప్రసంగిస్తారు. కానీ కన్‌స్ట్రక్టివ్‌గా మాట్లాడితే చాలా బాగుంటుందనేదే వారికి నా సలహా.

MR.SPEAKER: Let us confine ourselves to the subject, Keshav garu.

శ్రీ పయ్యావుల కేశవ్: తప్పకుండా సార్. సబ్జెక్ట్‌పైన మాట్లాడే సమయంలో తప్పకుండా ఆ విధంగా మాట్లాడాల్సి వస్తుంది. పాలకుల మీద విమర్శ అనేది లేకపోతే పాలకులు నిద్రపోతారు. విమర్శించడమనేది ప్రతిపక్షానికి ఉన్నటువంటి ప్రధానమైన బాధ్యత. దాన్ని మీరు గుర్తించాలి. కేవలం పాలకులను పొగడడానికో, నాలుగు సూచనలిచ్చి ఇక్కడ నుంచి పోవడానికో ప్రతిపక్షం సభకు రావడం లేదు సార్. ఒక ముళ్లకర్రతో బర్రెను ఎలా గుచ్చుతామో అదే విధంగా అధికారపక్షాన్ని కూడా ప్రతిపక్షం విమర్శలతో గుచ్చకపోతే, ప్రభుత్వం పనిచేయదు. నేను చేస్తున్నటువంటి విమర్శల్లో ఎక్కడైనా తప్పుంటే కచ్చితంగా చెప్పండి అంతే గానీ విమర్శలే చెయొద్దని చెప్పడమనేటటువంటిది సరైనది కాదు. నేను ఒకటే ముఖ్యమంత్రి గారికి చెప్పాను.

మిస్టర్ స్పీకర్: మంచి సలహాలు ఇవ్వమని గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆ విధంగా మాట్లాడండి కేశవ్ గారు?

శ్రీ పయ్యావుల కేశవ్: సార్, ఇవాళ పవర్ ఎక్కడుంది? నార్త్‌బ్లాక్‌లో పవర్ ఉంది. ఆ విషయం కూడా వాళ్లకు స్పష్టత లేదు. రూ. 1.25 పైసలకు యూనిట్ పవర్ నార్త్‌లో దొరుకుతుంటే, ఇక్కడ మనం రూ. 5.00 లకు యూనిట్ చొప్పున పవర్‌ను కొనుక్కుంటున్నాం. పవర్ ఎక్కడుందనే విషయమై ముఖ్యమంత్రి గారికి స్పష్టంగా తెలియజెప్పే ప్రయత్నం నేను చేశాను తప్ప వేరేమి కాదు. ముఖ్యమంత్రి గారికి పవర్ మీద ప్రేమ ఎక్కువగా ఉందనే విషయం కూడా నాకు తెలుసు. రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గంలో పవర్‌కు సంబంధించి వేరుగా మంత్రే లేడు సార్. విద్యుత్‌కు సంబంధించిన శాఖను గౌరవ ముఖ్యమంత్రి గారే పర్యవేక్షిస్తున్నారు. కాబట్టి ఆ పవర్ మీద, ఈ పవర్ మీద ముఖ్యమంత్రి గారికి చాలా అభిమానం ఉందనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ముఖ్యమంత్రి గారి పైన మేం ఎందుకు విమర్శలు చేస్తాం సార్? మొదటిది శాఖాపరంగా వారికి బాధ్యత ఉంది, రెండవది ప్రభుత్వానికి అధినేతగా వారి పైన బాధ్యత ఉంది. ఈరోజున రాష్ట్ర ప్రజల కష్టాలకు బాధ్యుడిగా కచ్చితంగా వారి మీద మేం విమర్శలు చేసిన తరువాతనే మేం ప్రభుత్వానికి చెప్పాల్సిన విషయాల్ని చెబుతాం. ముఖ్యమంత్రి గారు అద్భుతమైన ఐడియాలిచ్చారు. He has given

wonderful ideas to the people. కరెంటు లేకుంటే కిటికీలు తెరుచుకోండని ప్రజలకు ముఖ్యమంత్రి గారు ఐడియా ఇచ్చారు. ఎట్లా సార్? అంటే ఎ.సి.లు ఆపుకోండి అని చెప్పారు. అంటే రాష్ట్ర ప్రజలు ఇవాళ కంజర్వేషన్ అనేటటువంటిది "క్వాలిటీ ఆఫ్ లైఫ్" తో కాంప్రమైజ్ కాకూడదు. "క్వాలిటీ ఆఫ్ లైఫ్" తో కాంప్రమైజ్ కాకుండా మనం కంజర్వేషన్ గురించి చెప్పాల్సినటువంటి పరిస్థితి వచ్చింది. ఇవాళ సెక్రటేరియేట్‌లో ఉన్నటువంటి అధికారులు గానీ, మంత్రులు గానీ ఎంతమంది కిటికీలు తెరుచుకొని పనిచేస్తున్నారు? మనం పాటించకుండా, మనం చెప్పకుండా, మనం ముందుగా చేయకుండా ప్రజలను మాత్రం కిటికీలు తెరుచుకొని పడుకోండని అంటే, కిటికీలు తెరుచుకొని పడుకునేటటువంటి పరిస్థితి ఈ రాష్ట్రంలో ఉందా సార్? ఒకవైపు దోమలు మరోవైపు దోపిడీలు, దొంగలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారు. ఏ రకంగా కిటికీలు తెరుచుకొని పడుకునేటటువంటి పరిస్థితులు ఈ రాష్ట్రంలో ఉన్నాయనే విషయాన్ని నేను గుర్తుచేస్తున్నాను. వెలుతురు ఉండగానే అన్ని చక్కబెట్టుకోమని ప్రజలకు ఇంకో మంత్రి చెప్పినటువంటి స్టేట్‌మెంట్ పత్రికల్లో ఇటీవలే వెలువడింది. కాంగ్రెస్ పార్టీ ట్యాగ్‌లైన్. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోండనేటటువంటిది కాంగ్రెస్ పార్టీ ట్యాగ్‌లైన్. అదే విషయాన్ని ప్రజలందరికీ తెలియజేసేటటువంటి ప్రయత్నాన్ని ఈరోజు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తోంది. ఒకే ఒక చిన్న సలహా చెబుతున్నాను. సోనియా కొవ్వొత్తులు, రాహుల్ విసనకర్రలు కూడా సబ్సిడీ మీద ఇంట్రడ్యూస్ చేయండి. అప్పుడు ఈ రాష్ట్ర ప్రజలు కొంతైనా ఉపశమనం పొందుతారనేటటువంటిది నేను కచ్చితంగా ఈ సందర్భంలో గుర్తుచేస్తున్నాను. ఇవాళ వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఖర్చు ఎంత సార్?

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి: అధ్యక్షా ..........

మిస్టర్ స్పీకర్: ఒక నిమిషం కూర్చోండి కేశవ్ గారు, వెంకట రమణారెడ్డి గారు మీరు మాట్లాడండి?

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి (భూపాలపల్లి): అధ్యక్షా, ప్రతిపక్షాలు ఇచ్చే సలహాలు, సూచనలు తీసుకొని విద్యుత్ సమస్య నుంచి ఏ విధంగా గట్టెక్కాలనే విషయాన్ని ఆలోచిస్తుందనే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు చాలా స్పష్టంగా చెప్పారు. రాష్ట్రంలో గ్యాస్ సప్లై సరిగా లేనందున విద్యుత్ కొరత రాష్ట్రానికి సంభవించింది. వర్షాలు సకాలంలో కురవక, జలాశయంలో నీటి నిల్వలు పడిపోయిన కారణంగా విద్యుత్ కొరత ఏర్పడింది. ఆ కారణంగా పవర్ జనరేషన్ నిల్చిపోయిన పరిస్థితి ఉంది కాబట్టి ప్రతిపక్షాలు సలహాలు, సూచనలు ఇస్తారని ప్రభుత్వం భావిస్తే, ప్రతి విషయాన్ని కేవలం విమర్శించడానికి పనిగట్టుకొని సభా సమయాన్ని వృధా చేయడం గౌరవ సభ్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారికి తగదు.

ఉ.10.50

అధ్యక్షా, పయ్యావుల కేశవ్ గారు మాట్లాడుతున్నారు, కానీ వారు ప్రభుత్వానికి మంచి సూచనలు, సలహాలు ఇస్తే వీలైనంత మటుకు వాటిని పరిశీలించి ప్రజలకు ఇబ్బంది కలుగ కుండా ప్రభుత్వం పనిచేయడం జరుగుతుంది. ఒక సందర్భం వచ్చింది, అదేమనగా, రాష్ట్రంలో పవర్ సప్లై లేక వర్షాలు సరిగా పడక, జలాశయాల్లో నీరు లేక, పవర్ జనరేషన్ లేక, రాష్ట్రంలో గ్యాస్ ఆశించిన విధంగా సరఫరా లేక రాష్ట్రంలో విద్యుత్ సమస్య తలెత్తే పరిస్థితి నెలకొని ఉంది.

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం )

ఉండండి, వినండి, మీరు ఇచ్చే సలహా దానిని పాజిటివ్‌గా తీసుకొనే విధంగా నిర్మాణాత్మక మైనదిగా, ప్రభుత్వం పరిగణలోకి తీసుకునే విధంగా కాకుండా కొవ్వత్తులు, విసన కర్రలకు పేర్లు పెట్టండనీ చాలా అద్బుతంగా మాట్లాడు తున్నారు సార్. వాళ్ల హయాంలో నేనొక జిల్లా కాంగ్రెస్ ప్రెసిడెంట్‌గా పంటలు ఎండిపోయిన రైతుల పక్షాన ప్రభుత్వానికి నిరసన తెలుపు తున్నప్పుడు, మమ్మల్ని తీసుకెళ్లి వీళ్లు జైళ్లలో పెట్టారు. వీళ్లకు చరిత్ర లేదా ? ప్రభుత్వం విద్యుత్‌పై చర్చ పెట్టింది. చర్చలు సందర్భంగా ఏరకమైన సూచలు చేస్తారా అని చాలా రోజుల నుండి ప్రభుత్వం చిత్త శుద్ధితో ఎదురు చూస్తోంది.

విద్యుత్ సమస్యపై డిబేట్‌కు రండి మేము చెప్పడానికి సిద్ధంగా ఉన్నామని పభుత్వం తరఫున మీ అధ్యక్షతన జరిగిన బిఏసిలో ముఖ్యమంత్రి గారు చెప్పారు. అలా రాకుండా, సభ జరగనీయకుండా, రోజూ సభను వాయిదాల మీద వాయిదాలు వేయిస్తూ, సభ నడవ నీయకుండా చేయడం ప్రశ్నోత్తరాల సమయం లేకుండా చేయడం-చేసే వీళ్లా సార్ చెప్పేది. మొన్న సభలో చర్చ జరిగే విధంగా సహకరిస్తే చర్చ జరిగి ఉండేది. చర్చ జరిగితే డొల్లతనం వాళ్లదే బయట పడుతుంది. ఈ ప్రభుత్వం ఎంత పాజిటివ్‌గా ఉంది. ప్రజలకు ఏ రకమైన మేలు చేస్తోందన్న విషయాలు కూడా చెబుతుంది. దయచేసి వినే ఓపిక ఉండాలి. ఏవైనా పాజిటివ్‌గా ప్రజల తరఫున మేలైన సూచన లివ్వమనండి. విమర్శలు చేయడమే కాదు, మీ విమర్శలు ఒక పాజిటివ్ వే లో తీసుకుంటాము కానీ, విమర్శ లతోనే మేము బ్రతుకు తామంటే కాదు.

మిస్టర్ స్పీకర్ : కేశవ్‌లు గారు మీరు.

శ్రీ పి.కేశవ్ : సార్ పదే పదే ఫ్లోర్‌ను ఇంటరప్ట్ చేయడం వంటిది ఒక వ్యూహాత్మకంగా జరుగుతున్న దాడిగా నేను భావించాల్సిన పరిస్థితి ఉంది. నేను సీరియస్‌గా ఒక అంశాన్ని చెప్పినప్పుడు దానిని వారు వినాలి మీరు వాళ్లకు సమయం ఇస్తారు, కాబట్టి వారు సమాధానం తరువాత చెప్ప వచ్చు. కేవలం ఫ్లోర్‌ను సవ్యంగా జరగ నీయకుండా అడ్డుకునే ఉద్దేశంతో ఆ విప్ గారు, ఈ విప్‌గారు, తప్పులు పట్టే ప్రయత్నం చేస్తున్నారు మిగిలిన సభ్యులు వింటున్నారని నేను అనుకుంటున్నాను.

ఈవేళ నేను ఒక్కటే చెపుతున్నాను సార్, ఎన్నికల ప్రణాళికలో వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పారు. ప్రస్తుతం పల్లెల్లో విద్యుత్ సమస్య భయంకరంగా ఉంది. తోటలు ఎండి పోతున్నాయి, నార్లు ఎండిపోయిన పరిస్థితి, ఒకవైపు. మరీ ముఖ్యంగా మా దగ్గర ట్యాంకర్స్‌తో నీళ్లు తోడుకొని పాదులు తడిపే ప్రయత్నం చేస్తున్నారు. ఎందుకంటే ఈ సంవత్సరం ఈ ఎండా కాలం గట్టెక్కితే, రేపైనా పంట చేతికి తీసుకుంటామనే ఆశాభావం రైతుకు ఉంది. ట్రాన్స్‌ఫార్మర్లు ఓవర్ లోడ్ అయ్యాయి. ఎక్కడా కూడా ట్రాన్స్ ఫార్మర్లు ఇచ్చే పరిస్థితి లేదు. ఎక్కడ చూసినా ఈ రోజు ఉన్నటువంటి పెండింగ్ ట్రాన్‌సఫార్మర్ల సంఖ్య 20,000 లకు దాటి పోయింది. ఒక్క అనంతపురం జిల్లాలోనే 20,000. ఉన్నాయంటే ఈ రాష్ట్రంలో లెక్క పెట్టుకుంటే 2,00,000. లేదా 3,00,000.ల కనెక్షన్స్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటుకై ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. అనంతపురం జిల్లాలో 20,000 ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉంటే నెలకు 500 ట్రాన్స్‌ఫార్మర్లు, అని చెప్పి 250 ట్రాన్స్‌ఫార్మర్లు ఇస్తున్నారు.

ఈ 250 ట్రాన్స్‌ఫార్మర్లలో దాదాపు 70 కమర్షియల్ యూజ్‌కి కాగా మిగిలిన 180 ట్రాన్స్‌ఫార్మర్లు రైతులకు మిగిలితే జిల్లాలోగల 63 మండలాలకు ఒక్కో మండలానికి మూడు ట్రాన్స్ ఫార్మర్లు ఇచ్చి ఏ రకంగా రైతులను మీరు ఆదుకుంటున్నారనేది నేను ఉదాహరణలతో సహా చెబుతున్నాను. ఒక్క గ్రామంలో మూడు ట్రాన్స్-ఫార్మర్లు ఇచ్చినా సరిపోనటువంటి పరిస్థితుల్లో మండలానికి మూడు ట్రాన్స్ ఫార్మర్లు ఇచ్చి సర్దుకోమనేటువంటి పరిస్థితి ఈ రోజు ఉంది.

గ్రామలకు వెళితే 18 గంటల విద్యుత్ కోత కనిపిస్తున్నది. అధికారికంగా 12 గంటల విద్యుత్ కోత ఉంది సార్, 8 గంటల పాటు విద్యుత్ కోత మండల కేంద్రాల్లోనూ, హైదరాబాద్ లాంటి నగరాల్లోకి వచ్చే సరిగి 4 గంటలు విద్యుత్ కోతలు కనిపించే పరిస్థితి ఉంది. దీన్ని ఏ రకంగా ప్రభుత్వం సమర్థించు కుంటోందని నేను అడుగుతున్నాను అధ్యక్షా. మా ఊర్లో నేను వాడుకుంటున్న గృహావసర విద్యుత్ బిల్లు, ఈ రాష్ట్రంలో ముఖ్యమంత్రి గారు కట్టే విద్యుత్ బిల్లూ ఒకటే సార్. నేను పల్లెలో ఏ రకంగా కడుతున్నానో ముఖ్యమంత్రి గారు హైదరాబాద్‌లో అదే బిల్లు కట్టేటప్పుడు మాకు 12 గంటల విద్యుత్ కోత ఏ రకంగా సమర్థిస్తారు. వారు నిన్ననే చెప్పారు, రాగ ద్వేషాలకు అతీతంగా నిష్పక్ష-పాతంగా పాలన సాగిస్తున్నాను అని చెప్పి పల్లెల్లో వాళ్లకు పట్టణంలో వాళ్లకు ఆ రకంగా వివక్షత చూపే అధికారం మీకు ఎక్కడిచ్చిందీ రాజ్యాంగం ? మీరు ప్రమాణం చేసినటువంటి రాజ్యాంగం మీకు అనుమతి ఇచ్చిందా అని నేను ముఖ్యమంత్రి గారిని ప్రశ్నిస్తున్నాను.

ఈ-వేళ వివక్ష అనేటటు-వంటిది రాజ్యాంగంలో లేదు సార్, రాజ్యాంగం కాకపోయినా ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్‌లో రూల్ 5 క్లాజ్ 1 చాలా స్పష్టంగా చెపుతోంది. ఒకే రకంగా ఒకే క్యాటగిరి క్రింద బిల్లులు చెల్లించేటటువంటి వ్యక్తుల మధ్య ఏ రకమైనటువంటి వివక్ష ఉండ కూడదు అనేటటువంటిది ఉంది. పల్లెల్లో ఉన్నటువంటి, మేము రెండవ తరగతి పౌరులమా సార్ ? ఈ దేశ పౌరులు, రాష్ట్ర పౌరులము కాదా ? లేకపోతే హైదరాబాద్‌లో ఉన్నటువంటి ప్రేమ పల్లెల్లో ఉన్నటువంటి వారి మీద ఎందుకు లేదు అని నేను ప్రశ్నిస్తున్నాను. కచ్చితంగా దీనికి సమాధానం ఈ సమావేశంలోనే చెప్పి తీరాలి. లేదా విద్యుత్ కోతలు ఎత్తివేయాలి. ఇప్పటికే మేము ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమీషన్‌కు ఈ కంప్లెయింట్ ఇచ్చాము, మానవ హక్కుల కమీషన్‌కు కూడా కంప్లెయింట్ ఇచ్చాము.

మాకు ఉపాధిని కూడా లేకుండా చేసే ప్రయత్నమే ఈ విద్యుత్ కోతలు. ఈ వేళ మన జీవితం మొత్తం పవర్ టూల్. పల్లెల్లో కరెంట్ పోతే ట్రాక్టర్‌కు పంచర్ వేయలేరు. టైరు బండి పంచరు వేయక పోతే ముందుకు సాగనటువంటి పరిస్థితి. చెక్కపని చేసుకోవాలంటే పవర్ టూల్స్ మీద ఆధారపడే పరిస్థితి. మా ఉపాధిని కూడా లేకుండా చేసి జీవించే హక్కునే కాల రాస్తున్న ప్రభుత్వాన్ని మానవ హక్కుల ఉల్లంఘన కింద కూడా ప్రాసిక్యూట్ చేయాలని నేను కోరుతున్నాను. లేదంటే ఈ వివక్షతను ఎత్తివేయాలి. నేను అడిగేది ఒక్కటే సార్ మీ పరిస్థితి అర్థం చేసుకోగలం ఈ వేళ హైదరాబాద్‌లో విద్యుత్ నిస్తూ, మాకు పల్లెల్లో ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తూ, ఒక్క సారిగా సాయంత్రం ఆరు గంటలకు కరెంట్ ఇస్తే ఓవర్ లోడ్ అయిపోతున్నాయి. ఎందుకంటే మోటర్లు గానీ ,గిరిడీలు కానీ ఏక కాలంలో అన్నీ ఆఫ్/ఆన్ అయ్యే సరికి, రాత్రికి భోజన సమయం లోపే ఒకటికి పదిసార్లు కరెంట్ పోయే పరిస్థితి. అన్నం ప్లేట్‌లో పెట్టుకున్న తరువాత ముద్ద నోట్లోకి పోయే లోకే కరెంట్ పోయే పరిస్థితి గ్రామాల్లో నెలకొని ఉంది సార్, ఇది వాస్తవం సార్. ఇక్కడున్నటువంటి మంత్రులు కానీ అధికారులు కానీ, ఒక్క రోజు పల్లెలో ఉండి ఈ రాష్ట్రాన్నీ నడపండి అప్పుడు పరిస్థితి అర్థమౌతుంది. కనీసం కనికరం చూపండి, జాలి చూపండి.

పల్లెల్లో ఉండేటువంటి పేదల మీద గానీ, ప్రజల మీద కానీ, కొంతైనా వారికి వెసులుబాటు కల్పించండి. మీరు పూర్తిగా విద్యుత్ ఇవ్వలేరు. కొంతైనా వెసులుబాటు కల్పించే ప్రయత్నం చెయ్యండి. పగలంతా విద్యుత్ సరఫరా చేస్తారా, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇస్తారా అనేటువంటిది మీరు ఆలోచన చేయాల్సిన పరిస్థితి ఉంది.

ఈ వేళ ప్రభుత్వంలో ఎక్కడ చూసినా పంటలకు నిప్పు పెట్టి రోడ్ల కెక్కిన రైతాంగాన్ని ఈ రాష్ట్రంలో చూశాం. అయినా కూడా పరిస్థితిలో మార్పు లేదు సార్. ఈ ప్రభుత్వం ఇచ్చే కరెంట్ అర్ధరాత్రి పూట ఇచ్చే పరిస్థితి సార్. పాము కాట్లకు కరెంట్ వైర్లకు ఈ రాష్ట్రంలో ఒకరు కాదు, ఇద్దరూ కాదు సార్ 4000 మంది రైతులు కరెంట్ కాటుకు బలై పోయారు. వారికి ఇంతవరకు నష్టపరిహారం కూడ ఇవ్వని పరిస్థితి ఉంది. ఈ ప్రభుత్వం ఇచ్చే అర్ధరాత్రి, అపరాత్రి కరెంట్‌తో మొగుడు మోటర్ తోటి, పెళ్లాం స్టాటర్ తోటి, ఉండాల్సిన పరిస్థితి ఈ ప్రభుత్వం హయాంలో దక్కింది. ప్రజలు సుఖంగా కాపురాలు చేసుకొనే పరిస్థితి లేకుండా ఉంది.

ఇక ఈ రాష్ట్రంలో రైతులకు మొన్న నీళ్లు ఇవ్వలేదని క్రాప్ హాలిడే ప్రకటిస్తే ప్రభుత్వం మీకు ఆ కష్టం ఎందుకని కరెంట్ హాలిడేను ఇచ్చేటువంటి పరిస్థితి వచ్చింది. పవర్ హాలిడేతో పరిశ్రమలకు 12 రోజుల నుంచి 15 రోజుల పాటు విద్యుత్ కోతలు విధించిన ఏకైక ప్రభుత్వం, ఈ కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వం సార్ . ఈ వేళ 40 నుండి 50 శాతం విద్యుత్ కోత విధించారు. దీని వల్ల స్మాల్ అండ్ మీడియం మైక్రో ఎంటర్ ప్రైజస్‌తో రూ.6,00,000. కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని మా సోదరి గీతారెడ్డిగారు ఒక ప్రకటన చేశారు. ఉండేటువంటి 11,000 పరిశ్రమలు మూతపడి, మరో 20,000 పరిశ్రమలు మూత పడే దిశగా సాగే తరుణంలో మిమ్మల్ని నమ్ముకొని మీ పరిస్థితులను చూసి ఈ రాష్ట్రంలో ఏ ఒక్కరూ ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తారా అనేది మీరు ఆలోచించాలి.

ఉన్న పరిశ్రమలను అభివృద్ధి చేయకుండా, ఈ రాష్ట్రంలో ఒక్కో యూనిట్‌కి ధర రూ.32/- చెల్లించి పరిశ్రమలు నడుపు తున్నారు. వీళ్లు వేసిన పెనాలిటీలు 60 శాతం దాటితే 7,8 సార్లు పెనాలిటీలు పెంచితే రూ.32/- చెల్లించి కూడా నడుపుకునే ప్రయత్నం చేశారు. ఎందుకంటే పది సంవత్సరాల నుంచి వ్యాపారం చేస్తు తమకు ఆర్డర్స్ ఇచ్చిన వారు ఎక్కడ క్యాన్సిల్ చేస్తారో క్యాన్సిల్ చేస్తే భవిష్యత్‌లో ఆర్డర్స్ రాకుండా పోతాయనే భయంతో నష్టాలకు సిద్దపడి బిల్లులు చెల్లిస్తుంటే, ఈ ప్రభుత్వం ఏ రకంగా పరిశ్రమలను ఆదుకొంటుంది. ప్రక్కన ఉన్నటువంటి గుజరాత్ మనల్ని చూసి కాపీ కొట్టిన రాష్ట్రం సార్, ఈ రోజు రైతాంగానికి 8 గంటల పాటు నిరంతరాయంగా ఒకే సారి విద్యుత్ సరఫరా చేస్తుంది.

పరిశ్రమలకు కావల్సినంత మేరకు విద్యుత్ సరఫరా చేస్తుంది. 23,000 మెగావాట్ల స్థాపితం మనకన్నా వెనుక ప్రారంభమై మనకన్నా ముందుకు పోయింది. రాష్ట్ర ప్రగతిని గత 9 సంవత్సరాలలో నేనేమీ అమెరికా తోనో, చైనా తోనో, పోల్చలేదు. ఈ దేశంలోనే ఒక రాష్ట్రం విద్యుత్ రంగంలో మనకన్నా వెనుక ఉన్న రాష్ట్రం చంద్రబాబు నాయుడు గారు ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని వీళ్లకు అప్పగించిన రోజున మన కన్నా వెనుక ఉన్న గుజరాత్ రాష్ట్రం మన కన్నా విద్యుత్ రంగంలో ముందుకు పోయిందని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను.

ఈ రోజు ఫ్యాక్టరీలు చూస్తే వారి పరిశ్రమను దాదాపు తుక్కు సామానులకు అమ్ముకునేటువంటి పరిస్థితి వచ్చింది. దాదాపు 20,00,000 లక్షల మంది కార్మికులు రోడ్డున పడిన పరిస్థితి ఉంది. వాళ్లను ఏ రకంగా ఆదుకుంటారో ఈ రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఈ రోజు పరిశ్రమలకు విద్యుత్ నిలుపుదల చేసి ఇంకొకరికి ఇస్తున్నామని చెప్పటంలో రేపు వాళ్లిద్దరూ కూడా రోడ్డు ఎక్కితే ఈ రాష్ట్రం అల్లకల్లోలమౌతున్నటు వంటి పరిస్థితి ఈ సందర్భంలో మీకు గుర్తు చేస్తున్నాను. రాష్ట్రంలో రైతులలాగానే పారిశ్రామిక వేత్తలతోపాటు తాము నమ్ముకున్న కూలీలు కూడా ఆత్మ హత్యలు చేసుకొనే పరిస్థితికి వచ్చారు. స్టీలు కానీ, సిమెంట్ కానీ కెమికల్స్ కానీ, ఫుడ్ ప్రాసెసింగ్, పాలిషింగ్, ఫెరోలయిడ్స్ కానీ, స్పినింగ్ మిల్స్ కానీ, పవర్ లూమ్స్ కానీ, కోల్డ్ స్టోరేజ్‌లు కానీ, రైస్ మిల్లులు కానీ ఆఖరుకు మా జిల్లాలో ఉన్నటువంటి నాపరాయి కటింగ్ పరిశ్రమలు, ఇవన్నీ కూడా మూత పడే పరిస్థితి వచ్చింది. విద్యుత్ కోతలతో ప్రతి కుటుంబం కూడా తల్లడిల్లే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. కానీ టివీల్లో మాత్రం చూస్తుంటే ఈ వేళ ప్రతి ఒక్కరూ కూడా ప్రతి రాజకీయ పార్టీ ఒక టివీ ఒక పేపర్ పెట్టుకోవాలనేటువంటి ఆలోచనతో ఉంది.

ఉ.11.00

ప్రస్తుతం ప్రతి రాజకీయ పార్టీ ఒక టీవి చానల్, పేపర్ ఏర్పాటు చేసుకునే ఆలోచన ఉంది. ముఖ్యమంత్రి గారికి సంబంధించిన సన్నిహితులు, టీవి చానల్ గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేపడుతున్నారు. ముఖ్యమంత్రిగారి నుంచి కిరణాలు వెలువడుతూ ఉంటే, ఆ కిరణాల వెలుగులో ఈ రాష్ట్రం మొత్తం దేదీప్యమానంగా వెలుగుతూ ఉన్నట్టు అనుకుంటున్నారు. ఒక్కసారి పల్లెల్లోకి రండి సార్, మీ వెలుగు కిరణాలు పల్లెలకు కూడా సోకనీయండి. ఈ రాష్ట్రంలో 22,000 గ్రామాల్లోకి ఇంకా మీ వెలుగు కిరణాలు సోకలేదని గుర్తు చేస్తున్నాను. గతంలో రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన నడుచుకుంటూ వెళుతుంటే, ఆయన వెనకాల గంగమ్మ తల్లి నాట్యం చేసినట్లు, ఈ రాష్ట్రం మొత్తం జలమయమైనట్లు, పచ్చగా అయినట్లు చూపించారు. కానీ రాష్ట్రం ఎక్కడా పచ్చగా లేదు. రాష్ట్రాన్ని పచ్చగా చేయలేదు, వ్యవసాయాన్ని పండగ చేయలేదు, వారు చెప్పిన జలయజ్ఞంలో నీళ్లు పారులేదు. ప్రస్తుతం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు సభలో కూర్చొని ఒక్క ఎకరా భూమి కూడా తడవడంలేదని, అప్పుడు ఒక రకమైన గణాంగాలను ఇచ్చి, ఇప్పుడు గణాంకాలను మార్చేసి ఏ ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని, ఈ ప్రభత్వాన్ని అడుగుతున్నారు. మరి ఆరోజు ప్రకటనలో నిజమెంత? ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పి, ఉచిత సలహాలనిచ్చే పరిస్థితి మానుకోమని చెబుతున్నాం. విద్యుత్తు కష్టాలు తీరడానికి దేవుణ్ణి ప్రార్థించండని విశాఖపట్నంలో 19-12-2012లో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశంలో సాక్షాత్తూ ముఖ్యమంత్రిగారే చెప్పడం జరిగింది. దీనికి ఈ ప్రభుత్వం ఏరకమైన సంకేతాలనిస్తుంది ? కష్టమో, నష్టమో ఎంత ఖర్చు అయినా మిమ్మల్ని ఆదుకునేందుకు మేమున్నామనే విధంగా చెప్పడానికి బదులు దేవుడిపై భారం వేస్తున్నారు. ముఖ్యమంత్రి గారు పవర్‌లో ఉండటాన్ని మేము వ్యతిరేకించటం లేదు కానీ, ఈ రాష్ట్రానికి పవరుండాలని మాత్రమే మేము కోరుతున్నాం సార్.

శ్రీ గండ్ర వెంకటరమణా రెడ్డి : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు దేవుణ్ణి ప్రార్థించమని చెప్పారని మాట్లాడుతున్నారు, రాష్ట్రంలోని ప్రజలు సరక్షితంగా, సుభిక్షంగా, సంతోషంగా ఉండాలంటే భగవంతుని ఆశీర్వాదం అవసరమని, అది వర్షాలు ద్వారా వచ్చి వర్షాలు బాగా పడితే జలాశయాలు నిండి పంటలు బాగా పండుతాయనే ఉద్దేశంలో మాట్లాడితే దాన్ని కూడా వక్రీకరిస్తే ఎలా? వారు ఒక రకంగా సభను, యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. వారు ముఖ్యమంత్రి

అయినా, మేము యంఎల్ఏలమైనా వర్షాలకోసం భగవంతుడిపైనా, ప్రకృతిపైనా ఆధారపడవలసిందే, ప్రకృతి కనికరించి అనుకూలంగా ఉంటే వర్షాలు బాగా పడటం వల్ల, జలాశయాలలో నీరు నిండి కరెంటు నిర్విరామంగా వస్తుంది. ఆ ఉద్దేశంతో మాట్లాడితే దాన్ని వేరే రకంగా మాట్లాడం మంచి పద్ధతి కాదు.

శ్రీ పయ్యావుల కేశవ్ : సార్, ఆ ప్రకృతే కరుణిస్తే మధ్యలో వీళ్లెందుకు సార్ ? భవంతుణ్ణి నమ్మిన వ్యక్తిగా నేను చెపుతున్నాను, మీరు ప్రకృతి మీద భారంవేసి కూర్చుంటున్నారనేది మాకు ఎప్పుడో అర్థమైపోయింది. వారు స్వశక్తిగా ప్రయత్నించకుండా, దేవుడే ఈ రాష్ట్రాన్ని కాపాడాలని స్వయంగా చీఫ్ విప్ గారే ఒప్పుకున్నందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. మేము దీన్ని ఒక అధికారిక ప్రకటనగా భావిస్తున్నాం. రాష్ట్రాన్ని ప్రభుత్వం కాపాడదు, దేవుడే కాపాడాలనే పరిస్థితి ప్రస్తుతం నెలకొని ఉంది. చంద్రబాబు నాయుడు గారు కూడా కరవు కాలంలోనే ఈ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చారు. ఆ రోజు కూడా జలాశయాలు లేవు. కరవులో, కష్టాల్లో తొమ్మిది గంటల కరెంటునిచ్చి వాచీ సరిచూసుకునేవిధంగా సమయాన్ని పాటించిన ఘనత ఈ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకే దక్కిందని ఈ సందర్భంగా గుర్తుచేస్తున్నాను.

(ఈ దశలో తెలుగుదేశం పార్టీ సభ్యులు బల్లలు చరిచి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.)

వీరికేమైనా అనుమానాలుంటే పల్లెలకెళ్లి చర్చ జరుపుదాం. ఆ రోజుల్లో ఉన్నటువంటి కష్టాల్లో కూడా మేము కరెంటునివ్వగలిగామా, లేదా? అనే విషయాన్ని మేము సహేతుకంగా గణాంకాలు చెప్పగలిగే స్థితిలో ఉన్నాం. ఒకవైపు కరెంటు కోతలతో తల్లడిల్లుతుంటే, మరొకవైపు చార్జీల భారం. ఈ రాష్ట్ర ప్రభుత్వం 2004వ సంవత్సరం నుంచి ఈ రోజు వరకు చార్జీలు పెంచమని చెప్పి, నాలుగు పార్లు అదనపు భారాన్ని చార్జీల రూపంలో ప్రజలపై వేసిన ఘనత ఈ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కింది. చార్జీల రూపంలో, అదనపు చార్జీల రూపంలో దాదాపు రూ.19,593 కోట్లు, పెంపు ద్వారా, ఇంధన సర్దుబాటు సర్‌చార్జీల రూపంలో మరో రూ.12,000 కోట్లు, అంటే దాదాపు రూ.32,000 కోట్ల భారాన్ని ప్రజల మీద వేశారు. ఈ సర్ చార్జ్ ఎప్పటిది సార్ ? రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వాడిన కరెంటుకి ఇవాళ మూల్యం చెల్లించవలసిన పరిస్థితులొచ్చాయి, వైఎస్సార్‌సిపి వాళ్లు దీనికి సమాధానం చెప్పాలి.

చంద్రబాబు నాయుడు గారు హయాంలో 5000 మెగావాట్లు ఉన్న కరెంటును, 10000 మెగా వాట్లకి తీసుకెళ్లారు కాబట్టే, రాజశేఖర్ రెడ్డిగారు ఆనాడు కరెంటు ఇవ్వగలిగారు. ఆ రోజు విద్యుత్తు రంగాన్ని మేము పరిపుష్టం చేయగలిగాం కాబట్టే, వారు ఐదు సంవత్సరాలు ధరలు పెంచకుండా ఉండగలిగారు. ధరలు పెంచకపోయిన పాపాన్ని, ఫలితాన్ని ప్రస్తుతం ప్రజల నెత్తిన పెట్టవలసి వస్తోందని నేను ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నాను. ప్రజలు వాడిన కరెంటుకి ఈ రోజు చార్జీలు వెయ్యవలిసిన పరిస్థితి వచ్చింది. అది ఒక్కటే కారణమని నేను చెప్పడం లేదు, అదికూడా ఒక ప్రధాన కారణమే. ఫ్యూయల్ సర్ చార్జ్ ఎక్కడనుంచి వచ్చింది ? అదనంగా కొనుగోలు చేసిన ఫ్యూయల్ మీద, కరెంటు మీద సర్ చార్జిని మూడు నెలలకు ఒకసారి సర్దుబాటు చేయమంటే, మూడు సంవత్సరాలకు కూడా సర్దుబాటు చేయకుండా, ఒక్కసారిగా ప్రజలనెత్తిన భారం పెట్టారు. ముందు అద్దెకు ఉన్నవారు కరెంటు వాడుకొని వెళ్లిపోతే, కొత్తగా వచ్చిన వారు చార్జీలు చెల్లించవలసిన పరిస్థితి వచ్చింది. ఇంటి యజమానులకీ, అద్దెకు ఉన్నవారికీ యుద్ధాలు జరిగే పరిస్థితి, పేదలకు పెనుభారంగా మారింది. రూ.100/- విద్యుత్తు చార్జీ వచ్చే వారికి, రూ.600/- విద్యుత్తు చార్జీ వచ్చే

వారికీ ఒకే రకమైన బిల్లు, ఒకే బిల్లులో రెండు సార్లు చార్జీలు సర్దుబాటు చేసే పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ ఇవ్వకపోవడం మూలానా ప్రజలపై ఈ విధంగా చార్జీల భారాన్ని మోపి, వారి నుంచి వసూలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

2008-09 సంవత్సరం నుంచి 2011 వరకు డిస్కంలు, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలు రూ.30,699/- కోట్ల నష్టాన్ని చూపుతున్నాయి. ఇవి మేము చెపుతున్న లెక్కలు కావు, డిస్కంలు ఇఆర్సి వద్ద ఫైల్ చేసిన నివేదికలు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కుప్పకూలిపోయిన విద్యుత్తు రంగాన్ని రూ.18,000 కోట్ల పెట్టుబడి పెట్టి, 5000 మెగావాట్లు ఉన్న కరెంటును, 10000 మెగా వాట్లకి జనరేషన్ని వృద్ధి చేస్తే, ఈ ప్రభుత్వం కష్టపడి 15,000 మెగావాట్లకి కూడా తీసుకెళ్లలేకపోయింది. 22,000 మెగావాట్లవరకు వెళ్లాల్సిన జనరేషన్ని వీరు వృద్ధి చేయలేక పోయారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టడంలో కూడా విఫలమయ్యారు. డిస్కాంలను దివాళా తీయించిన ఘనత ఆనాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డిగారిదే.

(ఈ దశలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు)

ప్రభుత్వం ఇవ్వాల్సిన డబ్బును ఒక్కరూపాయి కూడా డిస్ట్రిబ్యూషన్ కంపెనీలకివ్వకుండా, రైతాంగపు ఉచిత విద్యుత్తు పాలసీకి వారు డబ్బుల్ని వెచ్చించారు. నేనెవరి మీద నిరాధారంగా ఆరోపణలు చేయడం లేదు, నేను చేసిన ప్రతి ఆరోపణకీ సాక్ష్యాధారాలతో సహా చెపుతున్నాను. ఇఆర్సి అనేది ప్రైస్ రెగ్యులేటరీ కమిషన్, కానీ నిర్ణయాధికారం ప్రభుత్వానికి ఉంటుంది, ప్రభుత్వ పాలసీగా మేము ఫలానా రంగానికి ఉచితంగా విద్యుత్తు ఇస్తామంటే, దానికి సంబంధించిన భారాన్ని ప్రభుత్వం మోయాల్సి ఉంటుంది. కానీ గతంలోని ప్రభుత్వం కానీ, ప్రస్తుత ప్రభుత్వం కానీ ఆ భారాన్ని క్రాప్ సబ్సిడీ పేరుతో అటు పరిశ్రమల మీద కొంత, గృహ అవసరాల మీద కొంత వేయడం జరిగింది. ప్రస్తుతం హైదరాబాదులో ఉన్న వినియోగదారుడు కూడా క్రాప్ సబ్సిడీ పేరుతో ఉతిచి విద్యుత్తు పొందే పరిస్థితి కల్పిస్తున్నారే తప్ప...

MR. SPEAKER : Yes, Please conclude.

శ్రీ పయ్యావుల కేశవ్ : ప్రభుత్వం మోయాల్సిన భారం మోయకపోవడం మూలానే ప్రస్తుతం ప్రజలు ఆ భారాన్ని మోయాల్సిన పరిస్థితి వచ్చింది. కాబట్టి ప్రభుత్వమే ఇవాళ ఆ ధనాన్ని సర్దుబాటు చేయాలని మేము ప్రధానంగా డిమాండ్ చేస్తున్నాం. జనరేషన్ పెంచమని మేము కోరాం. ఒక పవర్ ప్రాజెక్టు కావాలంటే, ఐదు సంవత్సరాల క్రితం ఆలోచనలు ప్రారంభమై శ్రీకారం చుడితే తప్ప, ప్రస్తుతం ఒక్క మెగా వాట్ కూడా పవర్ జనరేషన్ చేసే పరిస్థితి లేదు. 2004వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రభుత్వం ఏమి చేసింది? 1994వ సంవత్సరంలో చంద్రబాబు నాయుడు గారు అధికారంలోకి వచ్చినప్పుడు, అంధకారంలో ఉన్న రాష్ట్రాన్ని, పవర్లోకి తీసుకు రావాలని వెలుగులతో నింపాలనే ఉద్దేశంతో షార్ట్ జెస్టేషన్ ప్రాజెక్టులను ఆహ్వానించాం. షార్ట్ జెస్టేషన్ ప్రాజెక్టులను పిలిచి, ఒక బిడ్డింగ్ పెట్టి ఎవరైతే అతి తక్కువ ధరకు ఈ రాష్ట్రానికి విద్యుత్తునిస్తారో, వారికి మాత్రమే ప్రభుత్వం భూమి, ఇతర సదుపాయాలు కల్పిస్తామని, ఈ రాష్ట్రానికి పవర్ జనరేషన్ని వృద్ధిచేసి వెళ్లాము. ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి హయాంలోని కొన్ని కంపెనీల పేర్లను చెపుతాను సార్. థర్మల్ పవర్ టెక్, కోనసీమ, పెన్నా, శేషాద్రి, జివికే, జివికే సూర్య చక్ర, ఈస్ట్కోస్ట్, అతన్య, లాన్కో, వికాస్, నాగార్జున, కోస్టల్, రిలయన్స్, గౌతమి, థర్మల్, నెల్కాస్, సింహపురి, మీనాక్షి, కిన్నెర, వేమగిరి, మొదలైన 20

కంపెనీలకుపైగా ఒక్కొరికీ వేల ఎకరాలనిచ్చారు. మొత్తం 29,323 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి గాను, 45,000 ఎకరాల ప్రజల భూముల్ని, పేదలనుంచి లాక్కున్నారు.

ఉ.11.10

బొగ్గు మనది, భూమి మనది, నీళ్లు మనవి, ఆఖరికి బూడిద కూడా మనదే. కానీ విద్యుత్‌ను మాత్రం ఇతర రాష్ట్రాలకు అమ్ముకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎవరైతే తక్కువ ధరకు విద్యుత్‌ను సరఫరా చేస్తారో, వారికి ప్రభుత్వం సదుపాయాలు కల్పిస్తుందనే ఒక షరతుని తెలుగుదేశం హయాంలో శ్రీ నారా చంద్రబాబునాయుడుగారు ప్రవేశపెట్టారు. ఒకే టెండరు విధానాన్ని కూడా తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టింది. 2004వ సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అప్పటి ముఖ్యమంత్రి డా. వై.యస్ రాజశేఖర్ రెడ్డిగారి పాలనలో అలాంటి షరతులను పక్కన పెట్టి అయిన వాళ్లకు కట్టబెట్టడం కోసం రాష్ట్రాన్ని దగా చేస్తూ, ప్రజలను దోపిడీ చేసి, మోసం చేసి ఈ రోజున రాష్ట్ర ప్రజలకు విద్యుత్ కష్టాలు రావడానికి కారణమయ్యారని చెప్పక తప్పడం లేదు.

(వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మేము కోరుతున్నది ఒక్కటే సార్, రాష్ట్ర ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన విద్యుత్‌కు సంబంధించి ఎవరైతే తక్కువ ధరకు విద్యుత్‌ను సరఫరా చేస్తారో వారికి ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందనే, షరతును కాంగ్రెస్ ప్రభుత్వం కంపెనీలకు ఎందుకు పెట్టలేదని తమరి ద్వారా అడుగుతున్నాను.

(వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ స్పీకర్ః శ్రీకాంత్‌రెడ్డి గారు..

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి (రాయచోటి)ః అధ్యక్షా, ఈ రోజు విద్యుత్‌పై చర్చ కంటే ముందు ప్రభుత్వం నుంచి ఒక స్టేట్‌మెంట్ వచ్చిన తర్వాత చర్చను జరిపించాలని మేము కోరాం. కానీ, చర్చను కూడా జరగనివ్వమని ఇతర సభ్యులు కోరినందున చర్చలో కూడా పాల్గొందాం అని సభకు సహకరిస్తున్నాం అధ్యక్షా. ఈ రోజు తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీలు వైఫల్యం చెంది, వాళ్ల వైఫల్యాలను ఒప్పుకోకుండా చనిపోయిన ఒక నాయకుడు మీద విమర్శలు చేస్తున్నారు. 2004 వ సంవత్సరం నుంచి 2009 వ సంవత్సరం వరకు రాష్ట్రంలో ఏ రకమైన పాలన ఉన్నదో ప్రతి ఒక్కరికి తెలుసు.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం )

పాలన బాగుండి, అన్ని వసతులు కలిగినాయి కాబట్టే ప్రజలు 2009లో తిరిగి వైయస్ రాజశేఖర్ రెడ్డిగారిని ముఖ్యమంత్రిని చేశారనే విషయాన్ని వాళ్లు మరచిపోతున్నారు. ఈ రోజున ఏ అంశం జరిగినా, పది సంవత్సరాల క్రితం జరిగినా, ఆకాశానికి ఏమి జరిగినా, దానికి కూడా వైయస్ రాజశేఖర్

రెడ్డిగారే కారణం అనే విధంగా సభ్యులు మాట్లాడుతున్నారు. అలా చేయడం ఎంత వరకు సబబు. అది వారి విజ్ఞతకే వదిలివేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: చంద్రశేఖర్ రెడ్డిగారు..

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి (వనపర్తి): అధ్యక్షా, ఈ రోజున అధికారంలో ఉన్న ప్రభుత్వం, 2009 వ సంవత్సరంలో డా.వైయస్ రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉండగానే ఎన్నికలలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడు అది కాంగ్రెస్ ప్రభుత్వం అయినప్పుడు సభ్యులు పయ్యావుల కేశవ్‌గారు చెప్పే దాంట్లో తప్పేముంది. డా. రాజశేఖర్‌రెడ్డి గారి హయాంలో జరిగిన అవకతవకలను ఎత్తి చూపే బాధ్యత మా పార్టీ మీద ఉంది. ప్రస్తుత ప్రభుత్వ తప్పిదాలను ఎత్తి చూపుతున్నాం. ఉదహరణకు..

మిస్టర్ స్పీకర్: చంద్రశేఖర్ రెడ్డిగారూ. డీటేల్స్ వద్దు.

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు ఇవే తప్పిదాలను సమర్థించారు. ఇప్పుడేమో అది మాది కాదు. అని తప్పుకుంటున్నారు. అధికారం వస్తే మాది, అవకాశం వస్తే వాళ్లది అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. పాపాలకు, శాపాలకు కారణం ఆనాడు డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి పార్టీలో ఉన్నటువంటి ఈ నాటి వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యులే.

శ్రీ పయ్యావుల కేశవ్: రాజశేఖర్ రెడ్డిగారిని వ్యక్తిగతంగా నేనెక్కడ కూడా తప్పుబట్టే ప్రయత్నం చేయలేదు. వారు ముఖ్యమంత్రిగా తీసుకున్నటువంటి నిర్ణయాలలో తప్పులను ఎత్తి చూపే ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డి గారి నిర్ణయాలను తప్పుబడుతూ మొదలుపెట్టాను. మా పార్టీ ప్రజల కోసం, ప్రజల పక్షాన మాట్లాడుతుందే తప్ప, ఇక్కడ ఎవరి ప్రీతి కోసమో, ఎవరి వ్యతిరేకత కోసమో మాట్లాడటం లేదు. చంద్రబాబునాయుడు గారు భారతదేశంలో మొట్టమొదటగా ఎలక్ట్రిసిటీ రిఫార్మ్స్ ప్రవేశపెడుతూ కూడా 'ఎవరైతే రాష్ట్రానికి అతి తక్కువ ధరకు విద్యుత్‌ను ఇస్తారో, వాళ్లకి మాత్రమే ప్రభుత్వ భూమి, నీళ్లు, బొగ్గు మరియు ఇతర సదుపాయాలు కల్పిస్తాం ' అనే నిర్ణయాన్ని తీసుకుని, అలాంటి వారికి మా ప్రభుత్వం అనుమతులు ఇస్తే, తర్వాత కాలంలో అధికారంలోకి వచ్చినటువంటి డా.వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు 45,000 ఎకరాలు 29,000 వేల మెగా వాట్‌లకు అటు నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకూ కోస్తా తీరాన్ని మొత్తం కూడా ప్రైవేట్ యాజమాన్యానికి కట్టబెట్టారు. ఈ రాష్ట్ర అవసరాల కోసం ఎవరైతే తక్కువ ధరకు విద్యుత్‌ను ఇస్తారో, వాళ్లకే రాష్ట్రంలో భూమి, బొగ్గు, నీరు మరియు తగిన సదుపాయాలు సమకూరుస్తుందనే షరతును ప్రభుత్వం ఎందుకు చేయలేకపోయిందనే విషయాన్ని తెలుగుదేశం పార్టీ తప్పుబడుతుంది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే దాదాపు 12,000 మెగా వాట్‌ల విద్యుత్ ఉత్పత్తి అయితే కనీసం ఆ జిల్లాలోనైనా విద్యుత్ కోతలు లేకుండా ప్రభుత్వం ఆదుకోలేకపోయింది. ఈ రోజున విద్యుత్ విషయంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలలో కమీషన్‌లు పెద్దలకు పోతున్నాయి, లాభాలు కంపెనీలకు పోతున్నాయి కాబట్టే రాష్ట్రంలో ప్రజల మీద పెను భారం పడుతున్నది, ప్రజలు నష్టపోతున్నారు. ఆ విషయం పైన మా పార్టీ ప్రశ్నిస్తుందే తప్ప, వ్యక్తిగతంగా ఎవరి మీద ఆరోపణలు చేయడం లేదు.

మిస్టర్ స్పీకర్ః దయచేసి ముగించండి.

శ్రీ పయ్యావుల కేశవ్ః ఈ రోజున రాష్ట్రంలో విద్యుత్ సమస్య ప్రధాన సమస్యగా ఉంది. విద్యుత్ చర్చలో రూ.30000 కోట్లకు మూలం ఎక్కడుందంటే ఇట్లాంటి అవినీతి విషయాల్లోనే ఉంది సార్. ఈ రోజు పేపర్లో ఒక వైపు అగ్రిమెంట్‌లు చేసుకున్న కంపెనీలు, మరొక వైపు ఈ రాష్ట్రానికి తక్కువ ధరకు విద్యుత్‌ను ఇస్తామన్న కంపెనీలు కూడా ఎక్కువ ధరకు అమ్మే పరిస్థితి ఏర్పడింది.

శ్రీ డి. శ్రీధర్‌బాబుః (మైకు లేకుండా) ఒక్క నిమిషం సార్.

శ్రీ పయ్యావుల కేశవ్ః ఏంటి సార్ ఈ అంతరాయం. I am not yielding. I am not yielding sir, No sir, I am not yielding.

MR. SPEAKER: Minister for Legislative Affairs.

శ్రీ డి. శ్రీధర్‌బాబుః సార్, చాలా సంతోషం. సభ్యులు శ్రీ పయ్యావుల కేశవ్ గారు పదే పదే విద్యుత్‌ను అమ్ముకుంటున్నాం, కుమ్ముకుంటున్నాం అనే విషయాన్ని ప్రస్తావనకు తీసుకువచ్చారు. ఏ విషయాన్నైనా తెలుగుదేశం పార్టీకి సంబంధించిన శాసన సభ్యులు రీసెర్చి చేస్తారని మాకు నమ్మకం . ఆ పేపర్‌లో we are not approving whatever the paper is saying. మధుకాన్ 18 మెగా వాట్లను అమ్ముకుంటున్నదని పేపర్‌లో వ్రాయడం జరిగింది. దీనికి సమాధానం, మధుకాన్ కంపెనీ ఎవరిది? దానికి సంబంధించిన ప్రమోటర్ ఎవరు? రాష్ట్రంలోని రైతు సోదరుల మీద మీకంత ప్రేమ ఉంటే, మరి ఈ విషయంలో కూడా వారు సమాధానం చెప్పవలసిన అవసరం ఉంటుంది. పదే పదే ఇప్పటికి మూడు సార్లు విద్యుత్‌ను అమ్ముకుంటున్నాం అని అంటున్నారు. దీన్ని ఆధారం చేసుకుని ఏ రాష్ట్ర ప్రభుత్వం పాలసీ చేయడం లేదు.

శ్రీ పయ్యావుల కేశవ్ః గౌరవ మంత్రిగారు ఏదో రీసెర్చి చేసినట్లు చెబుతున్నారు. అసలు మథకాన్ అనేది ఎక్కడ మొదలయ్యింది సార్? ఈ ప్రభుత్వంలో ఎవరూ నిర్వహణ చేయలేక, కేటాయింపులు చేసి వదిలేస్తే, ఓ వ్యాపారవేత్త దాన్ని కాపాడతాం, పునరుద్ధరిస్తామని టేకోవర్ చేసినటువంటి కంపెనీ. ఈ విషయంలో ప్రభుత్వం తప్పులు చేసిన వారిని బెత్తం తీసుకుని దండించాల్సిన అవసరం ఉంది. తెలుగుదేశం పార్టీ ఏ ఇతర పార్టీల పక్షాన నిలబడదు. ఖచ్చితంగా ప్రజల పక్షాన మాత్రమే నిలబడుతుంది.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు బల్లలు చరిచారు)

"ఎవరు తక్కువ ధరకు విద్యుత్ ఇస్తారో, వారికి విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి సదుపాయాలకు అనుమతిస్తామనే" షరతు కాంగ్రెస్ హయాంలో చేయనందున, రాష్ట్రంలో కోస్తా తీరం మొత్తం కట్టబెట్టబడింది. ఈ రోజున ఎవరైనా కొత్తగా పవర్ ప్రాజెక్టు పెట్టడానికి ముందుకు వచ్చినా, పెట్టలేనటువంటి పరిస్థితి ఏర్పడింది. ఆ రోజున వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు చేసిన తప్పిదం వలన రాబోయే 25, 30 సంవత్సరాలకు కూడా ఈ పాపం వెంటాడుతుంది. ఇప్పటికైనా అటువంటి కంపెనీలను రద్దు చేయండని ముఖ్యమంత్రిగారిని అడుగుతున్నాను. రేపటి నుంచి ప్రభుత్వం పిలిచే టెండర్లను 'గ్లోబెల్ టెండర్లుగా' పిలవమని తెలియచేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా వందలాది కంపెనీలు రాష్ట్రానికి వస్తాయి. పెట్టుబడులు పెడతారు. గుజరాత్ రాష్ట్రంలో జరిగినటువంటి ప్రయోగాలను

గమనించండి. మా హయాంలో మేము చేసినటువంటి ప్రయోగాలు మీరు ఎందుకు చేయలేకపోతున్నారంటే, మీరందులో లాభాలు ఆశించారు కాబట్టి, అందులో కమీషన్‌లు ఆశించారు కాబట్టి, తెలుగుదేశం పార్టీ ఈ రోజున మీ మీద ఆరోపణలు చేస్తుంది.

మిస్టర్ స్పీకర్ః దయచేసి ముగించండి.

శ్రీ పయ్యావుల కేశవ్ః రాష్ట్రంలో స్థాపించిన ప్రాజెక్టులకు గ్యాస్ కేటాయింపుల విషయానికొస్తే, ఎన్నో సంవత్సరాల క్రితం తెలుగుదేశం హయాంలో స్థాపించిన ప్రాజెక్టులకు కూడా గ్యాస్‌ను సమకూర్చలేనటువంటి పరిస్థితిలో విద్యుత్ సమస్య ఉంది. నాకు తెలిసినంత వరకూ దాదాపు 1200 మెగా వాట్ల విద్యుత్‌ను జనరేట్ చేసుకునే అవకాశం ఉంది. 2009వ సంవత్సరం వరకు 70 శాతం పిఎల్ఎఫ్‌తో నడిస్తే ఈ రోజున 24 శాతం పిఎల్ఎఫ్‌తో నడిచే పరిస్థితి ఏర్పడింది. కేంద్రం కేటాయించవలసిన గ్యాస్‌ను ఈ రాష్ట్రంలో ప్రజల అవసరాలకు ఉపయోగపడే కంపెనీలకు కేటాయించాలి. కానీ, దానికి విరుద్ధంగా పొరుగు రాష్ట్రాలకు అమ్ముకుంటున్నటువంటి ల్యాంకో, జీవీకెలకు ఈఆర్‌సి ఆదేశాలకు వ్యతిరేకంగా గ్యాస్ కేటాయింపులు జరుపుతున్నారు. ఈ రాష్ట్రంలో 12 మంది కేంద్ర మంత్రులు ఏం చేస్తున్నారు, 30 మంది కాంగ్రెస్ ఎంపీలు ఏం చేస్తున్నారని నేను తమరి ద్వారా అడుగుతున్నాను. ఖచ్చితంగా ఈ రోజున కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వలన, రాష్ట్రం పట్ల కాంగ్రెస్ పార్టీకున్నటువంటి నిర్లక్ష్యం వలన గ్యాస్ కేటాయింపులు మర్చంట్ పవర్ కంపెనీలకు, పొరుగు రాష్ట్రాలకు అమ్ముకునే కంపెనీలకు పోతూ, ఈ రాష్ట్రానికి ఆబ్లిగేషన్ మీద విద్యుత్‌ను ఇవ్వవలసిన కంపెనీలకు గ్యాస్ సరఫరా చేయలేనటువంటి పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో సాంప్రదాయేతర ఇంధన వనరులను ఐదు శాతం ఖచ్చితంగా డిస్కంలు కొనాలి. అలాంటి నిబంధన అమలుకావడం లేదు. విండ్ పవర్ ప్రాజెక్టులకు 14000 మెగా వాట్లకు అవకాశం ఉంటే ఈ రోజుకి అతి కష్టం మీద 190 మెగా వాట్ల విద్యుత్‌ను మాత్రమే జనరేట్ చేశారు. పొరుగు రాష్ట్రమైన తమిళనాడు 6000 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే స్థితికి చేరుకుంది. గుజరాత్‌లో 2500 మెగా వాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుంది.

ఉ.11.20

ఆ రోజు విధానపరమైన నిర్ణయాలు తీసుకోకుండా, ఆలోచనారాహిత్య ప్రభుత్వ చర్యల వల్ల ఈ పరిస్థితి వచ్చింది. నిన్ననే సోలార్ పవర్‌కి సంబంధించి ఒక పాలసీ నిర్ణయించారు. అది ఎవరికి లాభం చేకూరుతుందో అర్థం కావడం లేదు. మినీ హైడల్ మీద పాలసీ లేదు. చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు సంబంధించి ఇంత వరకూ పాలసీ లేదు. గత ఆరు సంవత్సరాల నుండి చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు మిని హైడల్ పవర్‌కి సంబంధించి లైసెన్స్‌లు కావాలని చెప్పులు అరిగేలా ప్రభుత్వం చుట్టూ వారంతా తిరుగుతున్నారు. వారికి లైసెన్సులు ఇవ్వడం లేదు. చిన్న చిన్న పారిశ్రామికవేత్తలకు సదరు పాలసీలు వస్తాయా? ఇంత వరకూ వారికి ఏ పాలసీ చెప్పలేదు. పెద్ద పెద్ద కంపెనీల మీద ఉన్న ప్రేమ ఎటువంటిదో అర్థమవుతోంది. కేంద్రం పూర్తిగా వివక్షత చూపుతోంది. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు మౌనంగా ఉన్నారు. వారిని, మంత్రులను ప్రజలు నిలదీసే రోజులు దగ్గర పడుతున్నాయి. మా హయాంలో సింహాద్రి పవర్ ప్రాజెక్ట్ 1,000 మెగావాట్లకి సంబంధించి రాష్ట్ర అవసరాల కోసమే చంద్రబాబునాయుడుగారు పోరాడి సాధించారు. అదే సింహాద్రి-2వ దశకు కేవలం 200, 300 మెగావాట్ల వాటా మాత్రమే మనకు వచ్చే పరిస్థితి ఉంది.

ఎందుకింత దౌర్భాగ్యమో నాకు అర్థం కావడం లేదు. ఢిల్లీలోఎవరికి వారు వారి పవర్ చూసుకుంటున్నారు. రాష్ట్ర ప్రయోజనాలు చూడడం లేదు. రాష్ట్రానికి చెందిన 32 మంది ఎంపిలు కేంద్రాన్ని నిలదీస్తే మరో సింహాద్రి , ఇతర ప్రాజెక్టులు ఎందుకు రావు.

ఈ రోజు రాష్ట్రానికి కావలసిన గ్యాస్ కేటాయిస్తే, రాష్ట్రంలో రూ.1.25 పైసలకే విద్యుత్ దొరికే పరిస్థితి ఏర్పడుతుంది. కానీ ప్రభుత్వం రూ.5.00 కి కొంటున్నది. పవర్ గ్రిడ్ ఏర్పాటులో ఆలోచన లేకపోవడం జరుగుతోంది. ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాలు రూ.1.20, రూ.2.00కే యూనిట్ విద్యుత్‌ని కొనుగోలు చేస్తున్న తరుణంలో మనం రూ.5.00 కి కొంటున్నాము. కేవలం పవర్ గ్రిడ్ ఏర్పాటులో ఎవరి నిర్లక్ష్యమో తెలుస్తోంది. నార్త్ ఈస్ట్ రాష్ట్రాల నుండి కూడా విద్యుత్‌ని బుక్ చేసుకోవడానికి నిర్ణయం తీసుకోలేకపోయారు. పవర్ గ్రిడ్‌కి సంబంధించి 1,000 మెగావాట్లకు మాత్రమే అవకాశం ఉందంటే మనం నిద్ర పోయాము. కర్ణాటక 700 మెగావాట్లు, తమిళనాడు 100 మెగావాట్లు బుక్ చేసుకున్నాయి.

మనం పవర్ గ్రిడ్ గురించి ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేయము. గ్రిడ్ కార్పొరేషన్‌తో మాట్లాడము. ఇవన్నీ కూడా నిర్లక్ష్యం కాదా అని అడుగుతున్నాను. ఇవన్నీ కూడా వారికి తెలిసి జరిగాయా లేదా చెప్పమనండి. వారి నిర్లక్ష్యం వల్ల జరిగింది కాదా అని అడుగుతున్నాను. రాత్రికి రాత్రి మన ముందు పడిన ఉపద్రవం కాదు. అటువంటి ఉపద్రవం ఉంటే మేమే ప్రభుత్వానికి అండగా ఉండి సరే, ఇలా చేయండి ప్రజల కోసం మేము ఉన్నామనే మాట చెప్పేవారము. గత 9 సంవత్సరాల పాపం వెంటాడుతోంది. ఈ రోజు రాష్ట్రం మొత్తం అంధకారంలో ఉంది. మరొక నాలుగు సంవత్సరాలు ఇలాగే ఉంటుందన్న హెచ్చరిక కూడా ఉంది. ఆరోజు ట్రాన్స్‌కో సిఎండిగా ఉన్న అధికారి వీరికి హెచ్చరిక చేశారు. ఈ రోజు కాదు. ఒక సంవత్సరం క్రిందట అంటే, మార్చి నెల 19వ తేది, 2012న రాష్ట్రం భవిష్యత్తు ఎలా అంధకారంలోకి పోతుందో దాదాపు 10 పేజీల నివేదకను సామాన్యుడు అర్థం చేసుకొనే భాషలో వివరించారు. ఏ విధంగా గ్రిడ్ ఏర్పాటు చేసుకోలేకపోవడం, ముందుగా కాంట్రాక్టర్స్‌ని ఫైనలైజ్ చేయలేకపోవడం, ఇటువంటివి చెబుతూ, ఇప్పటికయినా మేలుకోవలసిన అవసరం ఉంది, చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని ట్రాన్స్‌కో సిఎండి వ్రాస్తే ఈ ప్రభుత్వం నిద్ర పోతోందా అని ప్రశ్నిస్తున్నాను. ఆ పరిస్థితే వచ్చిందని చెబుతున్నాను. వారి నివేదిక మీద చర్యలు లేవు. ఈ రాష్ట్ర అంధకార పరిస్థితి వారికి తెలుసు. ఇలా జరిగిందని చెప్పడానికి ఇంతకన్నా సాక్ష్యాధారాలు అవసరం లేదు. ఇది తెలియక జరిగింది కాదు. తెలిసే జరిగింది. కళ్ల ఎదుట బాధ్యతాయుత అధికారి నివేదిక ఇచ్చిన తరువాత కూడా ఏమీ చేయలేకపోయారు. ఎంత నిర్లక్ష్యమో అర్థమవుతోంది.

కేంద్రం నుండి గ్యాస్ తెచ్చుకోవడంలో వైఫల్యం, పవర్ గ్రిడ్‌లో వైఫల్యం. ప్రభుత్వం చెల్లించవలసిన డబ్బు డిస్కామ్‌కు చెల్లించకపోవడం ఇవన్నీ కూడా ఏమిటి? ప్రభుత్వం చేసిన పాపానికి సామాన్య పౌరుడు ఎందుకు డబ్బులు చెల్లించవలసి వచ్చింది. ధరల పెంపుదల భారం కేవలం ప్రభుత్వం తప్పిదం వల్ల జరిగింది. 2004వ సంవత్సరం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాజశేఖర రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డి గార్ల ప్రభుత్వ తప్పిదాలకు ధరలు పెంచడం కాదు. ఇంధన ఛార్జీలు ప్రజల మీదకు వేశారు. 12 గంటల పాటు కరెంటు ఇవ్వరు. కరెంటు ఇవ్వని దానికి కూడా ప్రజలే డబ్బు కట్టవలసివస్తోంది పారిశ్రామికవేత్తలకు నగరాల్లో కరెంటు ఇచ్చి ఆ భారం పల్లెల్లోని ప్రజలు ఏ విధంగా భరిస్తారు? ఇంధన సర్‌ఛార్జ్ ఏ విధంగా భరించాలనేదానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

ఖచ్చితంగా  మర్చెంట్ పవర్ కంపెనీలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం ఊడిగం చేయడం జరిగింది. 2004 నుండి ఉన్న ప్రభుత్వ పెద్దలు వారితో కుమ్మక్కై, లాలూచి పడడం వల్ల ఈ రాష్ట్రానికి ఈ దురవస్థ ఏర్పడింది. రాయితీతో పొందని గ్యాస్ ప్రజలకు కాకుండా పోతోంది. హిందూజా వారు పవర్ ప్రాజెక్ట్ పెడతామంటే వారిని నమ్మి భూమిని అప్పట్లో మా ప్రభుత్వం  ఇస్తే, తరువాత రాష్ట్రంలో ప్రాజెక్ట్‌ని వారు పెట్టకుండా ఉండి, బయటి రాష్ట్రాలకు అమ్ముకుంటామంటే ఈ ప్రభుత్వం అందుకు అనుమతిని ఇచ్చింది.  ఎందుకు అనుమతిని ఇవ్వాలి?  ఈ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన భూమిని, రాష్ట్ర అవసరాలకే  ఇవ్వాలి.  ఆ కంపెనీ కాకపోతే మరొక కంపెనీవారు ముందుకు వస్తారు.   ఎవరికోసమో చేయవలసిన అవసరం లేదు.  ఎంతో మంది పారిశ్రామికవేత్తలు ఇక్కడ పరిశ్రమలకు పెట్టుబడులు పెట్టడానికి సిద్ధంగా ఉన్నారు.  ముందుకు వచ్చిన వారికి ఇవ్వండి.    రాష్ట్ర ప్రయోజనాల కోసం పని చేయవలసిన పవర్ సెక్టార్ అవినీతికూపంగా మారుతోంది.  ధరలు ఎక్కువ చెల్లించడం కాదు. అదనంగా చెల్లించిన   పరిస్థితి ఉంది.

జనవరి నుండి జూన్ నెల వరకూ చూసినట్లయితే లాంకో, జీఎంఆర్ మొదలైన వారి నుండి రూ.147 కోట్ల నష్టం  జరిగిందంటే ఇంతకుముందు ఎంత జరిగి ఉంటుంది?  ఒకే ప్లాంట్‌కి రూ.2,000 కోట్లు అదనంగా చెల్లించడం జరిగిందని ఆరోపణలు ఉన్నాయి. మీ బాధ్యతగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు.  ఆ సబ్సిడీని డిస్కామ్‌కూ ఇవ్వండి.   అప్పుడు ప్రజల మీద ఈ భారం ఉండదు.  వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ని  రాజశేఖర రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్ రెడ్డిగార్లు  ఇవ్వలేదు.  ఈ రాష్ట్ర ప్రజానీకమే రైతులకు ఇస్తోంది.   కానీ ఈ ప్రభుత్వం కాదు.  రాష్ట్రంలోని ప్రతీ గృహం నుండి, పారిశ్రామిక వేత్తల నుండి క్రాస్ సబ్సిడీ పేరుతో డబ్బులు వసూలు చేసి వ్యవసాయ రంగానికి  ఉచిత విద్యుత్ ఇస్తున్నారు తప్ప ప్రభుత్వం నుండి ఇవ్వలేదని తెలుసుకోవాలి.  ఈ రోజు బలోపేతం చేయవలసినది  జెన్కోని. రాష్ట్రాన్ని ముందు నుండి ఆదుకొన్న     వారికి ఒక రూపాయి కూడా ఈక్విటీ పెట్టుబడి ఇవ్వకుండా ఉంటే వారు ఏ విధంగా రాష్ట్రాన్ని ఆదుకొంటారు.  బ్యాంకులు లోను ఇవ్వడానికి  సిద్ధంగా ఉన్నా ప్రభుత్వం 20 శాతం ఈక్విటీ ఇవ్వని పరిస్థితి ఉంది.  సబ్సిడి లేదు. పెట్టవలసిన పెట్టుబడులు లేవు.  ప్రభుత్వ ప్రేమంతా పెద్ద కంపెనీలకే దక్కుతోంది.

ప్రజలను ఏ విధంగా కాపాడుతున్నారో సమాధానం చెప్పాలి.  కొత్త ప్రాజెక్టుల అవినీతి జాడ్యం, జాప్యం గురించి కాగ్ ఒక్కటే చెప్పింది.  రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పవర్ ప్లాంట్,  కేంద్రం చేసిన పవర్ ప్లాంట్ కన్నా 50 శాతం  ధర ఎక్కువ అవుతోంది.  కాగ్ అక్షింతలు వేసినా 50 శాతం ఎందుకు అదనంగా  అనుమతి ఇచ్చారు.  లబ్ధిదారులు ఎవరనేది పరిశీలించడానికి ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేస్తున్నాను. ఇది   కాగ్ చెప్పింది, పయ్యావుల కేశవ్‌కానీ, తెలుగుదేశం పార్టీ కానీ ఆరోపణలు చేయడం లేదు.  కాగ్ అక్షింతలు వేసింది.  దాని మీద విచారణ జరిపించాలి.  జెన్కో ప్రొడ్యూజ్ చేయవలసింది తగ్గింది. ప్రొడక్షన్ తగ్గడం వల్ల  ఈ రోజ నష్టం వచ్చింది. ప్రొడక్షన్ ఎందుకు తగ్గిందంటే, బొగ్గు ఎగుమతులే కారణం.   నేను చేసిన ఆరోపణ కాదు.  పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి.   బొత్సా సత్యనారాయణగారు ఈ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని నడిపే వారు, మంత్రిగారు చాలా వివరంగా, విపులంగా ప్రెస్ మీట్‌లో చెప్పారు. ' Botsa hauls up Kiran Kumar Reddy over coal scam 'అని  పత్రికలో ఇచ్చారు.  ' సి' గ్రేడ్ బొగ్గుకి బదులు 'డి' గ్రేడ్ బొగ్గుకి అనుమతి ఇవ్వడంవల్ల అని చెప్పారు.   ' సి 'గ్రేడ్ బొగ్గు  టన్ను రూ.4,795 ఉంటే, 'డి' గ్రేడ్ బొగ్గు

రూ.4,240కి దొరుకుతుందనీ, ' ఇ' గ్రేడ్ బొగ్గు రూ.3,600కి దొరుకుతుందని చాలా విపులంగా మాట్లాడారు.

ఉ.11.30

'రూ.325 కోట్లు ఒక్కో కొనుగోలులో నష్టం జరుగుతోంది, స్కామ్ జరుగుతోంది' అన్నారు. ఆయన మాట్లాడిన పదమే 'స్కామ్'. నేను చెప్పింది కాదు. ఆయన ఈ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మంత్రి వర్గంలో సభ్యుడిగా ఉండి ఈ విషయాలు మాట్లాడారు. 'సి' గ్రేడ్ ఇంపోర్టెడ్ కోల్‌ని మనం రూ. 4795లకు కొంటున్నాం. సింగరేణి నుండి మనం రూ.3900లకు కొంటున్నాం. అంటే రూ.800లు ఎక్సెస్. 'బి' గ్రేడ్ ఇంపోర్టెడ్ కోల్‌ని మనం రూ. 4240లకు కొంటున్నాం. సింగరేణి నుండి మనం రూ.3792లకు కొంటున్నాం. అంటే టన్నుకి రూ.900 ఎక్సెస్. 'ఇ' గ్రేడ్ కోల్ రూ.3688లకు, సింగరేణి కోల్ రూ.3607లు. దీన్ని మనం ఏ రకంగా సమర్థించుకొంటాం.

మిస్టర్ స్పీకర్ : దయచేసి ముగించండి. లేకపోతే I have to close.

శ్రీ పి. కేశవ్ : ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తే మీరు మూసేస్తారా?

MR.SP : PL. CONCLUDE. I am repeatedly

శ్రీ పి. కేశవ్ : నేను అసందర్భంగా మాట్లాడి ఉంటే మీరు నా మైక్ కట్ చేయవచ్చు.

మిస్టర్ స్పీకర్ : అందరికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుంది. మీరు మీ సమయాన్ని రెగ్యులేట్ చేసుకోండి. You have to conclude.

శ్రీ పి. కేశవ్ : గాడి తప్పిన ఈ ప్రభుత్వాన్ని గాడిలోకి పెట్టాల్సిన బాధ్యత మాపై ఉంది. 'అదాని' అనే పవర్ కంపెనీ కోల్ సప్లైలో అవినీతి జరిగిందని....

(అంతరాయం)

శ్రీ డి. శ్రీధర్ బాబు: అధ్యక్షా, కేశవ్ గారు చాలా సేపటి నుండి మాట్లాడుతున్నారు. కేశవ్ గారు చాలా బాగా మాట్లాడతారు, వారు సూచనలేమైనా చెపితే, వాటిని తీసుకొందామని గౌరవ ముఖ్యమంత్రి గారు ఇంతకు ముందు చెప్పారు. మా పి.సి.సి. అధ్యక్షులు మాట్లాడిన విషయాలను కేశవ్ గారు కోట్ చేశారు. ఆ విధంగా కోట్ చేస్తూ, 'ఏదో అన్నారనే' అభిప్రాయాన్ని సృష్టిస్తున్నారు. బొత్స సత్యనారాయణ గారు వాస్తవిక పరిస్థితులు చెప్పే ప్రయత్నం చేస్తూ ఆ విధంగా చెప్పి ఉంటారేమో! కానీ, ఇది స్కామ్ అన్నారు, ఇది వారన్నారని వీరు అనడం సరి కాదు. వారెక్కడా అనలేదు. అది ఏదో పత్రికల వర్డింగ్. కేశవ్ గారు ఏదో ఒక పత్రికను చూపిస్తూ ఇంతకు ముందు కూడా మాట్లాడారు. 'న్యూస్ పేపర్'పై ఆధారపడి ఈ రాష్ట్ర ప్రభుత్వం నడవదు. వారు ఆ విధంగా ప్రభుత్వాన్ని నడిపించారేమో! మేము ఆ విధంగా నడపం. ఆరోజు జరిగిన సంఘటన ఏ విధంగా ఉంది, వారు దానిపై ఏ విధంగా రియాక్ట్ అయ్యారో దాని పరంగా మాట్లాడుతూ 'వారన్నట్లు సృష్టించడం సరి కాదు'. దాన్ని కచ్చితంగా ఖండిస్తున్నాం.

(అంతరాయం)

శ్రీ పి. కేశవ్ : నేను  ఒక రిపోర్టుని చాలా వివరంగా కోట్ చేశాను. ఏమంటే 'ఆయన ప్రెస్‌లో చెప్పడమే కాకుండా'

(అంతరాయం)

He submitted a Report to AICC General Secretary on Wednesday. He alleged a major coal scam involving the Chief Minister. వారిని మాట్లాడించండి సార్. అవసరమైతే మంత్రి గారిచే మాట్లాడించండి. లేకపోతే బొత్సా సత్యనారాయణ గార్ని సభకు పిలిపించి సమాధానం చెప్పించండి. as repeatedly

MR.SPEAKER: You are deliberately going into that.

శ్రీ పి. కేశవ్ : 'బొత్సా సత్యనారాయణ గారు తప్పు చెప్పి ఉంటే, అది తప్పు అనే ప్రకటన ప్రభుత్వం నుండి కానీ, బొత్సా సత్యనారాయణ గారి నుండి గానీ రావాలి. తప్పుడు విషయాన్ని పత్రికల వారు వ్రాసి ఉంటే, ఇటువంటి మేజర్ ఆరోపణ వచ్చినప్పుడు ఆ పత్రిక పై చర్య తీసుకోవాలి'. ఈ రెండింటినీ మీరు చేయకుండా, నేను దాన్ని ఇక్కడ ప్రస్తావనకు తీసుకువస్తే, నాపైన ఎదురు దాడి చేసే ప్రయత్నం చేయడం సరైంది కాదని నేను చెపుతున్నాను. ఆరోపణల్లో నిజం లేదంటే నిజం లేదని ఈ సభను నమ్మించే ప్రయత్నమైనా చేయండి. మేము దీని విషయమై విచారణకు ఆదేశించాల్సిందిగా డిమాండ్ చేస్తున్నాం. నేను ఒక పర్యాయం 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' (సి.ఏ.జి.) వారి రిపోర్టుని కోట్ చేశాను. ఈ రాష్ట్రంలో బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న వ్యక్తి పేరుని నేను కోట్ చేశాను. అలాగే సి.ఎమ్.డి. రిపోర్టుని కోట్ చేశాను. నేను నిరాధారమైన ఆరోపణలు ఏ ఒక్కటి కూడా చేయలేదు. మీరు వీటికి సమాధానం చెప్పాలి. నేను ఈ అంశాలను ఇక్కడ ప్రస్తావించకపోతే, మీరు సమాధానం ఇక్కడ ఎట్లా చెపుతారు. మేం అడగాల్సిన వాటిని అడిగాం. వాటిపై నిజాలేంటో మీరు సభకు చెప్పండి. మీకు తప్పు చేయలేదని అనిపిస్తే తప్పేంలేదని చెప్పే ప్రయత్నం చేయండి. మీ మంత్రి గారు చేసిన ఆరోపణలపై ముఖ్యమంత్రి గారు, ఆయన క్యాబినెట్ ఈ సభకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్న విషయాన్ని కచ్చితంగా మేం గుర్తు చేస్తాం. We demand an explanation on this issue.

(అంతరాయం)

'కాగ్' రిపోర్ట్ లో ఏమి చెప్పారంటే, 'on account of consumption of low quality coal, it consumed excess quantity of coal of 323.00 lakh MTs worth about రూ. 4845 కోట్ల విలువ కలిగిన అదనపు కోల్ వాడబడింది. ఎందుకు వాడబడిందంటే, 'నిర్ధారించబడిన కెలరోఫిక్ వాల్యూ కంటే తక్కువ ఉందని' కాగ్ నివేదక చెప్పింది. ఈ విషయమై మంత్రి గారు ఒక ప్రకటన చేశారు. ఈ రెంటినీ చూసిన సామాన్యుడికి ఏమి అనుమానం వస్తుంది. దీనిపై మీకు అనుమానాలు రాకపోతే రాకపోవచ్చు. మీరు అనుమతి ఇస్తే ఈ విషయమై ఇంకా వివరంగా చెప్పమంటే నేను చెపుతాను. We demand an explanation on this particular issue.

(అంతరాయం)

MR. SPEAKER: You have to conclude. I will have to give opportunity to the next Speaker.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్‌రెడ్డి : అధ్యక్షా, 'కాగ్' అకౌంటింగ్ ప్రొసీజర్ ప్రకారం అది మన సభకు రిపోర్ట్ ఇస్తుంది. దీన్ని పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ వారు పరిశీలించి రిమార్క్స్ ఇస్తారు. గవర్నమెంట్ ఆఫీస్ వారు 'కాగ్' కి క్లారిఫై చేస్తారు. సభ్యులు ప్రస్తావించిన విషయమై ఒక చిన్న క్లారిఫికేషన్ ఇస్తాను. నేను రిప్లై చెప్పినప్పుడు వివరంగా చెపుతాను. 'జన్కో' ప్రాజెక్ట్ పూర్తి చేయు విషయంలో, వేరే ప్రాజెక్టుల కంటే ఎక్కువగా ఉందని 'కాగ్' వారు అబ్జర్వేషన్ ఇచ్చారు. దానికి ప్రభుత్వం నుండి 'జన్కో' పి.ఏ.సి.కి వివరణలు సబ్మిట్ చేస్తుంది. 2374 మెగా వాట్లకు రూ.11300 కోట్లు అయిందని, పర్ మెగావాట్‌కి రూ. 4.70 కోట్లు జన్కోకి ఖర్చు అయిందనీ, ఎన్.టి.పి.సి. సింహాద్రి పూర్తి కావడానికి రూ. 4.90 కోట్లు అయిందని, మాది ఇంకా తక్కువ ఉందని క్లారిఫికేషన్ ఇచ్చారు. ఇటువంటి ఎన్నో అబ్జర్వేషన్స్‌ని 'కాగ్' ఇవ్వడం జరుగుతుంటుంది. 'కాగ్' ఇచ్చిందంతా అదేదో భగవద్గీత, ఖురానో లేక బైబిల్ కాదు.

(అంతరాయం)

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు (నగరి): (మైక్ లేకుండా) ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరిక్కడ ఉండి ఏమి చెప్పారు? నేడేం చెపుతున్నారు.

శ్రీ ఎన్. కిరణ్ కుమార్‌రెడ్డి: 'కాగ్'లో చాలా రిమార్క్స్ వచ్చాయి. నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పాను, ఇప్పుడూ చెపుతున్నాను, భవిష్యత్తులో కూడా చెపుతాను. 'కాగ్' ఏ రిపోర్టు ఇస్తుందో మీకు అర్థం కాకుండా ఉంటే నేనేమీ చెప్పలేను.

(అంతరాయం)

శ్రీ గాలి ముద్దు కృష్ణమ నాయుడు : (మైక్ లేకుండా) ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయం మీకు తెలియదా?

శ్రీ ఎన్. కిరణ్ కుమార్‌రెడ్డి : దయచేసి ఒక్క నిమిషం వినండి. You are a Senior Member. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు 'కాగ్' ఇచ్చిన ఒక రిపోర్ట్ గురించి నేను చెపుతాను. శ్రీశైలం రివర్సబుల్ టర్బైన్స్ విషయంలో రూ.13000 కోట్లు నష్టం వాటిల్లే విధంగా ఆనాటి ప్రభుత్వం చేసిందని 'కాగ్' రిపోర్టులో పేర్కొన్నారు. దాన్ని ఈ సభలో పెట్టారు. అది చర్చకు వచ్చింది. ఆనాడు మీరు తీసుకొన్న నిర్ణయం వల్ల, కాంట్రాక్టర్స్‌కి మేలు చేయడం వల్ల రూ.14000 కోట్లు నష్టం వచ్చిందని చెప్పారు. నేను ఆ రోజుల్లో ఆ కమిటీలో ఉన్నాను.

(అంతరాయం)

We dropped that observation. రూ.14000 కోట్ల రూపాయలకు సంబంధించి 'కాగ్' ఇచ్చిన అబ్జర్వేషన్ విషయాన్ని ఆ రోజుల్లో నేను ప్రతిపక్షంలో ఉండి, కమిటీలో ఉండి we dropped that observation. ఎందుకంటే, పనుల్లో ఆలస్యమైంది, దాని వల్ల ఇంట్రస్ట్ పెరిగింది, దాని వల్ల జనరేషన్ కాస్ట్ పెరిగింది. ఏడు సంవత్సరాల పాటు ఆ మిషనరీని ఓపెన్ చేయలేదన్న విషయాలన్నింటినీ

పరిశీలించిన తరువాత ఆ రూ.14000 కోట్ల నష్టం వాటిల్లిన దాన్ని పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీలో మేము డ్రాప్ చేయడం జరిగింది.

**ఉ.11.40**

కాగ్ అబ్జర్వేషన్స్ ఆ విధంగా వుంటాయి. కాగ్ అబ్జర్వేషన్స్ మీద ప్రభుత్వం నుంచి సమాధానం పంపిస్తుంటాము. కాగ్ అబ్జర్వేషన్స్ అన్నీ కరెక్ట్ అని కాదు. వారి అబ్జర్వేషన్స్‌ను వారి అకౌంటింగ్ ప్రొసీజర్ ప్రకారం వారు మనకు చెబుతారు. అవన్నీ కరెక్ట్ అని కాదు. నోషనల్ లాసెస్ ఈ విధంగా చేసి వుంటే బాగుంటుందని నేను ఒక ఎగ్జాంపుల్ చెబుతున్నాను. ఇటువంటివి వందల ఎగ్జాంపుల్స్ వుంటాయి కాగ్ రిపోర్ట్స్‌లో. సో, ఎవరైతే పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో వుంటారో వారు అబ్జర్వేషన్స్ రిపోర్ట్ చేసి హౌస్‌కి పంపిస్తారు. ఏవైనా పొరపాట్లు వుంటే వాటిని రెక్టిఫై చేసి పంపించటం జరుగుతుంది.

( ఆ సందర్భంగా తెలుగు దేశం పార్టీ సభ్యులు శ్రీ రావుల చంద్ర శేఖర రెడ్డి, శ్రీ డి.నరేంద్ర కుమార్ తమ స్థానాల వద్ద నిలబడి తమకు మాట్లాడటానికి అవకాశమివ్వవలసిందిగా కోరసాగారు)

మిస్టర్ స్పీకర్: ఇంతకుమునుపే మీకు అవకాశమిచ్చాను. కూర్చోండి...... your own member is speaking. కేశవ్ గారూ, కంక్లూడ్ చేయండి. You have to conclude within two minutes.

( తమకు మాట్లాడటానికి అవకాశమివ్వాలని డిమాండ్ చేస్తూ తెలుగు దేశం పార్టీ పక్ష సభ్యులు అంతరాయం కలిగించసాగారు. మరొక వైపు తెలుగు దేశం పార్టీ సభ్యులు శ్రీ రావుల చంద్ర శేఖర రెడ్డి తమకు పాయింటాఫ్ ఆర్డర్‌కు అనుమతించవలసిందిగా కోరసాగారు . )

మిస్టర్ స్పీకర్: I have already given you an opportunity to speak. Again and again, I cannot give you an opportunity. Your own member is speaking. కేశవ్ గారు మాట్లాడుతున్నారు. ఆయన మీ పార్టీ సభ్యులే కదా? మీరు కూర్చోండి.....

(మధ్యలో ముఖ్య మంత్రి గారికి అవకాశమిచ్చారు కదా అని తెలుగు దేశం సభ్యులుప్రశ్నించారు.)

మిస్టర్ స్పీకర్: సభా నాయకుడైన ముఖ్యమంత్రి గారికి అవకాశమివ్వకపోతే ఇంకెవరికిస్తారు? మీరు కూర్చోండి. Let us regulate the business. Please cooperate with the Chair. Your own member is on his legs. కేశవ్ గారూ మీరు మాట్లాడి కంక్లూడ్ చేస్తారా లేదా?

శ్రీ పి.కేశవ్ః సార్, హౌస్ ఆర్డర్‌లో లేదు కాబట్టి నేను మాట్లాడలేకపోతున్నాను. మెంబర్స్ డిమాండ్ చేస్తున్నారు కాబట్టి మీరు కూడా వాళ్ల డిమాండును కన్సిడర్ చేయ వలసిన పరిస్థితి వుంది సార్......

(తెలుగు దేశం పార్టీ సభ్యులచే అంతరాయం )

మిస్టర్ స్పీకర్ః Again this will become a big debate. You know it very well. మీరు కూర్చోండి. ఇంతకుముందు మీకు అవకాశమిచ్చాను నేను. రావుల గారూ, ప్లీజ్ కూర్చోండి. Let us regulate the business. సభ కూడా జరగాలి కదా? మీ సభ్యుడే మాట్లాడుతున్నారు. ఆయనను మాట్లాడనివ్వండి. Please cooperate with the Chair.

(తెలుగు దేశం పార్టీ సభ్యులచే అంతరాయం కొనసాగింపు.....)

మిస్టర్ స్పీకర్ః I have already given you an opportunity. Leave it at that. సభను జరగనివ్వండి............

(తెలుగు దేశం పార్టీ సభ్యులచే అంతరాయం కొనసాగింపు.....)

మిస్టర్ స్పీకర్ః This is not proper. Please cooperate with the Chair. I have given you an opportunity and more over your own member is on his legs. Mr. Keshav garu please conclude within two minutes as I have to call the next speaker.

శ్రీ పి. కేశవ్ః సార్ హౌస్ ఆర్డర్‌లో లేనప్పుడు నేను ఎట్లా మాట్లాడాలి సార్?

మిస్టర్ స్పీకర్ః You have taken already more than an hour. Please conclude within two minutes.

శ్రీ పి.కేశవ్ః సార్ మాట్లాడుతున్నాను. సార్ మీరు నా పేరు పిలుస్తున్నారు. కాని హౌస్ ఆర్డర్‌లో లేదు. ఎలా మాట్లాడతాను సార్? రెండవది....... అవును మా వాళ్లే అడుగుతున్నారండీ..... మామూలుగా కాదు. పాయింటాఫ్ ఆర్డర్ అని రావుల చంద్ర శేఖర రెడ్డి గారు మాట్లాడటానికి ప్రయత్నించినపుడు Point of Order gets a precedent. తమరు పాయింటాఫ్ ఆర్డర్‌కు అవకాశమిస్తారన్న సదుద్దేశంతో నేను వెయిట్ చేశాను సార్......

మిస్టర్ స్పీకర్ః I appreciate that. Please go ahead and you have to conclude within two minutes as I have to ask the next speaker. మీరు కంక్లూడ్ చేయండి......

శ్రీ పి.కేశవ్ః ఒక్కటి సార్...... ఒకవేళ అందులో తప్పు లేదు. ఇది నిజమని ముఖ్యమంత్రి గారు సభకు చెప్పాలనుకోవటాన్ని నేను తప్పు పట్టను. వివరించవచ్చు. కాని కాగ్‌ని తక్కువ చేసే ప్రయత్నం మాత్రం సరియైనది కాదు సార్. దానిని అండర్‌మైన్ చేయకూడదు. అది

కాన్‌స్టిట్యూషనల్ బాడీ సార్. సుప్రీంకోర్టు జడ్జ్‌తో సమానమైన స్థాయి గల వ్యక్తిని అక్కడ కూర్చోబెట్టుకుని కాగ్‌ని సైతం అండర్‌మైన్ చేస్తే రేపు అధికార యంత్రాంగం ఏ రకంగా కాగ్‌ని రెస్పెక్ట్ చేస్తుంది సార్? ఇది సరియైన ఆలోచన కాదు సార్.

మిస్టర్ స్పీకర్ః సిఏజీ అబ్జర్వేషన్స్ గురించి చెప్పారు.

శ్రీ ఎన్.కిరణ్ కుమార్ రెడ్డిః నేను తప్పు పట్టలేదు. వారి అబ్జర్వేషన్స్ ఏ విధంగా వుంటాయి, అకౌంటింగ్ సిస్టమ్స్ నోషనల్ లాసెస్‌లో వాళ్లిస్తారు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ లేక పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ రికార్డుల లోకి అవి వెళతాయి. ఆ తరువాత ఆయా కమిటీ మీటింగ్స్ జరిగినప్పుడు కాగ్ నుంచి కూడా మెంబర్స్ వుంటారు. ప్రభుత్వం నుంచి ఎక్స్‌ప్లనేషన్ ఇస్తారు. అసెంబ్లీ నుంచి, కౌన్సిల్ నుంచి మన మెంబర్స్ వుంటారు. చాలా సార్లు వారిచ్చిన అబ్జర్వేషన్స్ సక్రమంగా లేవని డ్రాప్ చేస్తాము. అటువంటిది ఒక ఉదాహరణ తెలుగుదేశం ప్రభుత్వ హయాముకు సంబంధించిన ఒక పేరా విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల 13, 14 వేల కోట్ల రూపాయల నష్టం జరిగిందన్న విషయంలో కూడ నేను అపోజిషన్ పార్టీలో వున్నప్పుడు ఆ కమిటీ సభ్యునిగా వున్న సందర్భంలో ఆ పేరాను డ్రాప్ చేయటం జరిగిందన్న విషయాన్ని నేను ఈ హౌస్‌కు తెలియజేస్తున్నాను. కాగ్ ఫంక్షనింగ్, నోషనల్ లాసెస్, పద్ధతుల గురించి మనం ఈ విధంగా చేస్తే బాగుంటుందని చెబుతున్నాను. నేను అండర్‌మైన్ చేయటం లేదు. వారి కాన్‌స్టిట్యూషనల్ డ్యూటీ వారు చేస్తారు. అదే సత్యమని మనము అనుకోనవసరం లేదు. అది హౌస్‌కి వచ్చిన తరువాత దానిని పరిశీలన చేసిన తరువాత, అది కరెక్టా కాదా అని ప్రభుత్వం విశ్లేషణ చేయవలసిన అవసరముంది. వాళ్ల అబ్జర్వేషన్స్ ఇచ్చిన తరువాత 15 రోజుల టైమ్ ఇచ్చి మీ అకౌంట్స్ సబ్మిట్ చేయమంటారు. ఆ 15 రోజుల వ్యవధిలో అకౌంట్స్ సబ్మిట్ చేయకపోతే వాళ్లు ఏక పక్షంగా, ప్రభుత్వంతో మాట్లాడకుండానే వాళ్ల అబ్జర్వేషన్స్ ఇచ్చేస్తారు. అందువల్ల ఇవన్నీ కరెక్టా కాదా అని విశ్లేషణ చేసుకునేంత వరకు పొరపాటా కాదా అని తెలుసుకోవటానికి వీలు లేదు. కాగ్ అబ్జర్వేషన్స్‌ని మనం సీరియస్‌గా తీసుకుంటాము. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ వాటిని విశ్లేషణ చేస్తాయి. మళ్లీ హౌస్‌కు వస్తాయి. ప్రభుత్వ సలహాకు కూడా వస్తాయి. దానిని అండర్‌మైన్ చేయలేదు. అకౌంటింగ్ ప్రొసీజర్‌లో వారికున్న అభిప్రాయాల్ని వారు చెబుతారు. ప్రభుత్వం కూడా వారికున్న అభిప్రాయాల్ని చెబుతుంది. ఆ అభిప్రాయాలను బట్టి ఒక నిర్ణయం కమిటి తీసుకుంటుంది. అటువంటి అంశానికి సంబంధించి దాదాపు రు. 13, 14 వేల కోట్ల విషయంలో ప్రభుత్వం పొరపాటు చేసిందంటే ఆ అంశాన్ని డ్రాప్ చేసిన అంశం గురించి నేను తెలియచేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్ః You leave that there only. వదిలెయ్యండి..... కేశవ్ గారూ, మాట్లాడండి.....

శ్రీ పి. కేశవ్ః సార్, ముఖ్యమంత్రి గారు చెప్పిన దానిని బట్టి అది బైబిల్ కాదు, ఖురాన్ కాదు అంటే తప్పకుండా దానిని అంత సీరియస్‌గా తీసుకోనవసరం లేదన్న సంకేతం బయటికి వెళ్లిందని నేను వారికి గుర్తు చేశాను. రాజ్యాంగబద్ధమైన అటువంటి సంస్థ మీద సాక్షాత్తూ ఈ రాష్ట్ర అధినేత అయినటువంటి ముఖ్యమంత్రి గారు అటువంటి కామెంట్ చేస్తే దానిని బయట నాన్ సీరియస్‌గా తీసుకునే ప్రమాదముంది. నిప్పులేనిదే పొగ రాదన్నట్లుగా కచ్చితంగా మూలాలున్నప్పుడే

కాగ్ రిపోర్టులోకి వస్తాయి. కాగ్ రిపోర్టులోకి వచ్చే ముందు డిపార్ట్‌మెంటల్ కోఆర్డినేషన్ మీటింగ్స్ పది వరకు జరుగుతాయి. కాగ్ రిపోర్ట్‌లోని అబ్జక్షన్స్‌ను పేరాగ్రాఫ్స్ అంటారు. ఆ పేరాగ్రాఫ్స్ డిపార్ట్‌మెంట్స్‌కు సర్క్యులేట్ అవుతాయి. దాని మీద వాళ్లు ఎక్స్‌ప్లనేషన్స్ ఇస్తారు. ఎక్స్‌ప్లనేషన్స్ మీద మీటింగ్స్ జరుగుతాయి. మీటింగ్స్ జరిగినప్పుడు వారి సమాధానంతో సంతృప్తి చెందితే డ్రాప్ చేస్తారు. వాళ్లు ఎక్స్‌ప్లనేషన్స్‌పై సంతృప్తి చెందనప్పుడు, వాళ్లు కచ్చితమైన సమాధానం ఇవ్వనప్పుడు మాత్రమే కాగ్ నివేదికలోకి వస్తుంది. కాగ్ నివేదికలోకి వచ్చిందంటే తప్పకుండా అందులో కొంత అనుమానాస్పదమైనది వున్నట్లే. అంతే తప్ప అది వూరికే ఏదో ఆషామాషీగా వచ్చిందనేది కాదు. చాలాసార్లు మీరే కాగ్ నివేదికల గురించి, వాటి ప్రాధాన్యతల గురించి కమిటీ మీటింగులలో మీరు చెప్పిన మాటల గురించి ఈ సందర్భంగా నేను ఉటంకిస్తున్నాను. రాష్ట్ర ప్రయోజనాలను, ప్రజల ప్రయోజనాలను పరిరక్షించడంలో కాగ్ పాత్ర ఏమిటన్నది మనకు తెలిసిందే. సార్, అది భగవద్గీత కాదని చెప్పారు కాబట్టి ఇక కాగ్ పాత్ర గురించి మాట్లాడడం వేస్ట్.

మిస్టర్ స్పీకర్: Last two minutes only, please conclude. I have to give an opportunity to others also.

శ్రీ పి.కేశవ్: మీరు టు మినిట్స్ అనొద్దండి సార్. ఐ యామ్ కంక్లూడింగ్.... సార్, నేను కోరేదేమంటే ఇవ్వాళ రాష్ట్రంలోని రైతాంగం మొదలుకొని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందుల్లో వున్నారు. ప్రతి ఒక్కరూ ఈ శాసనసభ వైపు చూస్తున్నారు. విద్యుత్ సంక్షోభంపై ఈ ప్రభుత్వం ఏ రకమైన సమాధానమిస్తుందని ఎదురు చూస్తున్నారు. ఈ రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొని వున్న పరిస్థితికి కారణం కచ్చితంగా ఈ రాష్ట్ర ప్రభుత్వమే.

2004 నుండి ఇవ్వాళ్టి వరకు వున్న పాలకులందరూ దీనికి బాధ్యులేనని ఈ సదర్భంగా నేను గుర్తు చేస్తున్నాను.

కుప్పకూలిన విద్యుత్ రంగాన్ని తెలుగుదేశం ప్రభుత్వం రిఫార్మ్స్ పెట్టి వెలుగులు చిమ్మే రాష్ట్రంగా చేసి, పక్క రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిన పరిస్థితుల్లో , తెలుగుదేశం ప్రభుత్వం ఆ రోజుల్లో ఆ విధమైన పద్ధతుల్లో పని చేసిన పరిస్థితుల్లో, రాష్ట్రంలో అన్ని రకాలుగా ఒక ట్రాన్స్పరెన్సీ విధానాన్ని తీసుకొచ్చిన పరిస్థితుల్లో , ప్రైవేటుగా ఎవరికైనా ఇస్తే వారికి తక్కువ ధరకివ్వాలి, వారు భూమి కొంటామంటే అ భూమిని ప్రభుత్వం తక్కువ ధరకివ్వాలి, ఇలాంటివన్నీ పెడితే, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఇలాంటివన్నీ చేస్తే ఈ ప్రభుత్వం కేవలం ప్రైవేటు సంస్థల పట్ల మోజుతో కేవలం జెన్కోకు ఇవ్వాల్సిన ప్రభుత్వ సబ్సిడీలను ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. డిస్కంలను నిర్వీర్యం చేసింది. ట్రాన్స్‌కోకు పెట్టుబడులు పెట్టకుండా వాళ్లు గ్రిడ్ లైన్స్ వేసుకోకుండా నిర్వీర్యం చేసింది. ఇవ్వాళ పొరపాటున మనకు గ్యాస్ వచ్చి గ్యాస్ బేస్‌డ్ పవర్ జనరేట్ అయినా కూడా ఆ పవర్‌ను హైదరాబాదుకు తీసుకురావడానికి అవసరమైన పూర్తి స్థాయి గ్రిడ్ ఈ రాష్ట్రంలో లేదన్న విషయం వాస్తవం కాదా అని నేను అడుగుతున్నాను.

ఉ.11.50

కేవలం ముందుచూపు లేకపోవడం వల్ల, ముందు ఆలోచన చేయకపోవడం వల్ల భారమంతా ప్రయివేటు వ్యక్తుల మీద ఉండడం వల్ల రాష్ట్ర ప్రజలు ఈ రోజు మూల్యం చెల్లించవలసి వస్తుందని గుర్తు

చేస్తున్నాను. ఈ రాష్ట్ర ప్రభుత్వ అవినీతి వల్ల, అక్రమాల వల్ల, అసమర్థత వల్ల, అవగాహనా రాహిత్యం వల్ల, ముందు చూపు లేకపోవడం వల్ల, ప్రణాళికాబద్ధమైన పెట్టుబడులు పెట్టకపోవడం వల్ల, ఇవ్వవలసిన సబ్సిడీలు ఇవ్వకపోవడం వల్ల అవినీతి భారమంతా ప్రజలపై వేయడం జరుగుతుంది. కేంద్రం నుండి రావలసిన సబ్సిడీలు సాధించలేకపోవడం వల్ల, కేంద్రం నుండి పెట్టుబడులు, కొత్త ప్లాంట్సు రాకపోవడం వల్ల, కేంద్రం చూపిన వివక్షత వల్ల, గ్యాస్ రాకపోవడం వల్ల, ఎమ్‌పిల నిర్వాకం వల్ల, మర్చెంట్ పవర్ కంపెనీల మీద ప్రేమ వల్ల ఈ విధంగా జరుగుతోంది.

మిస్టర్ స్పీకర్ః ప్లీజ్ కంక్లూడ్.

శ్రీ పి. కేశవ్ః అధ్యక్షా, ఒక సెల్‌ఫోన్ పనిచేయకపోతే మనం ఎంత ఇబ్బంది పడతాము, ఒక నిమిషం ఏసి పని చేయకపోతే ఎంత ఇబ్బంది పడతాము. పల్లెల్లో 12 గంటలు కరంటు లేకపోతే 12 నిమిషాలు ఈ సభలో చర్చించలేమా? ఎందుకు బాధ? ఇంతకంటే మించింది ఏమి ఉంది? గ్రామాలలో ప్రజలు త్రాగునీటి కోసం కిలోమీటర్లు నడచి వెళ్లే పరిస్థితి నెలకొన్నది. పల్లెల గురించి మాట్లాడాలంటే ఐదు నిమిషాలు ఎక్కువ తీసుకుంటే కొంపలంటుకు పోతాయా? ఇది చాలా బాధాకరంగా ఉంది. 12 గంటలు పవర్‌కట్ చేసి వ్యవసాయ రంగాన్ని, ఇతర ఉత్పత్తి రంగాన్ని నిర్లక్ష్యం చేసే ఈ ప్రభుత్వాన్ని నిలదీసే ప్రక్రియలో మీరు కూడా సహకరించాలని కోరుతున్నాను.

మీ నియోజక వర్గంలో ఓటర్లు కూడా ఈ పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. వారి పరిస్థితి ఇంతకంటే భిన్నంగా ఏమీ లేదు. వారి పరిస్థితిని, వారి బాధలను చెప్పుకునే అవకాశం ఇవ్వండి సర్. డిమాండ్సుకు వచ్చినప్పుడు కూడా ఈ పరిస్థితి ఉంటే మీరు ఇలా చేస్తే ఎలా? రాష్ట్రంలో ఉచిత విద్యుత్‌ను వై.ఎస్.రాజశేఖర్ రెడ్డిగారు ఇవ్వలేదు, రోశయ్యగారు ఇవ్వలేదు, కిరణ్ కుమార్ రెడ్డిగారు ఇవ్వలేదు అధ్యక్షా. రాష్ట్ర ప్రజలు విద్యుత్‌ను క్రాస్ సబ్సిడీ రూపంలో ఇస్తున్నారని గుర్తు చేస్తున్నాను. కమ్యూనిస్టు పార్టీలు నిరవధిక దీక్షలు చేస్తున్నాయి. వామపక్ష పార్టీల వారు విద్యుత్ పోరాటాలు చేస్తున్నారు. మేము కూడా పోరాటాలు చేశాము. రైతులకు మీరు ఇచ్చేది అరకొర విద్యుత్ కాదు, నిరంతరంగా విద్యుత్ ఇవ్వాలన్నది మా డిమాండ్. ఏడు గంటలు కరెంటు ఇవ్వండి. వెంటనే ధరలను తగ్గించాలి లేదా ప్రభుత్వం భరించాలి. సర్‌ఛార్జీలను రద్దు చేయాలని ప్రధానమైన డిమాండ్ చేస్తున్నాము. ప్రభుత్వాన్ని అనేకసార్లు వైట్ పేపర్ పెట్టమని మేము డిమాండ్ చేశాము. ప్రభుత్వం అలాంటి సాహసం చేయలేదు. ఎందుకంటే వారి అవినీతి, అక్రమాలు వెలుగులోకి వస్తాయని వైట్ పేపర్ పెట్టడం లేదు. శాసనసభలో రాష్ట్ర ప్రజానీకానికి రాష్ట్ర విద్యుత్ రంగం మీద ఒక బ్లాక్ పేపర్‌ను ప్రవేశపెడుతూ అయామ్ టేబ్లింగ్ దిస్ గవర్నమెంట్ ఈ సభలో సర్ మరల విద్యుత్ రంగం అభివృద్ధిలోకి రావాలంటే రాష్ట్రం వెలుగులు చిమ్మాలంటే చంద్రబాబుగారి నాయకత్వంలోకి రావాలి, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత మాత్రమే సాధ్యమవుతుందని ప్రజలు నమ్మకంతో ఉన్నారు. అది నిజమయ్యే పరిస్థితి త్వరలోనే ఉంది.

శ్రీ బొత్సా సత్యనారాయణ (రవాణా శాఖా మంత్రి)ః అధ్యక్షా, తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ పి. కేశవ్ విద్యుత్ రంగంలో ప్రస్తుతం ఉన్న కొరత గురించి, సంక్షోభం గురించి మాట్లాడడం జరిగింది. ఈ రోజు విద్యుత్ కొరత లేదని కాని, ప్రభుత్వానికి ఈ విషయంలో కన్‌సర్న్ లేదని చెప్పడం మాత్రం భావ్యం కాదు. దాని గురించి అందరికీ బాధ ఉంది. వారి ప్రసంగంలో లేని అవాస్తవాలు మాట్లాడడం,

లేని వాటిని అవునన్న విధంగా చిత్రీకరించి ప్రభుత్వం మీద అపవాదులు మాట్లాడడం సమంజసం కాదు.

ముఖ్యంగా టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన వాటిని, పేపర్‌లో వచ్చిన వాటిని చూపించి పార్టీ అధ్యక్షులు బొత్సగారు నాసిరకం కోల్ కొన్నారని, దాని వల్ల ప్రభుత్వానికి రూ.350 కోట్లు నష్టం వచ్చిందని, హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారని అనడం తప్పు. అది సత్యదూరం దానిని రికార్డుల నుండి తొలగించండి. తెలుగు పేపర్‌లో వచ్చినా, ఇంగ్లీషు పేపర్‌లో వచ్చినా, ఏ పత్రికలో వచ్చినా, వాటన్నింటినీ ఇక్కడ క్రోడీకరించి లేని దానిని ఆపాదించడం, ప్రభుత్వం మీద వ్యక్తిగతంగా ఆరోపణలు చేయడం సమంజసం కాదు. తెలుగుదేశం పార్టీ ఉన్నప్పుడు చంద్రబాబుగారు ఇచ్చినట్లుగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. వై.ఎస్. ఇవ్వలేదు, కిరణ్ ఇవ్వలేదు, బొత్స ఇవ్వలేదు అని అనడం తప్పు. 2004కంటే ముందు రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి విద్యుత్ రంగంలో ఏ విధంగా ఉందో అందరికీ తెలుసు. బకాయిలు కట్టలేదని రైతులను తీసుకువెళ్లి జైలులో పెట్టిన పరిస్థితి ఉంది. ఆనాడు వ్యవసాయానికి కరెంటు ఇవ్వమంటే వ్యవసాయం దండగనే పరిస్థితి ఉంది. వాళ్లు అవన్నీ మరచిపోయినట్లున్నారు. ప్రొడక్షన్, డిమాండ్‌లో వ్యత్యాసం వచ్చింది. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల జల విద్యుత్ లేదు. గ్యాస్ ఆధారిత పరిశ్రమలు సుమారు 3,000 మెగావాట్ల వరకు ఉన్నాయి. వాటికి కూడా గ్యాస్ లేని పరిస్థితి నెలకొంది. వాటికి సంబంధించి ఇక్కడ తీసుకున్న నిర్ణయాలు కాదు, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు. ఆ నిర్ణయాలకనుగుణంగా కేంద్రంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తీసుకువస్తున్నాము. కాని గ్యాస్ గురించి ఆ రోజున బిడ్డింగ్ జరుగుతున్నప్పుడు, అప్పట్లో ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వానికి ఆలోచన లేదా? ఇది మన అవసరాలకు పనికి వస్తుంది, ఈ ప్రభుత్వం కూడా ఆ బిడ్డింగ్‌లో పాల్గొనాలి, ఆ విధంగా పాల్గొని ఈ రాష్ట్ర ప్రజల అవసరాలు తీర్చాలి అన్న ఆలోచన కూడా లేదా? అప్పుడేమైంది? ఇప్పుడు చెబుతున్నారు దాని గురించి?

తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ప్రజల గురించి, రైతుల గురించి, వారి సంక్షేమం గురించి, గ్రామీణ ప్రజల గురించి ఆలోచన చేయలేదు. ఈ రోజు వచ్చి మాట్లాడుతున్నారు ఎందుకంటే వారికి కావలసింది అధికారం. ఆ అధికార దాహంతో ఈ రోజు వారి గురించి ఆలోచన చేస్తున్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రేమ ఏమైంది? ఇంకో సంవత్సరంలో ఎన్నికలు వస్తున్నాయని ఈ విధంగా మాట్లాడుతున్నారు. వీరిని ప్రజలు ఎంతవరకు విశ్వసిస్తారో ఎన్నికలలో నిరూపించుకోవలసిన అవసరం ఉంటుంది. ఇక్కడ చెప్పినా, పాదయాత్రలో చెప్పినా తెలుగుదేశం పార్టీని ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరు. వారు మాట్లాడిన మాటలను రికార్డుల నుండి తొలగించాలని కోరుతున్నాను.

మ.12.00

శ్రీ డి. నరేంద్రకుమార్ (పొన్నూరు): సార్, బొత్సా సత్యనారాయణ గారు అన్నారని, అధిష్టానానికి ఫిర్యాదు చేశారని పేపర్‌లో వచ్చింది. ఎన్ని రోజులయ్యింది సార్? ఈ సభలో ఇప్పుడు తప్ప, ఇంతవరకూ బహిరంగంగా ఆయన ఖండించారా? ఎవరికి చెబుతారు శ్రీరంగ నీతులు? ఈ సభలో, చంద్రబాబు నాయుడు గారు, వ్యవసాయం దండగ అనే మాట నేను అనలేదు, ఏ రికార్డులలో ఉందో చూపించమనండి, ఆ మాట అన్నట్లు మీరు నిరూపిస్తే రాజకీయాల నుండి తప్పుకుంటామంటే, ఈ ప్రభుత్వం కింద నుండి పైదాకా, అధికారులు ఎంత వెతికినా స్టేట్‌మెంట్ దొరకలేదు. ఆ రోజు

గోబెల్స్ ప్రచారం చేశారు. బొత్సా సత్యనారాయణ గారు ఏమి చెబుతున్నారు? ఇంపోర్టెడ్ కోల్ గురించి కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, స్కామ్ జరిగిందని ఆరోపణలు వచ్చినప్పుడు, ముఖ్యమంత్రి గారు దానిపై విచారణ చేయించడానికి సిద్ధంగా ఉన్నారా అని నేను ప్రశ్నిస్తున్నాను. అధికార దాహం మాకుందా? ప్రజల కోసం మేము పనిచేస్తున్నాం. అపోజిషన్‌లో ఉన్నా కూడా మా నాయకుడు చంద్రబాబు నాయుడు గారు నిరంతరం ప్రజల సమస్యలపైన పోరాటం చేస్తున్నారు. 63 సంవత్సరాలలో ప్రజా సమస్యల కోసం ఆయన పాదయాత్ర చేస్తున్నారు. పిపిఏల పై ఆరోజు మా మీద విమర్శలు చేశారు. అదే జియంఆర్, జివికె ................

(మైక్ కట్ చేశారు)

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే అంతరాయం)

మిస్టర్ స్పీకర్ : మీరు క్లారిఫికేషన్ చేస్తామన్నారు, ఇచ్చాను. దానితో ముగిద్దాము. Please sit down.

(ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ డి.నరేంద్రకుమార్‌కి మైక్ ఇవ్వాలని పోడియం వద్దకు వచ్చారు)

He has already spoken and clarified. మీరంతా కూర్చోండి. You wanted to clarify on what Mr.Botcha Satyanarayana said. మీరు సబ్జెక్ట్ డీవియేట్ అయి డిబేట్ చేస్తున్నారు. మీ పార్టీ సభ్యుడికి మాట్లాడడానికి అవకాశం ఇచ్చాను. మీరు ఆ సమయాన్ని ఉపయోగించుకున్నారు. Leave it at that. Please sit down.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు తమ తమ స్థానాలకు వెళ్లి నిలబడి శ్రీ డి. నరేంద్రకుమార్‌కి మైక్ ఇవ్వాలని కోరారు )

ఆయన పేరు ప్రస్తావించారు కాబట్టి ఆయనకి అవకాశం ఇచ్చాను. ఆయన దానిపై క్లారిఫై చేశారు. మీరు కౌంటర్ చేశారు. Leave it at that.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి తిరిగి అంతరాయం)

If you don't want to run the House, there is nothing that we can do. This is not the way we can run the House. Please sit down. You cannot go on making counter allegations. No, this is not possible. వదిలేయండి. ఇంకొక సందర్భంలో మీ పార్టీ సభ్యుడు మాట్లాడేటప్పుడు మీరు అవకాశాన్ని ఉపయోగించుకోండి. Please sit down. I have already given him an opportunity.

(Interruptions)

విద్యుత్ సమస్య పై చర్చ వద్దా? కౌంటర్ అలిగేషన్స్‌తో ముగించుకుందామా? కూర్చోండి. దయచేసి సహకరించండి.

శ్రీ జి. ముద్దుకృష్ణమ నాయుడు (మైక్ లేకుండా) : మాకు అధికార దాహం ఉందని చెప్పారు.

మిస్టర్ స్పీకర్ : మాట్లాడారండీ.

శ్రీ ఇ. దయాకర్ రావు (పాలకుర్తి): (మైక్‌లేకుండా) సార్ మైక్ మధ్యలో కట్ చేశారు.

మిస్టర్ స్పీకర్ : ఏమిటండీ? What is this? Is this the way you want to run the House? దయచేసి కూర్చోండి.

శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డి (బాన్సువాడ): సార్, సభ ఆర్డర్‌లో లేదు.

(Interruptions)

మిస్టర్ స్పీకర్ : కూర్చోండి. I have already given him an opportunity Ashok Gajapathi Raju garu.

(అంతరాయం కొనసాగింపు)

ఆయనకి అవకాశం ఇచ్చాను కదా. Again why are you making counter allegations. వదిలేయండి.

శ్రీ డి. నరేంద్రకుమార్ (మైక్ లేకుండా) : దేశాన్ని తాకట్టు పెట్టారు.

MR. SPEAKER: If you don't want debate on Power, there is nothing that we can do? చెప్పండి.

(అంతరాయం)

కూర్చోండి. విద్యుత్ సమస్య పై మీరొక్కరే కాదు మాట్లాడేది. మిగతా పార్టీలకు సంబంధించి చాలా మంది సభ్యులు మాట్లాడాలి.

SRI P. ASHOK GAJAPATHI RAJU (Vizianagaram): (Without mike) Sir, what is this?

MR. SPEAKER: You should question your Members.

శ్రీ పి. అశోక్ గజపతిరాజు : తమరు మైక్ కట్ చేసి మా గొంతులు నొక్కడం న్యాయం కాదు సార్.

MR. SPEAKER: Please sit down.

(Interruptions continued)

మీరు కూర్చోండి. This is not the way we run the House. మీకు ఈ సమస్య పై చర్చించుకోవాలని లేకపోతే ఇతర సభ్యులకు అవకాశం ఇవ్వండి. సభా సమయాన్ని ఈ విధంగా వృధా చేయకుండి. మీకు తగిన సమయం ఇచ్చాను. మీరు క్లారిఫై చేశారు. కూర్చోండి.

(Interruptions)

Please sit down.

మ.12.10

శ్రీ డి. నరేంద్ర కుమార్‌: అధ్యక్షా, మీకు విజ్ఞప్తి చేసేదేమంటే విద్యుత్‌పై చర్చ మీద మాకు ఆసక్తి లేనట్లు మంత్రి గారు మాట్లాడడం మాకు బాధ కలిగించింది. అది సరైనది కాదని విజ్ఞప్తి చేస్తున్నాను. ఎందుకంటే బొత్స సత్యనారాయణ గారికి వారు వ్యక్తిగతంగా వివరణ ఇవ్వడంకోసం మీరు అవకాశం ఇచ్చారు. ఆయన అంతవరకు పరిమితమై ఉంటే మాకు అభ్యంతరం లేదు. కానీ ఆయన దానిని వదిలివేసి తెలుగుదేశం పార్టీ మీద, చంద్రబాబు నాయుడు గారి మీద ఎన్నో విమర్శలు చేశారు. మీరు సభా రికార్డులు తీయండి. ఆయన మంత్రిగా ఉండి, ఆయన కేవలం వివరణ మీద మాట్లాడి ఉండాలి. సభను ఏవిధంగా నడపాలని బాధ్యత కలిగిన వ్యక్తి మా మీద విమర్శలు చేస్తే వివరణ ఇచ్చుకోవాల్సిన బాధ్యత మా మీద, మా పార్టీ మీద ఉండి. విద్యుత్‌కు సంబంధించి రాష్ట్ర ప్రజల కోసం మేం పనిచేశాం. మేం అధికారం కోల్పోవచ్చు. దానికి మాకు ఏ మాత్రం బాధ లేదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం మేం పని చేశాం. మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇక్కడ కూర్చున్నవారు ఏమి చెప్పారు? స్వర్గీయ రాజశేఖర రెడ్డి గారు ప్రధాన ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు మా ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచితే రోల్‌బ్యాక్ పేరుతో ఉద్యమాలు నడిపి ముగ్గురు అమాయకులు ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారు. తరవాత 2004లో వారు అధికారంలోకి వచ్చిన తరవాత ఈ ప్రభుత్వం రోల్‌బ్యాక్ చేసిందా? ఒక్క రూపాయి అయినా ధర తగ్గించిందా? చనిపోయిన వారు ముగ్గురూ అమాయకులు, వారి శవాల మీద వీరు అధికారంలోకి వచ్చినందుకు వారి ఆత్మలు పై నుంచి క్షోభిస్తున్నాయి. ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి అయినా రోల్‌బ్యాక్ చేయలేదు. మా పార్టీ ప్రభుత్వంలో ఉన్నప్పుడు మేం ప్రజల కోసం పనిచేశాం.

మిస్టర్ స్పీకర్‌: బొత్స సత్యనారాయణ గారు చెప్పిన దాని మీద మీరు ఇప్పటికే వివరణ ఇచ్చారు కదా! You have clarified your party stand.

శ్రీ డి. నరేంద్ర కుమార్‌: అధ్యక్షా, నేను ముఖ్యమంత్రిగారిని ఒకటే డిమాండ్ చేస్తున్నాను. బొగ్గు దిగుమతిలో కుంభకోణం జరిగిందంటున్నారు కాబట్టి దాని మీద ప్రభుత్వం ఎందుకు విచారణకు ముందుకు రావడం లేదు? మీకు చిత్తశుద్ధి ఉంటే విచారణ వేయండి. వాస్తవాలు బయటకు వస్తాయి. నాసిరకం బొగ్గును అత్యధిక ధరకు కొనడం వలన నష్టం వచ్చిందని కాగ్ రిపోర్టులో వచ్చింది. కాగ్ రిపోర్టు ప్రకారం రూ.4500 కోట్లకు నాసిరకం బొగ్గు దిగుమతి చేసుకోవడం వలన రూ.500 కోట్లు కలుపుకొని రూ.5000 కోట్ల నష్టం వచ్చిందని చెబుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి గారు ఎందుకు విచారణకు ఆదేశించరు? విచారణకు ఎందుకు వెనుక్కు పోతున్నారు? విచారణ వేయండి, వాస్తవాలు బయటకు వస్తాయి. వాస్తవాలు బయటకు వచ్చినపుడు అసలు రంగు తెలుస్తుందని విచారణ వేయకుండా పారిపోతున్నారు. ఇవాళ నేను ఒకటే అడుగుతున్నాను.

MR.SPEAKER: We will leave at that. That is enough.

శ్రీ బొత్సా సత్యనారాయణః అధ్యక్షా, వారు మాట్లాడుతూ బొత్సా సత్యనారాయణ అన్నారు. అపుడు నేను ఉంట్లో ఉన్నాను. జలుబు చేసి జ్వరంగా ఉండడంతో ఇంట్లో ఉండగా కేశవ్ గారు సభలో మాట్లాడడాన్ని నేను టీవీలో చూశాను. ఆయనను సభకు రమ్మనండి, ఆయనను వచ్చి వివరణ చెప్పమనండని అన్నారు. వారు పిలిచారని నేను సభకు వచ్చాను.

(అంతరాయం)

ఒక నిమిషం వినండి. నా అంతట నేను వచ్చి అగ్రెసివ్‌గా మాట్లాడడానికి రాలేదు. సభకు వచ్చి సభలో చెప్పమని ఆయన అడిగితే నేను ఇంటి నుంచి సభకు రావడానికి పది నిమిషాలు పట్టింది. వారు చెప్పింది వాస్తవం కాదని చెప్పాను. ఇపుడు చంద్రబాబు నాయుడు గారి మీద చెబుతున్నారు. చంద్రబాబు నాయుడు గారు రాజశేఖర రెడ్డి గారిమీద చెబితే........

(అంతరాయం)

వారు సభలో లేరు, ఈ ప్రపంచంలోనే లేరు. ఆయన మాట్లాడలేరు. కానీ చంద్రబాబు నాయుడు గారి మీద నేను అంటున్నానని చెప్పారు. వారు ఈ సభలో సభ్యుడే కదా, ఆయన వచ్చి వివరణ ఇవ్వమనండి. ఆయన గురించి ఈయన ఎందుకు మాట్లాడుతున్నారు? ఇక రెండో విషయం. వారు వచ్చి.......

(మీలాగా ఆయన ఇంట్లో పండుకోలేదని తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ జి.ముద్దుకృష్ణమ నాయడు అన్నారు)

ఏమి మాట్లాడుతున్నారు? గాలి కబుర్లు చెప్పవద్దు, కూర్చోండి. ఇంకో విషయం.

(అంతరాయం)

ఆరోపణలు వచ్చి సిబిఐ విచారణలో క్లీన్ చిట్ వచ్చిన వారు నిండు సభలో ఒకరైనా, ఇద్దరైనా, ముగ్గురైనా ఉంటే వారిలో నేనూ ఒకడిని. అదే కాకుండా, ఇంకొక విషయానికొస్తే లక్షల రూపాయలు ఖర్చు పెట్టి వారు కేసులు హైకోర్టులో ఫైల్ చేస్తే కోర్టు కూడా చీవాట్లు పెట్టి వారికి లక్ష రూపాయల ఫైన్ వేసి మరలా కోర్టుకు వస్తే బాగుండదని చెబితే వారు సుప్రీంకోర్టుకు వెళ్లారు. సుప్రీంకోర్టు కూడా ఆ కేసులను డిస్మిస్ చేసింది. కడుపులో వారికి నామీద అంత బాధ ఉంది.

(అంతరాయం)

కానీ ఈ నిండు సభలో ఇలాంటి అబద్ధాలు చెబుతుంటే, వీధుల్లో తిరుగుతూ పాదయాత్రలో చెబుతున్న మాటలు ఏ రకంగా ప్రజలు నమ్ముతారు? ఇదే అబద్ధమైతే అది ఎందుకు అబద్ధం కాకూడదని చెప్పాను. దానితోబాటు పిపిఏల గురించి మాట్లాడుతున్నారు.

(అంతరాయం)

ఒకసారి ఒక ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందాన్ని ఇంకొక ప్రభుత్వం మార్చలేదు. అయినప్పటికీ 2004లో మా పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పిపిఏలను తిరగదోడడంతోబాటు ప్రభుత్వం మీద ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రివైజ్ చేసి ధరలను తగ్గించింది. ఆ విషయం ఆయనకు తెలుసు. అయినప్పటికీ కూడా ఇవాళ వచ్చి ఈ విధంగా మాట్లాడుతున్నారు. ప్రజల పట్ల మా ప్రభుత్వానికి

బాధ్యత ఉంది. మాకు ప్రజలు 2014 వరకు అధికారంలో ఉండేందుకు తీర్పు ఇచ్చారు. వందలు, వేల కోట్ల రూపాయలు ఖర్చు అయినప్పటికీ ప్రజలకు ఇబ్బందులు రాకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి రాష్ట్ర ప్రజల అవసరాలకు తగిన విధంగా వ్యవహరించడం మా బాధ్యత తప్ప వీరి లాగా లేనిపోని గాలి కబుర్లు పోగు చేసుకొని గాలి మాటలు మాట్లాడుతూ పయనిస్తూ, ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లు చేసుకోవాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. మాకు అధికారమే ముఖ్యం కాదు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ముఖ్యం. ఆ పరిస్థితుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు కూడా పనిచేస్తుందనే విషయాన్ని మీ ద్వారా వారికి తెలియజేస్తున్నాను.

మిస్టర్ స్పీకర్: పోచారం శ్రీనివాస రెడ్డి గారూ, మాట్లాడండి.

(తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం)

శ్రీ పోచారం శ్రీనివాస రెడ్డి: అధ్యక్షా, సభను ఆర్డర్‌లో పెట్టండి. ఈ రోజు రాష్ట్రంలో విద్యుత్ పరిస్థితిపైన మాట్లాడడానికి నాకు అవకాశం కలిగించినందుకు తమరికి ధన్యవాదాలు.

(మిస్టర్ డెప్యూటీ స్పీకర్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

ఇపుడు సభలో రెండు పార్టీల తీరు చూస్తుంటే ఒక సామెత గుర్తుకు వస్తుంది. నేను కొట్టినట్లుగా చేస్తా, నీవు ఏడ్చినట్లుగా చేయమన్నట్లుగా ఉంది తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల పరిస్థితి.

(అంతరాయం)

ప్రస్తుత ప్రభుత్వం అసమర్థ ప్రభుత్వం, అవినీతి ప్రభుత్వం, చేతగాని ప్రభుత్వమని ఇప్పటిదాకా చాలా చెప్పారు. ఇంత అసమర్థ ప్రభుత్వం, అవినీతి ప్రభుత్వం, చేతగాని ప్రభుత్వమని అనుకొన్నప్పుడు మొన్న అవిశ్వాస తీర్మానంలో ఎందుకు తటస్థంగా ఉన్నారు?

(తెలుగుదేశం సభ్యుల నుంచి అంతరాయం)

ఆ అవకాశాన్ని వాడుకోలేదు. అవిశ్వాస తీర్మానంలో అనుకూలంగా ఓటు వేసి ఉంటే ఈ ప్రభుత్వానికి బెదురు ఉండేది కదా! ఇదంతా మ్యాచ్ ఫిక్సింగ్.

(మీరు, వారూ సీట్లు కొనుక్కోవడానికి మేం మద్దతు ఇవ్వాలా అని శ్రీ మండవ వెంకటేశ్వర రావు అన్నారు)

విద్యుత్ సమస్య రాష్ట్రంలో చాలా తీవ్రంగా ఉన్న విషయాన్ని అందరం కూడా ఒప్పుకోవాలి. ఎందుకంటే ప్రతి వ్యక్తి జీవితంతో ముడిపడినది ఈ విద్యుత్ సమస్య. రైతులు పంటలు పండించాలన్నా, విద్యార్థులు చదువుకోవాలన్నా, కుటీర పరిశ్రమలు నడవాలన్నా, పరిశ్రమలు నడచి కార్మికులకు ఉపాధి దొరకాలన్నా, మంచినీటి పథకాలు నడవాలన్నా, రైతులు పంటలు పండించాలన్నా కరెంట్ కావాలి. సింగరేణిలో బొగ్గు వెలికితీయాలన్నా కూడా కరెంట్ కావాలి. ప్రతి అంశానికి విద్యుత్ అవసరం చాలా ముఖ్యమైనది. అలాంటి విద్యుత్ అవసరాల మేరకు రాష్ట్రంలో అందుబాటులో ఉండేలా చూడాల్సిన

బాధ్యత ప్రభుత్వానిది. రాష్ట్రంలో గృహ కనెక్షన్లు, వాణిజ్య కనెక్షన్లు, పరిశ్రమల కనెక్షన్లు దాదాపు 2.35 కోట్లు ఉన్నాయి.

మ.12.20

అధ్యక్షా, వినియోగదారులకు అవసరమైన, నాణ్యతతో కూడుకున్న కరెంటు ఇవ్వడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మీద్వారా ప్రభుత్వానికి తెలియచేస్తున్నాను. ఎందుకంటే దేనికైనా దూరదృష్టి కావాలి. అవసరాలు పెరిగిన కొద్దీ ప్రొడక్షన్ పెంచాలి. ప్రొడక్షన్ పెంచకుండా వినియోగదారుల పైన దీన్ని రుద్దుతామంటే న్యాయం కాదు. ఎందుకంటే ప్రభుత్వం ఇచ్చిన రిపోర్టులో 307 మిలియన్ యూనిట్ల విద్యుత్ అవసరముంది, 61.80 మిలియన్ యూనిట్ల షార్టేజీ ఉన్నదని చూపించారు. అధ్యక్షా, గత సంవత్సరం కూడా 287 మిలియన్ యూనిట్లు అవసరముంటే 51.76 మిలియన్ యూనిట్ల షార్టేజీ ఉన్నదని చూపించారు. గత సంవత్సరం షార్టేజీని గుర్తుంచుకుని, ఈ సంవత్సరం షార్టేజీ లేకుండా ఉత్పత్తి పెంచడమా లేక ఇతర రాష్ట్రాల నుంచి అందుబాటులో ఉన్న కరెంటుని కొనడమా చేసి ఉంటే ఈనాడు ఈ 61 శాతం షార్టేజీ వచ్చేది కాదనేది నా ఉద్దేశం. "7 గంటల కరెంటు ఇస్తున్నాం, రైతుల పంటలు ఎండకుండా కాపాడుతున్నాం" అని ఈ ప్రకటనలో చివరి పేజీలో ఇచ్చారు. కానీ ఇది పూర్తిగా సత్యదూరమైన విషయం. 7 గంటల కరెంటు కాదు, నేను ప్రతి నిత్యం నా నియోజక వర్గంలో ఫీడర్ వారీగా సమాచారం తెప్పిస్తున్నాను. ఎక్కడా ఒక్క ఫీడర్‌లో కూడా 7 గంటల కరెంటు ఇచ్చిన పాపాన పోలేదు. అంతే కాదూ కనీసం 5 గంటలు కూడా వరుస క్రమంలో ఒకే స్పెల్‌లో కరెంటు ఇచ్చిన పరిస్థితి లేదు. ఎందుకంటే.....

శ్రీ డి.శ్రీధర్ బాబుః సార్, డెఫిసిట్ 65% అన్నారు కరెక్ట్ కాదు. 61.80 మిలియన్ యూనిట్లు అది. మీరు 65 శాతమని చెప్పారు. అది కరెక్ట్ కాదు.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డిః అధ్యక్షా, 61.80 మిలియన్ యూనిట్ల షార్టేజీ అని చెప్పాను. నేను శాతం అనలేదు. దాని ప్రకారం చూస్తే షార్టేజీ 20 శాతం ఉంది. 307 మిలియన్ యూనిట్లు అవసరమనుకుంటే 245 మిలియన్ యూనిట్లు ఇస్తున్నారంటే 61.80 షార్టేజీ ఉంది. అంటే 20 శాతం షార్టేజి ఉంది. ఈ 20 శాతం షార్టేజీని ప్రపోర్షనేట్‌గా అన్ని రంగాలకూ మీరు సరఫరా చేసి ఉండి వుంటే ఈ రోజు రైతులకు ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. ఇక్కడ 7 గంటల కరెంటు ఇస్తున్నామని ప్రకటన చేశారు. నేను మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రి గారిని అడుగుతున్నాను, నా నియోజక వర్గంలో ప్రతి నిత్యం ఎన్ని ఫీడర్లకు ఎన్ని గంటల కరెంటు ఇస్తున్నారని అడుగుతున్నాను. నేను ప్రతి నిత్యం గత రెండు నెలలుగా రిపోర్టులు తెప్పిస్తున్నాను. ఎక్కడా ఒక్క ఫీడరులో కూడా ఏడు గంటల కరెంటు ఇచ్చిన దాఖలాలు లేవు. ఇది సత్య దూరం. ఎందుకంటే పంటలు ఎండిపోవడం లేదని ఒక మాటన్నారు. నా నియోజక వర్గంలో సంగోజీపేట్, కాదలాపూర్, హనుమాజీపేట్, కోనాపూర్ లాంటి నాన్ కమాండ్ ఏరియాల్లో మక్క పంట ఎండిపోయి రైతులకు నష్టం కూడా జరిగిందని మీద్వారా వారికి తెలియచేస్తున్నాను.

పంటలు ఎండిపోతున్నాయనే మాటను అందరూ అంగీకరించాల్సిందే. పంటలు ఎండిపోతున్న సందర్భంలో మేము అధికారులతో మాట్లాడాము. మొన్న టాస్క్‌ఫోర్స్ సిఎండీ గారితో మాట్లాడాం. ఆయన దగ్గరకి ఇప్పటికే రెండు సార్లు వెళ్లాం. వారు మాకు రైటింగ్‌లో ఏడు గంటల కరెంటు ఇస్తామని చెప్పారు. As per Government policy, the Discoms will ensure 7 hours power supply for Agricultural Sector without deviation అని తేదీ 18.08.2012

న ఇచ్చారు. మరలా మార్చి, 7వ తేదీన కూడా మా ఈటెల రాజేందర్ గారికి ఒక లెటర్ ఇచ్చారు. 7 గంటల కరెంటు ఇస్తున్నామన్న సందర్భంలో మేము సంతోషపడ్డాం. ఫోన్లు చేసి అందరికీ చెప్పాం. కానీ ఎక్కడా వారు చెప్పిన విధంగా ఏడు గంటల కరెంటును ఏ ఫీడరులో కూడా ఇవ్వలేదు. అదే విధంగా కరెంటు కోతలకు సంబంధించి ప్రత్యేకంగా తెలంగాణా ప్రాంతంలో చూస్తే "వేళాపాళా లేని విద్యుత్ కోతలు – అంధకారంలో అదిలాబాద్, ఖమ్మం లబోదిబో, పాలమూరులో చీకటి రాజ్యం, కోతలతో కుదేలైన కరీంనగర్, రంగారెడ్డిలో రంపపు కోత" ఇవన్నీ తెలంగాణా ప్రాంతానికి చెందిన ప్రతి ఒక్కరికీ ఇటు వ్యవసాయదారుడు కానివ్వండి, అటు వినియోగదారుడు కానివ్వండి ప్రతి ఒక్కరికీ విద్యుత్ కోత వలన తీవ్రమైన నష్టం జరుగుతున్నదని మీద్వారా తెలియచేస్తున్నాను.

రైతుల సమస్యల గురించి ముఖ్యమంత్రి గారి దగ్గరకు కూడా చాలాసార్లు వెళ్లాము. ఏడు గంటల కరెంటు ఇవ్వడంలో ఇక్కడ అన్యాయం జరుగుతున్నది, డిస్కంల వారీగా ఎలాట్‌మెంటును ఎప్పుడో చాలా రోజుల క్రితం చేశారు, ఈ ఎలాట్‌మెంటును రెవ్యూ చేసి అవసరం మేరకు వినియోగాన్ని బట్టి ఏ జిల్లాకు ఏ డిస్కాంకు ఏ విధంగా అవసరం ఉందో, ఆ విధంగా ఎలాట్ చేయమని ముఖ్యమంత్రి గారిని,ట్రాన్స్‌కో ఎండీ గారిని కూడా కోరాం. ఒకసారి ఎలాట్‌మెంటు చూస్తే సిపిడిఎస్ఎల్‌కు 43 శాతం, ఈపీడిసిఎల్‌కు 16.70 శాతం, ఎస్పిడిసియల్‌కు 22.90 శాతం, ఎన్పిడిసియల్‌కు (ఉత్తర తెలంగాణా లోని 5 జిల్లాలకు) 16.92 శాతం కేటాయించారు. ప్రత్యేకంగా ఈ రాష్ట్రంలో 30 లక్షల పంపుసెట్లు ఉంటే అందులో 18 లక్షల పంపుసెట్లు తెలంగాణా ప్రాంతాకు చెందినవి. ఆ 18 లక్షల పంపుసెట్లలో 10 లక్షల పంపుసెట్లు అదిలాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు చెందినవి. ఈ 10 లక్షల పంపు సెట్లకు సంబంధించి ఎన్‌పీడిసియల్‌కు ఏదైతే ఎలాట్‌మెంటు ఉందో దాన్ని పెంచమని చాలాసార్లు కోరాం. కానీ ఇంత వరకూ పెంచలేదు.

కరెంటు కోతల విషయానికొస్తే ఎన్‌పీడిసియల్‌కు 1900 మెగావాట్ల కరెంటు అవసరముంటే కేవలం 1200 మెగావాట్లు ఇస్తున్నారు. ఈ 1200 మెగావాట్ల నుంచి దాదాపు రైతులకు 1000 మెగావాట్లు అవసరముంటుంది. రైల్వే శాఖకు 152 మెగావాట్లు పోతుంది. సింగరేణికి 100 మెగావాట్లు పోతుంది. గృహ, వాణిజ్య అవసరాలకు 200 మెగావాట్లు పోతుంది. పరిశ్రమలకు 200 మెగావాట్లు పోతుంది. లిఫ్ట్ ఇరిగేషన్‌కు, స్ట్రీట్ లైట్స్‌కు 200 మెగావాట్లు పోతుంది. 1900 మెగావాట్లు అవసరమనుకుంటే కేవలం 1200 మెగావాట్లు మాత్రమే ఎన్‌పీడిసియల్‌కు ఎలాట్ చేశారు. దీనివలన 10 లక్షల కరెంటు మోటార్ల క్రింద వున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దయచేసి నేను ఈ ప్రభుత్వాన్ని కోరేదేమంటే ఎన్‌పీడిసియల్‌కు అత్యధికమైన పంపుసెట్లు ఉండి పంట పండిస్తున్న రైతులకు ఎక్కువ కేటాయింపులు ఇవ్వవలసిందిగా నేను వారిని కోరుతున్నాను. ఒకసారి గుర్తు చేసుకుంటే ఈరోజు పవర్ సప్లైలో కూడా పక్షపాతముందని హరీష్ రావు గారు చెప్పారు. పక్షపాతం ఉంది. మొత్తం రాష్ట్రంలో 9846 విద్యుత్ ఫీడర్లున్నాయి. అందులో తెలంగాణాలో 4995 , సీమాంధ్రలో 4851 విద్యుత్ ఫీడర్లున్నాయి. కానీ తెలంగాణాలో ఉన్న ఫీడర్లకు ప్రత్యేకంగా ఎన్‌పీడిసియల్ పరిధిలో ఉన్న ఫీడర్లకు ఏడు గంటల కరెంటు ఇచ్చిన దాఖలాలు ఎక్కడా లేవు. వరంగల్ గానీ, కరీంనగర్ గానీ, ఖమ్మం గానీ, నిజామాబాద్ గానీ, అదిలాబాద్ గానీ కేవలం 10, 15 ఫీడర్లలో తప్ప ఎక్కడా ఏడు గంటల కరెంటు ఇవ్వలేదు. సీమాంధ్రలో 4851 ఫీడర్లుంటే కేవలం 3 శాతం ఫీడర్లకు మాత్రమే ఏడు గంటల కరెంటు లేదు. మిగతా 97 శాతం ఫీడర్లకు ఏడు గంటల కరెంటు ఇస్తున్నారు. కాబట్టి ఈ విధంగా పక్షపాతం ఉంది. తెలంగాణా కావాలని ఎందుకు కోరుకుంటున్నామంటే తెలంగాణా రాష్ట్రం ఏర్పడేంత వరకూ రైతులకు గానీ, ప్రజలకు గానీ న్యాయం జరగదు కాబట్టే తెలంగాణా కావాలని కోరుకుంటున్నాం.

ఎంత అన్యాయమంటే తెలంగాణాలో మొత్తం 18 లక్షల కనెక్షన్లుంటే ట్రాన్స్‌ఫార్మర్లది చాలా పెద్ద గొడవ. ట్రాన్స్‌ఫార్మర్ల గొడవ లేకుండా ఉండాలంటే హై వోల్టేజ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (HVDS) ను అమలు చేయాలి. కానీ 12 లక్షలున్న సీమాంధ్రలో 34 శాతం ఫీడర్లను హెచ్‌విడిఎస్ స్కీము క్రింద తీసుకున్నారు. దాని కోసం రూ.1500 కోట్లు ఖర్చు పెట్టారు. అదే తెలంగాణా ప్రాంతంలో 18 లక్షల పంపుసెట్లు ఉంటే కేవలం 12.7 శాతం మాత్రమే హెచ్‌విడిఎస్ స్కీము క్రింద తీసుకున్నారు. దానికి రూ.500 కోట్లు ఖర్చు పెట్టారు.

మ.12.30

అధ్యక్షా, నేను ముఖ్యమంత్రి గారిని ఒక్కటే కోరుతున్నాను. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా, పంటలు ఎండి పోకుండా, మోటార్లు కాలిపోకుండా, ఓల్టేజీ సమస్యలు లేకుండా ఉండాలంటే హెచ్‌విడిఎస్ స్కీంని తెలంగాణా ప్రాంతంలో అమలు చేయాలి. తెలంగాణాలో రైతుల బ్రతుకంతా కరెంటు మోటార్లపైన అధారపడి వుంది. మాకు ప్రాజెక్టులు లేవు. ఉన్నటువంటి ప్రాజెక్టుల్లో శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు, పైన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు వల్ల, మిగతా 14 ప్రాజెక్టుల వల్ల ఎడారిగా మారిపోయింది. నిజాంసాగర్ ప్రాజెక్టు సింగూరు వల్ల ఎడారిగా మారిపోయింది. కాబట్టి, మా ప్రాంతంలో రైతులు బ్రతకాలంటే కరెంటు కావాలి. ఈ కరెంటు మీద ఆధారపడ్డ రైతులకు హెచ్‌విడిఎస్ స్కీం క్రింద అత్యధిక లైన్లను శాంక్షన్ చేసి, ఆ స్కీంని అమలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. ఈ రోజు లైన్ల విషయం తీసుకుంటే.... తెలంగాణా ప్రాంతంలో వంద చదరపు కిలోమీటర్ల వైశాల్యానికి 33 కెవి లైన్లు 7.33 కి.మీ, అదే రాయలసీమలో 13.07 కి.మీ.లు, ఆంధ్రలో 13.4 కి.మీ. వున్నాయి. 11 కె.వి. విద్యుత్ లైన్లు తెలంగాణాలో వంద కిలోమీటర్లకి 48.33 కి.మీ., రాయలసీమలో 97.04 కి.మీ., ఆంధ్రాలో 89.49 కి.మీ. అదే ఎల్‌కె లైన్లు తెలంగాణాలో 110.9, రాయలసీమలో 145, ఆంధ్రాలో 166. అంటే ప్రతి చోటా ఈ పక్షపాతం వుంటోంది, న్యాయమనేది మా తెలంగాణాకు లేదు. విద్యుత్ సరఫరాలో గాని, లైన్లలో గాని, ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో గాని, సబ్ స్టేషన్స్ విషయంలో గాని వివక్షత చూపిస్తున్నారు. అన్యాయం జరుగుతోందని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

అదే విధంగా విద్యుత్ ప్రొడక్షన్ విషయానికి వస్తే, ఇంతకుముందు కేశవ్ గారు చెప్పారు. గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు ఆంధ్రా వాళ్లకి చాలా వున్నాయి. గౌతమి, జివికె, స్పెక్ట్రమ్, వేమునూరి గాని చాలా వున్నాయి. అదే మరి తెలంగాణాలో ఈ సమస్య తీరాలంటే కరీంనగర్‌లోని నేదునూరు దగ్గర ఇతర అన్ని అనుమతులు పొంది, కేవలం గ్యాస్ అలాట్‌మెంట్ గాక 2100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్ర ఇప్పటికీ ప్రారంభం కాలేదు. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా శంకరంపల్లి దగ్గర 1400 మెగావాట్ల ప్రాజెక్టు వుంది. అవి తప్ప, మిగతా గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులన్నీ ఆంధ్రాలోనే వున్నాయి. ఇక బొగ్గుతో విద్యుత్‌ని తయారు చేసే పరిశ్రమల విషయానికి వస్తే, వాళ్లు రిపోర్టులో ఇచ్చారు – పరిపాలనామోదం తెలిపామని చెప్పారు. పరిపాలనామోదం ఇప్పటిది కాదు. కొత్తగూడెం గాని, రామగుండం గాని, భూపాలపల్లిగాని, సత్తుపల్లి గాని చూస్తే, ప్రపంచంలో చత్తీస్‌ఘడ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో మాత్రమే బొగ్గు అందుబాటులో వుంది. ఆ బొగ్గు ద్వారా బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను తయారు చేసినట్లయితే ఈ విద్యుత్ కొరత వుండేది కాదు. ఈ కొరత వుండేందుకు కారణం ప్రభుత్వానికి దూరదృష్టి లేకపోవడమేనని నా అభిప్రాయం. కాబట్టి, ఈ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను వెంటనే

ప్రారంభించి, ఉత్పత్తిని పెంచి తెలంగాణా ప్రాంత రైతాంగానికి న్యాయం చేయాల్సిందిగా మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

మీరు ఒక పర్యాయం గుర్తుకు తెచ్చుకుంటే ఈ రోజు పేపర్లో కూడా ఇచ్చారు. విద్యుత్ సమస్య వల్ల తెలంగాణా ప్రాంతంలో పరిశ్రమలు నడవడం గానీ, పిల్లలు రాత్రిపూట చదువుకునే పరిస్థితి గానీ లేదు. వారు చదువుకోవడానికి కరెంటు కావాలి. ఉదయం తెల్లవారు జామున 5 గంటలకే కరెంటు తీసేస్తున్నారు. దాని మూలంగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చదువుకోలేకపోతున్నారు. కాబట్టి, విద్యుత్ సమస్య పరిష్కారంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలి. తెలంగాణా ప్రాంతంలో వున్న రైతాంగానికి న్యాయం చేకూర్చే విధంగా ఈ ప్రభుత్వం వ్యవహరించడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం లభించడమంటే తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయడమే ప్రధాన పరిష్కారం. అందుకే మేం తెలంగాణా కావాలని కోరుకుంటున్నాము. ఈ రోజు ఎవరేమి అనుకున్నా, తెలంగాణా ప్రాంత రైతాంగం బ్రతకాలనుకున్నా, వ్యాపారులు బ్రతకాలనుకున్నా, పరిశ్రమలు బ్రతకాలనుకున్నా, విద్యార్థులు చదువు కావాలని కోరుకున్నా తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు చేయడమే ఏకైక మార్గమని మీ ద్వారా ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను. అదే విధంగా

(బెల్)

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ప్లీజ్ కంక్లూడ్.....

శ్రీ టి. హరీష్ రావు: పది నిమిషాలు కూడా కాలేదు సార్....

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: పది నిమిషాలు కాదండీ. ఇప్పటికే ఇరవై నిమిషాలయ్యింది. ప్లీజ్ కంక్లూడ్ శ్రీనివాస రెడ్డి గారూ...

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి: అధ్యక్షా....

(తెలంగాణ రాష్ట్రసమితి సభ్యులు శ్రీ టి. హరీష్ రావుచే అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Please continue Sreenivasa Reddy garu... Please conclude.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి: అధ్యక్షా, ఇవన్నీ పోను గ్రామీణ ప్రాంతాల్లో అనేక సందర్భాల్లో అధికారుల దృష్టికి తీసుకు వెళుతుంటాము. విద్యుత్ లైన్లు వేలాడుతున్నాయి, స్తంభాలు ఒరిగిపోతున్నాయి. దాని వల్ల ఎవరైనా చేతులు పెడితే, కరెంటు షాకుతో చనిపోయిన దాఖలాలు చాలానే వున్నాయి. దీని విషయంలో ట్రాన్స్‌కో అధికారులు గాని, విద్యుత్ అధికారులు గాని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. మా నియోజకవర్గంలో శంకోరా అనే గ్రామంలో ఏ.ఇ. గారిని ఆరు రోజుల క్రిందట తీసుకువెళ్లి విద్యుత్ స్తంభం పడిపోతుంది, స్కూల్ దగ్గరుంది, దానివల్ల పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతుందని చూపిస్తే, ఇప్పటికీ ఆ స్తంభాన్ని రెక్టిఫై చేయలేదు, ఆ లైను లాగలేదు. ఈ విధంగా విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల స్తంభాలు ఒరిగిపోయినా, వైర్లు వేలాడబడ్డా సరిగ్గా చేయలేకపోవడం వల్ల ఈ మరణాలు జరుగుతున్నాయి.

ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాను చూస్తే, 2005 నుండి 2011 వరకు 1760 మంది విద్యుత్ షాక్‌తో చనిపోయారు. ఈ విధంగా చనిపోయిన వారికి చెల్లించే నష్టపరిహారం కేవలం వంద మందికి వచ్చింది. నేను తెలంగాణా ప్రాంతంలో ప్రతి జిల్లాలో చూశాను. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్ల వైర్లు చేతికి తగలడం వల్ల, పచ్చగడ్డి ఎత్తుకుపోతుంటే వైర్లు తాకడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. కాబట్టి, ఏ విధంగానైతే ఇతర ప్రకృతి వైపరీత్యాల వల్ల మరణిస్తే నష్టపరిహారమిస్తున్నారో, అదే విధంగా విద్యుత్ షాక్‌తో చనిపోయిన వారికి కూడా ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయలకు తక్కువ కాకుండా నష్టపరిహారమివ్వాలని డిమాండ్ చేస్తున్నాము.

అంతేగాకుండా ఈ రోజు విద్యుత్ సమస్య గురించి మాత్రమే కాకుండా, తెలంగాణా ప్రాంతంలో రైతులకు విద్యుత్ సరఫరా విధానాన్ని గురించి అధికారులను అడిగితే – మాకు పై నుండి ఆదేశాలున్నాయి కాబట్టి, మేం కరెంటు కట్ చేస్తున్నాం అంటున్నారు. కానీ, ఈ కరెంటు కట్ చేయడానికి వేళాపాళా లేదు. మొదట 7 గంటల కరెంటు అన్నారు. 5 గంటలకు కుదించారు గానీ, కనీసం 2 గంటలు కూడా రావడం లేదు. కాబట్టి, మీ ద్వారా నేను కోరేదేమంటే ప్రస్తుతం మొక్కజొన్న గాని, వరి పంటలు గాని చివరి దశలో వున్నాయి. అధిక శాతం రైతులు తెలంగాణాలో మొక్క జొన్న పంట వేశారు. రాత్రి పూట కరెంటు ఇస్తున్నారు. నాలుగు ఫీడర్లలో రాత్రి 10 నుండి 3 గంటల వరకు, 3 నుండి ఉదయం 8 గంటల వరకు ఇస్తున్నారు. ఈ మొక్కజొన్న పండాలంటే కాలువ నీళ్లు పారాలి. ఆరుతడి పంటలు వేసుకోమనిప్రభుత్వమే చెప్పింది. ఆరుతడి పంటలు వేసుకున్నా ప్రతి కాలువకూ నీళ్లు పారవు. కాలువకు నీళ్లు పారించి పంటలు పండించుకోవడానికి వెళ్లిన రైతులు పాములు, తేళ్లు బారినపడి, కరెంటు షాకుతో ప్రాణాలు పోగొట్టుకున్నారు. కాబట్టి, దయచేసి మీ ద్వారా నేను కోరేదేమంటే ఈ పంట పండి చేతికి వచ్చేంతవరకు మిగతా అవసరాలు ఎట్లా వున్నా, రైతుల అవసరాలు తీర్చడానికి గాని, పంటలు పండించడానికి గాని పగటి పూట కనీసం 7 గంటలకు తక్కువ కాకుండా విద్యుత్‌ని సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

అదేవిధంగా ఇకపోతే ఇంత వివక్ష... ఆంధ్రాలో 14,70,000 మందికి ఇందిరమ్మ హౌసింగ్ ప్రోగ్రాం క్రింద కరెంటు మీటర్లు ఇస్తే, తెలంగాణా ప్రాంతంలో కేవలం 4,00,059 మందికి ఇచ్చారు. అంటే అడుగడుగునా కూడా వివక్ష కనపడుతోంది. ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో గాని, విద్యుత్ సరఫరాలో గాని, కొత్త లైన్లు వేయడంలో గాని, రైతులకు 7 గంటల కరెంటు ఇవ్వడంలో గాని అడుగడుగునా తెలంగాణాకు అన్యాయం జరుగుతోంది. ఈ వివక్ష పోవాలి.

మ.12.40

ఈ వివక్ష పోవడానికి మేము ఎన్నిసార్లు అడిగినా, ట్రాన్స్‌కో అధికారులు గానీ ముఖ్యమంత్రి గారు గానీ వింటున్నారు గానీ సమస్య పరిష్కారం కావడం లేదు. ఈరోజు తెలుగుదేశం పార్టీ నాయకులు చాలా ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలు చేసిన నాయకులు, ఇంత అసమర్థత, అవినీతి, అక్రమాలతో కూడిన ఈ ప్రభుత్వం ఉండరాదనుకున్నప్పుడు, మేము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పుడు దానిలో ఎందుకు పాల్గొనలేదో సమాధానం చెప్పాలి. తటస్థంగా ఉండిపోయారు. ఈ రోజు పాలక పక్షం – ప్రతి పక్షం రెండూ కుమ్మక్కై అయ్యాయి. మ్యాచ్ ఫిక్సింగ్ నడుస్తోంది.

(అంతరాయం)

ఎందుకంటే, అవిశ్వాస తీర్మానం అన్నప్పుడు ఎవరు ప్రవేశ పెట్టినా.. గతంలో తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టినప్పుడు మేము కూడా పాల్గొన్నాము. మేము పార్టీని చూడలేదు. వారు ప్రవేశపెడితే మేము పాల్గొన్నాము.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఒక నిమిషం శ్రీనివాసరెడ్డి గారు.

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి :అధ్యక్షా, గౌరవ సభ్యులు శ్రీనివాసరెడ్డి గారు విద్యుత్ సమస్య మీద మాట్లాడితే బాగుంటుంది. విద్యుత్ సమస్య మీద ప్రభుత్వం సమాధానం చెబుతుంది. కానీ మొన్న జరిగిన అవిశ్వాస తీర్మానంలో గౌరవ సభ్యులందరూ మాట్లాడారు. మేము, వాళ్లు ఏదో కుమ్మక్కు అయ్యామనే మాట మాట్లాడటం అది సమంజసంగా లేదు. ప్రభుత్వం ఎవరితో కుమ్మక్కు కావాల్సిన అవసరం లేదు. ఈరోజు కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ శాసన సభ్యులు ఉన్నారు. మా శాసన సభ్యుల బలంతో మేము అధికారంలో ఉన్నాము. వారి దయదాక్షిణ్యాలతో, వీరి దయాదాక్షిణ్యాలతో ఈ ప్రభుత్వం లేదు. ఏమైనా కుమ్మక్కైతే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, టిఆర్ఎస్ పార్టీతో కుమ్మక్కై ఉంటుంది. కాంగ్రెస్ పార్టీకి ఎవరితోనో కుమ్మక్కు కావాల్సిన అవసరం ఏమి ఉంది? మాకు పాలించే అధికారాన్ని రాజ్యాంగ బద్ధంగా ప్రజలు ఇచ్చారు. రాజ్యాంగ బద్ధంగా వచ్చిన అధికారాన్ని ఊడగొట్టడానికి కుయుక్తులు పన్నుతున్నది వాళ్లు అధ్యక్షా .

(అంతరాయం)

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి : అధ్యక్షా, ఇక్కడ మేము అంటున్నది కాదు, ప్రజలు అనుకొంటున్న మాట. అదే విధంగా ఈ రోజు గ్రామీణ ప్రాంతాల్లో మరమగ్గాలు నడవాలన్నా, చిన్న చిన్న పరిశ్రమలు నడవాలన్నా నిరాటంకంగా ఇరవైనాలుగు గంటల కరెంటు అవసరం. ఎందుకంటే పొట్టచేత పట్టుకొని బ్రతికేటువంటి వ్యక్తులు, రెక్కాడితేగాని డొక్కాడని వ్యక్తులకు, పవర్ లూమ్స్ గానీ, హ్యాండ్ లూమ్స్ గానీ, చిన్న చిన్న పరిశ్రమలు గానీ, కుటీర పరిశ్రమలు గానీ, వడ్రంగి గానీ, కమ్మరి గానీ ఇవన్నీ నడవాలంటే విద్యుత్ సరఫరా చాలా ముఖ్యం. ఆ విధంగా విద్యుత్ని సరఫరా చేయడంలో ఈ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందింది. ఇప్పటికైనా దీనిని సవరించి ఏ అవసరానికి ఎంత అవసరమో, కరెంట్ తక్కువ అనుకుంటే ఉత్పత్తి చేయడానికి సమయం పడుతుంది కాబట్టి, బయటి రాష్ట్రాల నుండి, ఎక్కడ అందుబాటులో ఉంటే అక్కడి నుండి విద్యుత్ను కొనుగోలు చేసి నాణ్యమైన విద్యుత్ను వినియోగదారులకు అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

(అంతరాయం)

క్రొత్తగా నేను మాట్లాడటం లేదు. ఉన్న వాస్తవాన్నే చెబుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : శ్రీనివాసరెడ్డి గారు కంక్లూడ్ చేయండి.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి : ఎందుకంటే తెలుగుదేశం పార్టీ తరఫున ఇప్పుడు విద్యుత్ మీద మాట్లాడుతున్నప్పుడు, ప్రభుత్వం మీద చాలా ఆరోపణలు చేశారు. నేను అదే అడుగుతున్నాను, ఎప్పుడైతే మీకు ప్రభుత్వం మీద కోపం ఉందో, పరిపాలన సక్రమంగా లేదు, ప్రభుత్వం అవినీతి అక్రమాలకు పాల్పడుతుందో లేక కాగ్ రిపోర్ట్ను వ్యతిరేకించిందో వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొని,

ప్రభుత్వానికి పరిపాలించే నైతిక హక్కు లేదనుకున్నప్పుడు, మేము అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పుడు మీరు ఎందుకు సహకరించలేదు? తటస్థంగా ఎందుకు ఉండిపోయారు. అటు లేదు ఇటు లేదు. అటు కాకుండా ఇటు కాకుండా మిగిలిపోయారు.

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

వ్యక్తిగతంగా నేను అంటున్నది కాదు, ప్రజలంటున్న మాటను నేను చెబుతున్నాను.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు (పాలకుర్తి)ః శ్రీనివాసరెడ్డి గారూ.. అవిశ్వాసం పెడితే దిగుతదా దిగదా అనేది మీకు తెలిసింది మాకు తెలిసింది. కానీ ప్రతి సందర్భంలో ఇన్-డైరెక్ట్ గానో, డైరెక్ట్‌గానో కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేసింది మీరు కాదా? ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్యేలను అమ్ముకున్నది మీరు కాదా? ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అమ్ముకుంటున్నది మీరు కాదా? పార్టీ ఎన్నికల్లో ఇన్-డైరెక్ట్ గానో డైరెక్ట్‌గానో కాంగ్రెస్ పార్టీకి సపోర్ట్ చేసి బలోపేతం చేసుకొంటూ ప్రతి విషయంలో మీరు దేనికి అమ్ముకున్నట్లు? ఇంత జరుగుతుంటే మొన్న కోఆపరేటివ్ ఎన్నికల్లో నిజామాబాద్ డిసిసిబి ఎన్నికల్లో ..

(టిఆర్ఎస్ పార్టీ సభ్యులు వారి స్థానాల్లో నిలబడి టిడిపి సభ్యులతో వాదించసాగారు)

మిస్టర్ డెపూటీ స్పీకర్ : కూర్చోండి హరీష్‌రావు గారు, కూర్చోండి శ్రీనివాసరెడ్డి గారు. Dayakar rao garu.. please conclude. You don't get into controversy. You are a Senior Member. You have to co-operate to run the House in a proper and peaceful manner.

శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు : అధ్యక్షా, ఎలక్ట్రిసిటి అంశాన్ని ప్రక్కతోవ పట్టించాలని తెలుగుదేశం పార్టీ మీద ఆరోపణలు చేస్తున్నారే.. నేను చెబుతున్నాను.. చర్చ పెట్టుకుందామా? టిఆర్ఎస్ పార్టీ – తెలుగుదేశం పార్టీ మధ్య చర్చ పెట్టుకుందామా? దమ్ముంటే రా.. మీ అమ్మ ఎన్నిసార్లు అమ్ముడు పోయిందో మేము ప్రూవ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాము. కాంగ్రెస్ పార్టీకి అమ్ముడు పోయిన విషయాన్ని ప్రూవ్ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మేము అమ్ముడు పోలేదు.

(అంతరాయం)

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి : అధ్యక్షా, కోఆపరేటివ్ ఎలక్షన్స్‌లో గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ – కాంగ్రెస్ పార్టీ ఏకమై పోరాటం చేశారు. కలిసి పోటీ చేశారు. ఆ విషయం అందరికీ తెలుసు. ప్రతి గ్రామంలో సొసైటీ ప్రెసిడెంట్‌గా వాళ్లు కొంత మంది డైరెక్టర్లకు, వీళ్లు కొంత మంది డైరెక్టర్లకు ఒప్పందాలను కుదుర్చుకొని పోటీ చేశారు. మేము ఆ విధంగా పోటీ చేయలేదు.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : శ్రీనివాసరెడ్డి గారూ.. ప్లీజ్ కంక్లూడ్. మిగతా సభ్యులు కూడా మాట్లాడాలి. దయచేసి కంక్లూడ్ చేయండి.

శ్రీ పోచారం శ్రీనివాసరెడ్డి : అధ్యక్షా, ఈరోజు ఎవరు ఎవరితో కుమ్మక్కయ్యారనేది ప్రజలకు బాగా తెలుసు. నేను దాని జోలికిపోదల్చుకోలేదు. అది వాళ్లకే వదిలిపెడుతున్నాను. అయితే చివరిగా నేను ముఖ్యమంత్రి గారిని, ప్రభుత్వాన్ని కోరేదేమంటే, సీమాంధ్ర తెలంగాణా ప్రాంతాల్లో సరఫరా

అవుతున్న విద్యుత్ ఏదైతే ఉందో, అక్కడ ఒక విధంగా ఇక్కడ ఒక విధంగా సరఫరా చేస్తున్నారు. నాలుగు డిస్కంలు ఉంటే తెలంగాణా డిస్కంల తీరు ఒక విధంగా, సీమాంధ్ర డిస్కంల తీరు మరో విధంగా ఉంది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఒకటే కంపెనీ క్రింద ఏడు గంటల పాటు అక్కడ విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు, అదే కంపెనీ క్రింద ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాకు నల్గొండ జిల్లాకు సక్రమంగా సరఫరా చేయడం లేదు. కాబట్టి, ప్రతి ఒక్కచోట తెలంగాణా జిల్లాల్లో రైతులకు అన్యాయం జరుగుతోంది. కాబట్టి నేను ముఖ్యమంత్రి గారిని కోరేదేమంటే, విద్యుత్ సరఫరాలో అవసరాన్ని బట్టి, వినియోగాన్ని బట్టి, ఎక్కడ ఏ జిల్లాకు ఎంత అవసరం ఉంది? ఏ డిస్కాంకు ఎంత అవసరం ఉంది? ప్రత్యేకంగా వరంగల్ కేంద్రంగా ఉన్న ఎన్‌పిడిసిఎల్‌కు ఎక్కువ అవసరం ఉంది. ఆ యొక్క అవసరాన్ని బట్టి, విద్యుత్ సరఫరా చేయాల్సిందిగా తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. మొత్తం 1900 మెగావాట్లు కావాలి. 1200 మెగావాట్లను సరఫరా చేస్తున్నారు. రైల్వే మరియు సింగరేణి కూడా దీని మీద ఆధారపడిన నేపథ్యంలో 1900 మెగావాట్ల విద్యుత్‌ను ఎన్‌పిడిసిఎల్‌కి సరఫరా చేసినట్లయితే మాకు న్యాయం జరుగుతుందని తమరి ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలను తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

మ.12.50

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డిః అధ్యక్షా, విద్యుత్ సమస్యలపైన చర్చించడానికి మా వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున అవకాశం ఇచ్చినందుకు ముందుగా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. రాష్ట్రంలో గ్యాసు, బొగ్గు, నీళ్లు లేవు కాబట్టి మేం కరెంట్ ఇవ్వలేమని ప్రభుత్వం చెబుతున్నది. ఆ మూడు వనరులు లేవు కాబట్టి కోట్లాది మందిని వీధుల్లో వేస్తామని చెప్పడం సరైంది కాదు. ప్రజలను ఏ విధంగా ఆదుకోవాలి, ముందుచూపుతో తీసుకోవలసిన జాగ్రతలు తీసుకోనందుకే రాష్ట్రంలో ఈ పరిస్థితులు దాపురించాయి. ఇటువంటి పరిస్థితులు వస్తాయని మా పార్టీ సభ్యులం ముందు నుంచే హెచ్చరిస్తున్నాం, చివరికి అదే జరిగింది. గ్రామాలలో దాదాపుగా పన్నెండు గంటలు విద్యుత్ సరఫరా ఉండటం లేదు. నగరాలలో కూడా నాలుగైదు గంటలు విద్యుత్ కోతలు విధిస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కూలిపోయే పరిస్థితికి ఈ ప్రభుత్వం తీసుకొచ్చింది. అదే విధంగా ఇండస్ట్రీలు అయితేనేమి, ఆసుపత్రులు అయితేనేమి, గృహ వినియోగదారులకైతేనేమి వారికి పూర్తి స్థాయిలో విద్యుత్‌ను అందించలేని పరిస్థితికి ఈ ప్రభుత్వం వచ్చింది. ఈ రాష్ట్రంలో జి.డి.పి పెరగాలన్నా, ప్రభుత్వ ఆదాయం పెరగాలన్నా, అభివృద్ధి చూపించాలన్నా మూడు ముఖ్యమైన అంశాలలో సరైన ప్రగతి, అభివృద్ధి చూపించాలి. వ్యవసాయానికి సంబంధించినంతవరకు ఈ ప్రభుత్వమిచ్చిన సోషియో ఎకనామిక్ రిపోర్ట్‌లోనే మైనస్ 6.5 ఉన్నది. గత సంవత్సరం కూడా మైనస్‌లోనే రికార్డ్ అయింది. కాంగ్రెస్ ప్రభుత్వం సగటున 5% అభివృద్ధికి చేరుకుంటుందని చెబుతుంది కాబట్టి అది ఎలా సాధ్యమవుతుందనేది చెప్పాల్సిన అవసరమున్నది. అదే విధంగా ఇండస్ట్రీలకు సంబంధించి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మైనస్ 4.5%లో ఉన్నది. ఇంత దారుణమైన పరిస్థితులలో ఈ రాష్ట్రం ఉండి ప్రజలు అలమటిస్తుంటే వారి గురించి ఆలోచన చేసే నాయకత్వమే లేకుండా పోయింది.

అన్ని రాష్ట్రాలు ముందు జాగ్రత్తగా అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేస్తే ఈ రాష్టానికి చెందిన నాయకులు అటువంటి ఆలోచన చెయ్యకుండా ఇటువంటి పరిస్థితులు కల్పించారు. చాలా మంది పెద్దలు వ్యవసాయ రంగంలో మేం అవి చేశాం, ఇవి చేశామని చెబుతున్నారు. ఈ రాష్ట్రంలో స్వర్ణ యుగం అంటే అది 2004 నుంచి 2009 వరకు రాజశేఖర్ రెడ్డి గారి పాలనలో జరిగిందనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ అంగీకరించాల్సిందే.

(కాంగ్రెస్ సభ్యుల నుంచి అంతరాయం)

మీరు అరవకండి. ఆ వాస్తవాలు మాకూ తెలుసు, మీకూ తెలుసు కానీ ఆ నిజాన్ని జీర్ణించుకోలేక ఏదో మాట్లాడుతున్నారు. ఈ ప్రభుత్వం ఆహార ఉత్పత్తుల విషయంలో సరైన నిర్ణయం తీసుకోనందుకు, సరైన విద్యుత్ సరఫరా చేయనందుకు దాదాపు 75 లక్షల ఎకరాల భూమిలో పంప్‌సెట్లపైన ఆధారపడిన రైతుల జీవితాలు నాశనమవడమే కాకుండా సుమారు రూ.10,000 కోట్ల నష్టం రైతులకు వాటిల్లింది. ఈ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. ఈ ప్రభుత్వానికి ముందుచూపు లేని కారణంగానే ఇటువంటి పరిస్థితులు ఏర్పడ్డాయి.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావుః అధ్యక్షా, కొత్తగా ఆవిర్భవించినటువంటి వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ నుంచి కొత్తగా ఎన్నికైన ఒక ప్రాంతీయ పార్టీ సభ్యుడు మాట్లాడుతూ 2004 నుంచి 2009 వరకు మా ప్రభుత్వం, మా ప్రభుత్వం అంటున్నారు. 2004 నుంచి 2009 వరకు శ్రీమతి సోనియా గాంధీ గారి నేతృత్వంలో అప్పుడు సి.ఎల్.పి లీడర్‌గా రాజశేఖర్ రెడ్డి గారు ఉన్నారు, అలాగే పి.సి.సి అధ్యక్షులు డి. శ్రీనివాస్ గారు ఉన్నారు. 2004లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది, రాజశేఖర్ రెడ్డి గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. కానీ సభ్యుడు మాట్లాడేటప్పుడు 2004 నుంచి 2009 వరకు మా ప్రభుత్వం, మా నాయకుడు అని చెబుతున్న మీరు నిజంగా ఆరోజు కాంగ్రెస్ వాదులేనా? 2004 నుంచి 2009 వరకు పాలించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఈరోజు కిరణ్ కుమార్ రెడ్డి గారు కాని ఆరోజు రాజశేఖర్ రెడ్డి గారు కాని .............

(వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః శోభా నాగిరెడ్డి గారూ, శ్రీకాంత్ రెడ్డి గారూ ఒక్క నిమిషం కూర్చోండి.

శ్రీమతి బి.శోభా నాగిరెడ్డి (ఆళ్లగడ్డ)ః అధ్యక్షా, చీఫ్ విప్ గారు చాలా తొందరగా స్పందించినందుకు చాలా సంతోషం. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి గారు మా నాయకుడని చెబుతున్నారు. 2009 ఎన్నికల మేనిఫెస్టోలో రైతాంగానికి తొమ్మిది గంటల కరెంట్‌నిస్తామని చెప్పారు. అంతే కాకుండా అయిదు సంవత్సరాలు విద్యుత్ చార్జీలను పెంచము అని చెప్పారు. ఆ హామీలను ఈ ప్రభుత్వం ఎందుకు నిలబెట్టుకోలేదో చెప్పమని మీ ద్వారా అడుగుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః గండ్ర వెంకట రమణా రెడ్డి గారూ.

శ్రీ గండ్ర వెంకట రమణా రెడ్డిః అధ్యక్షా, వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీలో ఉన్న శోభా నాగిరెడ్డి గారికి ఒక విషయం చెప్పదలచుకున్నాను. 2004, 2009 ఎన్నికల తరవాత ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేనొక శాసనసభ్యుడిగా ప్రభుత్వం తరఫున ప్రశ్న వేయడం జరిగింది. ఈ ప్రభుత్వం 2009 ఎన్నికలలో గెలిచిన తర్వాత రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తామన్నది, దీనివల్ల ఎంత మందికి లబ్ధి చేకూరుతుందనే ప్రశ్న వేయడం జరిగింది. ఆరోజు రాజశేఖర్ రెడ్డి గారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. నేను ప్రశ్న వేసినప్పుడు వారు నన్ను పిలిపించి రైతులకు తొమ్మిది గంటల విద్యుత్ ఇవ్వడం ఇప్పట్లో సాధ్యం కాదు కాబట్టి నా ప్రశ్నను విత్‌డ్రా చేసుకోమని వారు చెప్పారు. అంటే రాజశేఖర్ రెడ్డి గారు బ్రతికున్నప్పుడు కూడా తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా సాధ్యం కాదనే

ఉద్దేశంతో వాయిదా వేసుకోమని చెప్పిన మాట వాస్తవం. సత్యదూరమైన మాట నేను ఒక్కటి కూడా చెప్పడం లేదు. నేనొక కాంగ్రెస్ పార్టీకి చెందిన శాసన సభ్యుడిగా చెబుతున్నాను. రాజశేఖర్ రెడ్డి గారు చేసిన వాగ్దానాన్ని ఇప్పటి ప్రభుత్వం డీవియేట్ చేసున్నదని చెప్పాల్సిన అవసరం లేదు. ఆరోజు నుంచి ఈరోజు వరకు కూడా రాష్ట్ర రైతాంగం పట్ల, రాష్ట్ర ప్రజల పట్ల చిత్తశుద్ధి, అంకిత భావంతో పనిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేస్తున్నాను.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డిః అధ్యక్షా, సబ్జెక్ట్ డీవియేట్ కావడం లేదు. నేను సూటిగా ఈ ప్రభుత్వాన్ని అడుగుతున్నదేమిటంటే రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, ఆహార ఉత్పత్తులు 2004 నుంచి 2009 వరకు.................

(తెలుగుదేశం పార్టీ సభ్యుల నుంచి అంతరాయం)

అధ్యక్షా, నేనిప్పటివరకు తెలుగుదేశం పార్టీ గురించి మాట్లాడలేదు. ఎందుకంటే మేం కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడినా తెలుగుదేశం పార్టీ సభ్యులకు కోపం వస్తుంది. ఆ విషయం ఎందుకన్నది మీకు కూడా తెలుసు.

మ.1.00

అధ్యక్షా, నేను ఇంత వరకు ప్రతిపక్షపార్టీ అయిన తెలుగుదేశం పార్టీ నిర్వాకం గురించి మాట్లాడలేదు. కానీ, ఆ టైమ్ వస్తుంది. కేవలం నేను పాలకవర్గం గురించే మాట్లాడుతున్నాను. ప్రభుత్వం పైన నేను మాట్లాడుతుంటే వీళ్లెందుకు ఉలుకు.

(తెలుగు దేశం పార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

కేవలం నేను (ట్రెజరీ బెంచ్ వైపు సభ్యులను చూపిస్తూ) వాళ్ల గురించి మాత్రమే మాట్లాడుతున్నాను. కానీ, వాళ్లను గురించి మాట్లాడుతుంటే కూడా వీళ్లకు (తెలుగుదేశం పార్టీ వైపు సభ్యులను చూపిస్తూ) కోపం వస్తోంది. అందుకు కారణం ఏమిటో మీకు కూడా తెలుసు. కానీ నేను ఇప్పుడు చెబుతున్నాను. 2004-09 వ సంవత్సరంలో .......

(తెలుగుదేశం పార్టీ సభ్యులచే సభకు అంతరాయం)

(ట్రెజరీ బెంచ్ వైపు సభ్యులచే సభకు అంతరాయం)

నేను చెప్పే వాస్తవాన్ని వినడానికి మీకు ధైర్యం లేదా? కూర్చోండి మీరు, వినండి. ఈ విధంగా ప్రసంగానికి ఆటంకం కల్గించడం కరెక్టు కాదు.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: అధ్యక్షా ..........

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: ద్రోణంరాజు గారు దయచేసి కూర్చోండి.

శ్రీ మండవ వెంకటేశ్వరరావు (నిజామాబాద్(రూరల్): అధ్యక్షా ...........

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: దయచేసి మీరు కూర్చోండి వెంకటేశ్వరరావు గారు. మీరు మాట్లాడినారు. మిగతా సభ్యులకు కూడా మాట్లాడే అవకాశం ఇవ్వండి. మీరు మాట్లాడండి శ్రీకాంత్ రెడ్డి గారు.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, ఒక శాసనసభ్యుడిగా, ప్రజల తరఫున బాధపడుతూ, నా ఆవేదనను సభ ముందు వ్యక్తపరుస్తున్నాను. ఇదేదో స్వార్థం గురించి మాత్రం కాదు. రాష్ట్రంలో దాదాపుగా ఆహార ఉత్పత్తులు ఏ రకంగా పడిపోయినాయి, స్వర్గీయ రాజశేఖర్ రెడ్డి గారి హయాంలో రాష్ట్రంలో ఆహార ఉత్పత్తులు ఏ విధంగా ఉన్నాయి.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: అంతకు ముందు సంగతి కూడా చెప్పు?

(అంతరాయం)

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి: అంతకు ముందు సంగతి కూడా నేను చెబుతాను. ఈ విధంగా ప్రసంగానికి ఆటంకం కల్గించడం సబబు కాదు. దయచేసి సభను ఆర్డర్‌లో పెట్టండి.

శ్రీ మండవ వెంకటేశ్వరరావు: అధ్యక్షా .........

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: వెంకటేశ్వరరావు గారు దయచేసి మీరు కూర్చోండి. శ్రీకాంత్ రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, చర్చలో పాల్గొనే ధైర్యం వీళ్లకు, వాళ్లకు లేదా? వాళ్లు మాట్లాడినప్పుడు మేం వినలేదా? మా మాటాల్ని వినే ధైర్యం లేదా? వాళ్లు మాట్లాడుతున్నంతసేపు మేం కామ్‌గా ఉన్నాం.

(అంతరాయం)

శ్రీ మండవ వెంకటేశ్వరరావు: అధ్యక్షా .......

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: వెంకటేశ్వరరావు గారు కూర్చోండి?

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, నా బాధేమిటంటే, ఒక సామాన్య పౌరుడిగా ఇన్ని రకాల ఉదహరిస్తున్నాను. ఆహార ఉత్పత్తుల విషయంలో ఇండస్ట్రియల్ ఆదాయంతో ఆధారపడే ఈ రాష్ట్ర భవిష్యత్తును వీళ్లు ఎక్కడికి తీసుకుపోతున్నారనేదే నా బాధ. కంటిన్యూగా రెండు సంవత్సరాలు మైనస్‌లో ఉన్నటువంటి రాష్ట్ర గ్రోత్ తర్వాత పేద ప్రజలకు ...........

(తెలుగుదేశం, ట్రెజరీ బెంచ్ వైపు సభ్యులచే సభకు అంతరాయం)

అధ్యక్షా, ఈ విధంగా ప్రసంగానికి అడ్డం తగిలితే ఎట్లా?

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారు మీరు ప్రసంగించండి.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, దాదాపుగా ఈ కాలంలో, ఈ ప్రభుత్వ వైఫల్యం వలన, విద్యుత్‌ను సకాలంలో రైతులకు సరఫరా చేయకుండా తద్వారా పంటనష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని నేను ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.

అధ్యక్షా, స్వయాన ప్రధానమంత్రి గారు మాట్లాడుతూ, పోయిన సంవత్సరమే దేశం 80 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఇంపోర్ట్ చేసుకోగల్గినాం, రేపటి సంవత్సరానికి 1,25,000 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసుకోవాలనే మాటను స్వయాన దేశ ప్రధానమంత్రి గారే చెప్పారు. ప్రజల అవసరాలకు సరిపడే విధంగా, పరిశ్రమల అవసరాలకు సరిపడే విధంగా విద్యుత్ కంపెనీలు ఈ దేశంలో ఉత్పత్తి సామర్ధ్యాన్ని పెంచుకోవడం లేదు.

(అంతరాయం)

శ్రీ రావుల చంద్రశేఖర్ రెడ్డి: అధ్యక్షా, పాయింట్ ఆఫ్ ఆర్డర్ .............

MR.DEPUTY SPEAKER: You have any Point of Order Chandrasekhar Reddy garu? Please Chandrasekhar Reddy garu.......

SRI RAVULA CHANDRASEKHAR REDDY: Speaker Sir, Under Rule 342, I am raising a point.

అధ్యక్షా, రూల్ 342 క్రింద నేను పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడుగుతున్నాను. ఇవాళ సభ ముందున్న అంశం ఏమిటంటే, విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు రాష్ట్రంలో నెలకొని ఉన్నాయి. శ్రీకాంత్ రెడ్డి గారు ఒక విషయం గమనించాలి. విద్యుత్‌కు సంబంధించి అప్పుడు ఉన్న పరిస్థితి ఏమిటి, ఇప్పుడు ఉన్నటువంటి పరిస్థితి ఏమిటి? ఆ విషయాలపై అవగాహనతో మాట్లాడాలి.

నేను అడుగుతున్నదేమిటంటే, (ఎన్నికల మ్యానిఫెస్టో చూపిస్తూ) 2009 వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యుత్‌కు సంబంధించి చాలా స్పష్టంగా ఇచ్చింది. అధికార పార్టీ వాళ్లు మరియు ఆనాడు ఆ పార్టీ సింబల్‌తో ఎన్నికల్లో పోటీ చేసిన వారు గానీ బహుశా ఎన్నికల మ్యానిఫెస్టోని మరిచిపోయి ఉండొచ్చు. నేను ఆ విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఆనాటి 2009 నాటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలోని 25 వ పేజీలో చూడండి. అందులో చాలా స్పష్టంగా చెప్పారు. "జూన్ 2009, 1 వ తేదీ నుండి వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని" చాలా స్పష్టంగా చెప్పారు. ఇవాళ నేను మీ దృష్టికి తెచ్చేదేమిటంటే, సభ అంటే వాళ్లిద్దరిది కాదు సార్. ఇవాళ్టి తప్పులకు, ఇవాళ్టి అనర్ధాలకు వాళ్లిద్దరే కారణం సార్. ఆ విషయాన్ని మేం మాట్లాడాల్సిన అవసరముంది. ఆనాడు అధికారంలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి గారు మా పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జరిగిన అంశాలపైన కేసులు పెట్టి విత్‌డ్రా చేసుకున్నారు. తప్పులు జరగలేదని చెప్పి సుప్రీమ్ కోర్టు దాక వెళ్లి కేసుల్ని విత్‌డ్రా చేసుకున్నారు సార్. ఇవాళ వాళ్లు ఒకరిపైన ఒకరు నిందారోపణలు చేస్తూ కాలయాపన చేస్తామంటే ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న అనర్ధాలకు వీళ్లిద్దరే కారణం అనేది ప్రజలందరూ గమనిస్తున్నారు. ఎన్నికల మ్యానిఫెస్టోలోని అంశాల్ని చదవని పార్టీలుగా, ఎన్నికల మ్యానిఫెస్టోని ఉల్లంఘించిన పార్టీలుగా రాష్ట్రంలో ఈ రెండు పార్టీలు ఉండిపోతాయి.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారు మీరు మాట్లాడండి.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, నేను కేవలం ఇప్పుడు రాష్ట్రం ఎదుర్కొంటున్న పరిస్థితులపైన మాట్లాడదలచుకుంటుంటే, వాళ్లు పాత విషయాల్ని గుర్తు చేస్తున్నారు. ఇంకా నేను అంత దూరం వెళ్లలేదు. 2003 వ సంవత్సరానికి ముందు రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి ఏ విధంగా ఉండేదో ఒకసారి ఆలోచన చేసుకుంటే, వాళ్లకే తెలుస్తుంది. ఆ సమయంలో బషీర్‌బాగ్ సంఘటన తెలిసిందే. జలియన్‌వాలాబాగ్‌లో పోలీస్ కాల్పులు జరిపి, అమాయకుల్ని చంపించింది ఎవరు? ఆ విషయం గురించి నేను మాట్లాడడం లేదు. ఆ విషయాన్ని నేను చెప్పడం లేదు. ఆ తరువాత ఎనిమిది నుంచి తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచింది ఎవరు?

(అంతరాయం)

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, మా నాయకుడికి ఒక అలవాటు ఉండేది. అధికారపక్షంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకే తరహా మాట మాట్లాడే వ్యక్తి మా నాయకుడు డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు.

శ్రీ ద్రోణంరాజు శ్రీనివాసరావు: అధ్యక్షా ............

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డి: అయ్యా, విప్ గారు దయచేసి కూర్చోండి. ప్రతి సారీ మీరు మాట్లాడుతూ అడ్డం తగిలితే ఎట్లా? ఏం మాట్లాడొద్దా? ఎక్కడున్నా ఒకే ఉద్దేశ్యంతో మాట్లాడేటటువంటి నాయకుడు డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు.

ఆ సమయంలో ప్రతిపక్షంలో ఇటువైపు ఉన్నటువంటి రాజశేఖర్‌రెడ్డి గారు మాట్లాడుతూ, రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు, రైతులకు ఉచిత కరెంటు సరఫరా చేస్తామనే విషయాన్ని సభలో చెబితే, అటు వైపు అధికార పక్షంలో ఉన్నటువంటి శ్రీ చంద్రబాబు నాయుడు గారు స్పందిస్తూ రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేయడం ఏ విధంగా సాధ్యమవుతుందని, ఎమ్మెల్యేలను తీసుకుపోయి ట్రైనింగ్ క్యాంప్ పెట్టారు. రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం సాధ్యపడదు, ఉచిత విద్యుత్ సరఫరా చేస్తే బట్టలు ఆ తీగలపై ఆరేసుకోవాలనే మాటలను శ్రీ చంద్రబాబునాయుడు గారు మాట్లాడారు.

(అంతరాయం)

వినండి నేను చెప్పేది. తరువాత ఇక్కడ ప్రతిపక్షంలో ఆనాడు కూర్చున్నటువంటి వ్యక్తి డా.వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గారు ఎన్నికల అనంతరం అధికార పక్షం వైపు కూర్చోని ఉచిత విద్యుత్‌ను రైతులకు సరఫరా చేసి, సాధ్యం చేశాడు. ఆ కారణంగా రైతులు సంతోషంగా ఉంటే, అది చూసి నేను కూడా ఉచిత విద్యుత్‌ను రైతులకు సరఫరా చేసి ఉంటే బాగుండేదనే మాటలను శ్రీ చంద్రబాబు నాయుడు గారు మాట్లాడుతూ 2011 వ సంవత్సరంలో స్టేట్‌మెంట్ ఇచ్చారా, లేదా? ఆ విషయాన్ని చెప్పమనండి?

అధ్యక్షా, నాయకుడనే వారు ఇక్కడున్నా ఒకటే మాట్లాడాలి, అక్కడున్నా ఒకటే మాట్లాడాలి. ఇక్కడున్నప్పుడు చెప్పిన మాటను అక్కడికి వెళ్లిన తర్వాత చేసినటువంటి తత్వమున్న ఏకైక వ్యక్తి డా.వైఎస్.రాజశేఖర్ రెడ్డి గారు. ఆ విషయం అందరికీ తెలుసు.

శ్రీ యం.లింగారెడ్డి (ప్రొద్దుటూరు): అధ్యక్షా ......... దోచుకుపోయింది, దాచుకుపోయింది ఎవరు?

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: లింగారెడ్డి గారు దయచేసి కూర్చోండి? శ్రీకాంత్ రెడ్డి గారు మాట్లాడండి.

(అంతరాయం)

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, దోచుకుపోయింది, దాచుకుపోయింది ఎవరో, అన్ని విషయాలు తెలుస్తాయి. వాళ్లు ఎటువంటి వారనే విషయం ప్రజలకు తెలుసు. ఎందుకు రెండు సార్లు ఎన్నికల్లో ప్రతిపక్షంలో ఉన్నారనే విషయం కూడా వాళ్లకు తెలుసు. ఇటీవలి సహకార ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన విషయం కూడా వాళ్లకు తెలుసు. అయినప్పటికీ ఇవాళ వాళ్లు మాట్లాడుతున్నారు.

(అంతరాయం)

స్వయంగా దేశ ప్రధాని డా.మన్మోహన్‌సింగ్ గారు చెప్పినటువంటి మాటల్ని, అంశాల్ని నేను సభలో ప్రస్తావించాను. రాబోయే సంవత్సరానికి బొగ్గు ఎగుమతులు, దిగుమతులకు సంబంధించినటువంటి అంకెలను కూడా ప్రభుత్వం సరైన విధంగా ఇవ్వలేదు. ఏ రకంగా షిప్పింగ్ హ్యాండ్లింగ్ చేసుకుంటారో, ఏ రకంగా రైల్వే వ్యాగన్స్ ఉంటాయనే ప్రణాళిక కూడా ప్రభుత్వానికి లేదు. పోనీ ఇక్కడున్నటువంటి కోల్‌నైనా సరే సక్రమంగా వినియోగించుకొనే సదుద్దేశం కూడా ప్రభుత్వానికి లేనట్టుగా కనబడుతోంది. అటు వ్యవసాయానికి గానీ, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, ఎన్విరాన్‌మెంట్, పవర్ డిపార్ట్‌మెంట్స్ మధ్య అవగాహనకుదిర్చి, కోఆర్డినేట్ చేసి, ఇక్కడున్నటువంటి బ్లాక్స్‌లో సరైన పద్ధతిలో కోల్‌ను ఉత్పత్తి చేయాలనేటటువంటి ఆలోచన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఉండదు. కేవలం పాలకులు అవలంభించిన ఆలోచన విధానల వల్లే, ముందు చూపు లేని కారణానే, చేతిలో ఉన్నటువంటి బొగ్గును సక్రమంగా సద్వినియోగం చేసుకోకపోవడం వల్లే పరిస్థితి చేజారిపోయింది. విద్యుత్ సమస్యతో ఇటు రైతాంగం, అటు ప్రజానీకం, పారిశ్రామికవేత్తలు ఎన్నో ఇబ్బందులను పడుతున్నారు. డిపార్ట్‌మెంట్స్ పరంగా సమన్వయ లోపం వల్లే కరెంటు కష్టాలు ఎదురైనాయి. అదే విధంగా గ్యాస్ పైన కూడా ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే, లభ్యమవుతోన్న గ్యాస్‌ను కూడా సక్రమంగా రాష్ట్రావసరాలకు వినియోగించుకోలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వముంది. కొద్దిపాటి రేటు ఎక్కువైనా సరే గ్యాస్‌ను రైతుల ప్రయోజనార్ధం కొనుగోలు చేసి, తద్వారా విద్యుత్‌ను రైతులకు సకాలంలో సరఫరా చేసినట్లైతే, దాదాపుగా 48 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను అదనంగా ఉత్పత్తి చేసుకునేటటువంటి పరిస్థితి ఉండేది. ఈరోజున కరెంటు విషయంలో ఇంతటి దారుణమైన పరిస్థితి పల్లెల్లో, పట్టణాల్లో ఉండేది కాదు. రైతులకు ఇంత దారుణమైన పరిస్థితి కరెంటు విషయంలో ఉండేది కాదు.

అదే విధంగా డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు 2004వ సంవత్సరంలో ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టగానే రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా చేసిన కారణంగా ఆహార ఉత్పత్తులు పెంచారు. రైతులకు భరోసా కల్గించారు. ఒక రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచని వ్యక్తి ఈ దేశంలో ఉన్నారంటే, ఆ వ్యక్తి డా.వైఎస్. రాజశేఖర్‌రెడ్డి గారే. విద్యుత్ చార్జీలే కాదు, ఏ రకమైన చార్జీలు, పన్నులు

ప్రజలపైన వారు మోపలేదు. ఇంతకు ముందు విప్ గారు చెప్పారు. అప్పుడు రాజశేఖర్ రెడ్డి గారికి ఉన్నటువంటి పరిస్థితుల్లో, 2008-09వ సంవత్సరంలో దాదాపుగా రూ. 62,000.00 కోట్ల రాష్ట్ర బడ్జెట్ ఉన్నప్పుడే, అర్హులైన పేదలందరికీ నెలకు రూ.70.00 లు ఉన్నటువంటి పెన్షన్‌ను రూ.200.00 లకు పెంచారు, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి అమలు జరిపారు. విద్యార్థులకు ఫీజు రీఇంబర్స్‌మెంట్ సౌకర్యం కల్గించారు.

మ.1.10

2008-09 వ సంవత్సరంలో దాదాపు రూ.62,000 కోట్లు బడ్జెట్ ఉన్నప్పుడు, పేదల అందరికీ రూ.75/- నుంచి రూ.200/- లు పింఛను పెంచారు. ఆరోగ్య శ్రీ పెట్టారు, ఫీజు రీయంబర్స్‌మెంట్ పెట్టారు. అన్నీ రకాలుగా ఆలోచించారు, ఇప్పుడు అదే బడ్జెట్ రూ.1,27,000.కోట్లకు చేరితే ఏమి చేస్తున్నారు అధ్యక్షా వీళ్లు? ఛార్జీలు పెంచుతున్నారు. ఇదే అధ్యక్షా వాళ్ల నైజము, మ్యానిఫెస్టోలో ఇంతకు ముందు ముఖ్యమంత్రి గారు ''కాగ్ అంటే నాకు గౌరవం లేదు'' అన్నట్లు వారు చెప్పిన పదాలను బట్టి నాకు అర్థమైయింది, అధ్యక్షా. కనీసం మ్యానిఫెస్టో కన్నా గౌరవ మిస్తారా వీళ్లు. ఆ మ్యానిఫెస్టోలో మనము ఏమని చెప్పాము, ఆ సమయంలో రాజశేఖర్‌రెడ్డి గారి నాయకత్వంలో విద్యుత్ ఛార్జీలు ఈ ఐదు సంవత్సరాల్లో కూడా పెంచము అని చెప్పాము. 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తాము అని చెప్పాము. ఆ మ్యానిఫెస్టో లో ఉన్నటువంటివి పాటించడంలో విఫల మైనటువంటి ప్రభుత్వము వీరిది. అధ్యక్షా, ఒక్క రంగం కాదు, ప్రతి రంగాన్నీ వీళ్లు నాశనం చేసిన వ్యవస్థ ఆ చెడ్డపేరు ఈ రెండు పార్టీలకు వస్తుంది. కారణ మేమిటంటే

(ప్రధాన ప్రతిపక్ష సభ్యులచే అంతరాయం.)

హాస్పటల్స్‌లో కనీస వైద్యం చేసుకోడానికి ఉండదు. టార్చిలైట్స్ కింద లేదా అప్పటికప్పుడు తెచ్చిన క్యాండిల్స్ కింద ఆపరేషన్ చేస్తున్నారు అధ్యక్షా. మీరే చూడండి, గర్భిణీ స్త్రీ తమ చెక్‌ప్ కోసం హాస్పటల్‌కు వెళ్లితే పవర్ లేదని బయట కూర్చో పెట్టారు. తన కండిషన్ కూడా సీరియస్ అయిన అంశం పేపర్‌లో కూడా వచ్చింది. అదే విధంగా ఇది కూడా చూడండి అధ్యక్షా, " we even turned down, the delivery cases due to shortage of power " (అప్పటి ఇంగ్లీష్ దిన పత్రిక చదువుతూ,) అంటే పవర్ లేదని చెప్పి మేము ఎటువంటి సర్జరీ చేయలేము, వైద్యము చేయలేము అని చెప్పి చేతులెత్తేశారు. హాస్పటల్స్‌లో పరిస్థితి అలా ఉంది అధ్యక్షా.

వ్యవసాయం తీసుకుంటే వీళ్లు 7 గంటలు విద్యుత్ ఇస్తున్నాము అంటున్నారు. ఒక ఎకరా ఎండిపోతే చూపించమని, ముఖ్యమంత్రి గారు స్టేట్‌మెంట్ ఇచ్చారు. నేను చెప్పాను పొద్దున, పీలేరు నుంచి మొదలు పెడదాం, ముఖ్యమంత్రిగారి నియోజక వర్గం నుంచే మొదలు పెడదాం, అక్కడ నుంచి చూస్తే తెలుస్తుంది. ఎన్ని లక్షల ఎకరాలు ఎండిపోయాయో, కళ్లద్వారా చూపిస్తామని మేము చెపుతున్నాము, దానికి వాళ్లు సిద్ధమైతే చెప్పోచ్చు.

రూ.32,000 కోట్లు 2007-08 వ సంవత్సరంలో విద్యుత్ వాడకానికిగాను రూ.32,000 కోట్లు కాగా, ఇప్పుడు ఫ్యూయిల్ ఛార్జీస్ క్రింద వసూలు చేస్తున్నారు. ఇది ఎంతవరకు న్యాయమో ఆలోచించాలి. ఆ కాలంలో రాజశేఖర్‌రెడ్డి గారు ఐదు సంవత్సరాలు ఏరకమైనటువంటి ఆటంకాలు కల్పించ కుండా రైతులకు కానీ పరిశ్రమలకు కానీ, ...

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : one second yes DK. Aruna garu.

శ్రీమతి, డి.కె.అరుణ (సమాచార మరియు పౌరసంబంధాల శాఖా మంత్రి) : సభ్యుడు శ్రీ కాంత్ కొత్తవాడు అధ్యక్షా, 2004-09 వ సంవత్సరంలో హౌస్‌లో లేడు. ఐతే ఆరోజు, రాజశేఖర్‌రెడి గారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అని వాళ్లు మర్చి పోతున్నారు. వాళ్ల పార్టీ నాయకుడని చెప్పి వాళ్లు మాట్లాడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా ఆరోజు చేయ బడినటువంటి అన్నీ కార్యక్రమాలు కూడా ఆరోజు ఏవిధంగా కొనసాగించారో ఈ రోజు అంత కంటే మెరుగ్గా కొనసాగుతున్నవి.

(ట్రెజరీ సభ్యులు బల్లలు చరిచారు.)

ఈ రోజు కేవలం రాజశేఖర్‌రెడ్డి గారి పేరుతో లబ్ది పొందాలని మాత్రమే వాళ్లు రాజశేఖర్‌రెడ్డి గారి పేరు చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు, రాజశేఖర్‌రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా పనిచేసినటువంటి విషయాన్ని వారు మర్చిపోతున్నారు. ఈ రోజు రాజశేఖర్‌రెడ్డి గారు వాళ్ల పార్టీ అధ్యక్షుడనో, ఇంకేదన్నా అనో, వాళ్లు భావిస్తే, అది పూర్తిగా వారి పొరపాటని వారు తెలుసుకోవల్సిన అవసరం ఉంది. రాజశేఖర్‌రెడ్డి గారు అనేక సందర్భాల్లో ఈ హౌస్‌లో కూడా, కాంగ్రెస్ పార్టీ లక్ష్యాల గురించి చెప్పారు. ఇందిరా గాంధీ గారి ఆశయాలను, రాజీవ్ గాంధీ గారి ఆశయాలను సోనియాగాంధీ గారి నాయకత్వంలో, మన్‌మోహన్ సింగ్ గారి నాయకత్వంలో ఈ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ రోజు ఇక్కడ ఉన్నటువంటి మేము అందరం కూడా కాంగ్రెస్ పార్టీ యొక్క లక్ష్యం తోనే ఈ ప్రభుత్వం పని చేస్తోంది. వారు కూడా ఆ విషయాన్ని స్పష్టంగా తెలుసుకోవల్సిన అవసరం ఉంది.

ఈ రోజు కేవలం ఏదో ఇక్కడ అవకాశం వచ్చిందని చెప్పేసి రాజశేఖర్‌రెడ్డి గారి పేరు తీసుకొని మాట్లాడుతున్నారు. ఆ పేరుకు ఈ యొక్క కాంగ్రెస్ పార్టీ వాళ్లు అందరు కూడా కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా రాజశేఖర్‌రెడ్డి గారు చేపట్టిన అన్నీ అంశాల్లో కూడా ఇక్కడ ఉన్నటువంటి వారు అందరూ, భాగస్వాములే అధ్యక్షా. ఈ రోజు అందరూ కలిసి మెలిసి కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకు పోయేటువంటి విషయాన్ని వాళ్లు గుర్తించాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్ పార్టీలో వ్యక్తులు ముఖ్యం కాదు, కాంగ్రెస్ పార్టీ యొక్క లక్ష్యం ముఖ్యం, వ్యవస్థ ముఖ్యం, దాన్ని అర్థం చేసుకోవల్సిందిగా నేను కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : శోభా నాగిరెడ్డిగారు.

శ్రీమతి భూమా శోభా నాగిరెడ్డి: మంత్రిగారు మాట్లాడుతూ, రాజశేఖరరెడ్డి గారంటే చాలా అభిమానం ఉందని చెప్పారు, చాలా సంతోషం. ముఖ్యమంత్రిగా ఐదు సంవత్సరాలు పనిచేసి రెండు సార్లు ఈ పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారు. ఆయన పేరు ఎఫ్ఐఆర్ లో పెట్టినప్పుడు స్పందించ లేదు సార్ ఈ మంత్రులు. అదే విధంగా అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు ఈ సభలో లేనటువంటి రాజశేఖర్‌రెడ్డి గారి గురించి విమర్శలు చేస్తుంటే కూడా స్పందించ లేదు సార్ మంత్రులు. ఈ రోజు మా సభ్యుల మీద అంతా స్పందిస్తా ఉన్నారు. సభలో లేనటువంటి వ్యక్తుల మీద ప్రస్తావన వచ్చినప్పుడు కూడా అదే విధంగా స్పందిస్తే ప్రజలు హర్షిస్తారు కానీ, ఈ విధంగా స్పందిస్తే ఎవరూ హర్షించరు సార్ వీళ్లను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : డికె. అరుణ గారు.

శ్రీమతి, డికె.అరుణ : నా సోదరి భూమాశోభానాగిరెడ్డి గారు 2009 వ సంవత్సరంలో ఎక్కడున్నారు, అంతకు ముందు ఎక్కడ ఉన్నారు అధ్యక్షా, ఇప్పుడెక్కడ ఉన్నారు అధ్యక్షా, ఈవేళ సభలో ఉన్న అందరికి తెలుసు అధ్యక్షా, ఆ విషయం. రాజశేఖర రెడ్డి గారి గురించి అభిమాన మనేది ఎవరికి ఉంది ఎవరికి లేదనేది, పైన ఉన్న వారి ఆత్మకు కూడా తెలుసు. రాజశేఖర్‌రెడ్డి గారు పైన ఉన్నా, అభిమానులను చూస్తూ ఉన్నారు, అధ్యక్షా. విద్యుత్ గురించి మాట్లాడుతున్నారు. 9 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ఆరోజు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ముఖ్యమంత్రిగారు కాంగ్రెస్ పార్టీ తరఫున ఇచ్చిన హామీ ఉంది. ఆనాటి పిసిసి ప్రెసిడెంట్ శ్రీ డి. శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఏదైతే హామీ ఇచ్చారో తప్పకుండా ఆ హామీని నిలబెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి మా నాయకుడు రాజశేఖర్‌రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చెపారు. 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తామని, సిఎల్‌పిలో కూడా చెప్పారు. 9 గంటలు విద్యుత్‌ను వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉండింది. ఎన్నికల లోపు తప్పకుండా ఇస్తామని ఆరోజు రాజశేఖర్‌రెడ్డి గారు చెప్పారు. ఆ మాట నిలబెట్టుకొనే పరిస్థితి ఎన్నికల లోపు తప్పకుండా కాంగ్రెస్ పార్టీ చేస్తుంది.

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: మా అరుణక్క చాలా బాగా చెప్పారు నేను కొత్త సభ్యుడినని, నేను మాత్రము, కొత్త సభ్యుడినే నేను 2004-09 సంవత్సరాల మధ్య ఒక సామాన్య పౌరుడినే, ఓటరునే, పౌరునిగా రైతుల వద్దకు వెళ్లినప్పుడు కానీ, కార్మికుల, కర్షకుల, దగ్గరకు వెళ్లి నప్పుడు కానీ, వారు పొందిన ఆనందాన్ని నేను చూశాను. నేను శాసన సభ్యునిగా ఎన్నికైన తర్వాత ఆ పరిస్థితులు లేవు. అదిచెప్పదలుచు కుంటే పెద్దలు డికే అరుణ గారు పార్టీల గురించి మాట్లాడారు, దేశ నాయకుల గురించి మాట్లాడారు. మా అరుణక్క కూడా పోయిన సంవత్సరం కాంగ్రెస్ పార్టీ సభ్యులే.

ఆ విషయం మర్చిపోయింది మా అరుణక్క. లాస్ట్ టైమ్ ఇండిపెండెంట్ సభ్యురాలు, ఆమె సమాజ్ వాదీ మరేదో పార్టీ ఆమె. మేము ఒక్కటే అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ మా నాయకులు రాజశేఖర్‌రెడ్డి గారి అభిమానులమే. అది గ్రహించాలి, వాళ్లు రాజశేఖర రెడ్డిగారి ఆశయాలకు సమాదులు కడుతున్నారు. అందుకనే బయటకు వచ్చి వాళ్లను ఎండ గడుతున్నాము. మానాయకుని ఆశయాల కోసం ఒక మంచి ప్రయత్నంగా చేస్తుంటే అక్రమంగా కుట్ర పన్ని జైల్లో పెట్టింది ఎవరు అధ్యక్షా, ప్రజల కోసం పోరాడుతున్న నాయకుణ్ని చూసి ఎందుకంత భయము అధ్యక్షా. దానిని నేను ప్రశ్నించ లేదు. ఒక ప్రజాదరణ కలిగిన మా నాయకుణ్ని జైల్లో పెట్టారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గురించి మాట్లాడుతుంటే,

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : ఎస్ భస్వరాజు సారయ్య గారు.

శ్రీ బస్వరాజు సారయ్య (వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖా మంత్రి): ఏమన్నా చెబుతున్నప్పుడు వినాలి. కాంగ్రెస్ కార్యకర్తగా కాదు ఎన్ఆర్ఐ గా వచ్చి రాజశేఖర రెడ్డిగారిని బ్రతిమాలితే టికెట్ ఇచ్చారు ఆయనకు. కాంగ్రెస్ పార్టీపై మాట్లాడే అర్హత లేదు ఆయనకు.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి : సారయ్య గారికి సరియైన పరిస్థితులు తెలియవు. 2004 వ సంవత్సరంలోయువజన కార్యకర్తగా 600 కిలోమీటర్లు పాదయాత్ర కూడా చేశాను. అప్పటికప్పుడు వచ్చిన వ్యక్తిని కాను అప్పట్లో రాజశేఖరరెడ్డి గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకు పోవడానికి పాదయాత్ర కూడా చేశాను.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ : శోభా నాగిరెడ్డిగారు.

మ.1.20

శ్రీమతి బి. శోభానాగిరెడ్డి ః సార్, నాపేరు ప్రస్తావనకి తెచ్చారు కాబట్టి మంత్రిగారికి సమాధానం చెప్పాలనుకుంటున్నాను. మంత్రి అరుణ గారు 2006వ సంవత్సరంలో తెలుగుదేశం పార్టీనుంచి పోటీచేశారు. అంతకు మునుపు సమాజ్‌వాది పార్టీనుంచి పోటీ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. 2004వ సంవత్సరంలో ఏ పార్టీలో ఉన్నాము, ఇప్పుడే పార్టీలో ఉన్నామనేది కాదు. మేము మా పార్టీకి రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లి రాజశేఖర్ రెడ్డిగారి ఫోటోతో ఎన్నికల్లో గెలిచాము. ఈ రోజు నేను అడుగుతున్నది ఒకటే... రాజశేఖర్ రెడ్డిగారి పేరు ఎఫ్ఐఆర్‌లో పెట్టినప్పుడు ఈ ప్రేమ ఎందుకు చూపలేదని.

శ్రీమతి డి.కె. అరుణ ః అధ్యక్షా, శోభానాగిరెడ్డి గారు 2006వ సంవత్సరంలో నేను తెలుగుదేశం పార్టీనుంచి పోటీచేశానని అంటున్నారు. నేను అలా పోటీ చేయలేదు. 2004వ సంవత్సరం 2009 వరకు నేను ఇదే శాసన సభలో ఉన్నాను. రాజశేఖర్ రెడ్డిగారు కాంగ్రెస్ పార్టీకి టికెట్ ఇవ్వని పరిస్థితుల్లో, టిఆర్‌యస్ అలియన్స్‌కి వారు సీట్లు కేటాయించిన సందర్భంలో, నేను సమాజ్‌వాదీ పార్టీ స్వతంత్ర అభ్యర్థినిగా పోటీ చేశాను. రాజశేఖర్ రెడ్డిగారు అధికారంలో లేనప్పుడు 2003 సంవత్సరంలో ఆయన చేపట్టిన పాదయాత్రే, ఇప్పటి నా పాదయాత్రకు స్ఫూర్తి అని చెప్పక తప్పడంలేదు. 2003లో మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరులో ఉన్నటువంటి ఇరిగేషన్ ప్రాజెక్ట్సుని తెలుగుదేశంపార్టీ పట్టించుకోక, నిర్లక్ష్యధోరణితో వ్యవహరించి ఆ ప్రాజెక్టులను చేపట్టడంలేదనే విషయాన్ని గుర్తు చేస్తూ మేము పాదయాత్రను చేపట్టిన సందర్భంలో పెద్ద ఎత్తున విశేష స్పందన లభించింది. ఆరోజు పిసిసి అధ్యక్షునిగా ఉన్న సత్యనారాయణగారు, ప్రతిపక్ష పార్టీలో ఉన్న రాజశేఖర్ రెడ్డిగారు మా పాదయాత్రలో పాల్గొన్నారు. అక్కడ చేపట్టిన పాదయాత్ర స్ఫూర్తితోనే రాజశేఖర్ రెడ్డిగారు రాష్ట్రం మొత్తం పాదయాత్ర చేపట్టారనే విషయాన్ని వారు గుర్తుంచుకోవాలి. ఈ విషయాలు ఎవరికీ తెలియవు, కాబట్టి ఇప్పుడు చెప్పక తప్పడంలేదు. అదేవిధంగా రాజశేఖర్ రెడ్డిగారి పిలుపుతోనే సమాజ్‌వాదీ పార్టీతోనే గెలిచినప్పటికీ, ఇక్కడ అసోసియేటెడ్ అభ్యర్థిగానే కాంగ్రెస్ పార్టీలో ఉన్న విషయాన్ని వారికి తెలియజేస్తున్నాను. ఈ విషయాలన్నింటినీ గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది.

శోభా గారు రాజశేఖర్ రెడ్డిగారు చనిపోయాకే పార్టీలోకి వెళ్లారు, అంతకు ముందు రాజశేఖర్ రెడ్డిగారు ఉన్నప్పుడు మాపార్టీలోకి ఎందుకు రాలేదు, అప్పుడేమయ్యాయి ఇప్పటి ప్రేమలు ? రాజకీయాలెవరికీ తెలియనివి కావు. రాజశేఖర్ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన కార్యక్రమాలను గురించి మేము చెప్పుకోం. వారు ఇప్పుడు మమ్ములను సాధించాలనుకోవడం చాలా సిగ్గుచేటు.

శ్రీ పి. అశోక్ గజపతి రాజు (విజయనగరం)ః సార్, తమరికి ఒక విజ్ఞప్తి. ప్రజలు విద్యుత్తు పరంగా ఎక్కువ ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ చర్చ రావడానికి 13వ తేదిన తమరి సమక్షంలో బిఏసిలో ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ క్రింద విద్యుత్తు అంశాన్ని తీసుకోమని మేము అందరమూ విజ్ఞప్తి చేశాము. ఇవాళ 25వ తేది వచ్చింది, కానీ ఇన్ని రోజులు దాటిన తరువాత కూడా ఈ చర్చను నాన్ సీరియస్‌గా చేయాలనే ఉద్దేశంతో చాలామంది సభ్యులు మాట్లాడుతున్నారు, ఇది మంచి పద్ధతి కాదు. This is no confidence either in the late Dr. Y.S. Rajasekhar Reddy or Mr. N. Kiran Kumar Reddy. It is to ensure the accountability of the Government of the day to the people through this august House. If you can ensure that the Constitution of India is implemented in its letter and spirit then it is fine. This is what we demand from the Government and from you, Sir.

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి ః అధ్యక్షా, నేను ఇప్పటి వరకు ఎక్కడ కూడా డీవియేట్ కాకుండానే మాట్లాడుతున్నాను. వాళ్లు మాట్లాడినదానికే నేను సమాధానం చెప్పడానికే ప్రయత్నం చేశాను తప్పితే, మరేమిలేదు. విద్యుత్తు సమస్యలను గ్రామీణ ప్రాంతాలలో కళ్లతో చూశాను కాబట్టే వాటిని తమరి ముందు పెట్టాలనే ఉద్దేశంతో నేను ఇక్కడికి వచ్చాను. రాయచోటి నియోజక వర్గంలోని పెద్దలు శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డిగారు ఏవిధంగా ప్రతి ఒక్క ఫీడర్ రిపోర్ట్ తెప్పించుకుంటారో, అదేరకంగా రెండు నెలల రిపోర్టు అన్ని మండలాల సబ్‌స్టేషన్ నుంచి ఏ ఏ ఫీడర్స్‌కు ఎన్ని గంటల విద్యుత్తు వస్తుందో అని చూసాను. ఒక్క ఫీడర్ నివేదికలో కూడా ఏడు గంటలు కనపడలేదు. ఇదేమని అధికారులను ప్రశ్నిస్తే పైనుంచి సప్లైలేదు, మీరు సియండితోగానీ, సిఇతోగానీ మాట్లాడండీ అనే సమాధానాలు ఇస్తున్నారు. రైతులు పెట్టుకునే పంట కళ్లముందే ఎండిపోవటం జరుగుతుంది. ఒకటి, రెండు విడతల్లో విద్యుత్తునిస్తామని చెప్పి, ఇచ్చే రెండు, మూడు గంటల విద్యుత్తును కూడా నాలుగైదు విడతలుగా ఇవ్వడం జరుగుతుంది. రైతు పొలంలోకి వెళ్లి మోటారు ఆపితే నీరు మడిలోకి వెళ్లేలోపలే కరెంటు పోతుంది. తరువాత ఎంతో సమయం రైతు అక్కడే వేచి ఉండి మరలా కరెంటు వచ్చినపుడు నీరు వదలితే, ముందు వెళ్లినచోటికి నీరు వెళ్లగానే మళ్లీ కరెంటుపోతుంది. నేను చెప్పేది అవాస్తవమైతే, సియండి గారు, సంబంధిత మంత్రిగారు ఇక్కడే ఉన్నారు, కాబట్టి నేను చెప్పిన నియోజక వర్గంతోపాటు అన్ని ఫీడర్ రిపోర్టులను ఒకసారి తెప్పించుకొని పరిశీలించమనండి, వారికే తెలుస్తుంది. ఇక్కడ కూర్చొని మాట్లాడితే తెలియదు, అక్కడికి వెళ్లి రైతుల పరిస్థితి చూస్తే అర్థమవుతుంది.

వ్యవసాయ రంగానికి ఈ ప్రభుత్వం విద్యుత్తును ఇవ్వలేక పోతున్నది, కనుక పంటలు ఎండిపోతున్నాయి. కనీసం ఒక బిందె త్రాగునీటికోసమైనా పవర్ సప్లై ఇవ్వండని ఎంతమంది ప్రజలు పల్లెల్లో కొట్టుమిట్టాడుతున్నారో, ఒకసారి పల్లెలకెళితే తెలుస్తుంది. అంతేకానీ, మేము ఇన్ని గంటల కరెంటునిస్తున్నామని మాటలు చెప్పడం కాదు. యస్‌పిడిసిఎల్ సియండి గారిని పవర్ సప్లై గురించి అడిగితే, అతనికి పవర్ సప్లై గురించి పట్టదు, కానీ చిన్న, చిన్న లైన్‌మెన్ కాంట్రాక్టర్ జాబ్‌లను అధికారులతో కుమ్మక్కై చేసుకుంటున్నాడు. ఒక ప్రభుత్వ అధికారిగా ఉండి పవర్‌కు ఇంత దారుణమైన పరిస్థితులలో ఉంటే దానికి వివరణ ఇచ్చుకోకుండా తాను ఎంతసేపూ వ్యక్తిగతంగా ఉద్యోగాలను భర్తీ చేసుకోకుండా, ఆఫీస్‌ని, పార్టీ కార్యకర్తలను కూడా అన్యాయంగా మార్చేశారు. ఇంత దారుణమైన పరిస్థితి ఎక్కడా ఉండదు. పవర్ సప్లై గురించి అడిగి, ఫోన్ చేస్తే తాను శాసన సభ్యుడిని అనే గౌరవం కూడా లేకుండా ఫోన్ కట్‌చేయడం జరుగుతుంది. డిఆర్‌సి మీటింగ్‌కు రావాలని ఆహ్వానించి, జిల్లా పరిస్థితులు తెలియజేస్తామని చెపితే కూడా తప్పించుకొని తిరుగుతున్నాడు. ఇదేనా అతని బాధ్యత ? ఒక విశ్రాంత ఉద్యోగికి ఏ విధమైన రాజకీయ ఆశ చూపించి పెట్టారో ప్రభుత్వం

సమాధానం చెప్పాలి. అతను ప్రభుత్వం కోసం పని చేస్తున్నాడా, లేదా ప్రజలకు నాణ్యమైన విద్యుత్తును ఇవ్వడం కోసం పని చేస్తున్నాడా లేద అనే విషయాన్ని ఒకసారి అతన్ని ప్రశ్నించి రిపోర్టు తెప్పించుకుని పరిశీలిస్తే బాగుంటుంది.

నేను ఇంతకు మునుపు చెప్పినట్లు వీరు వ్యవసాయ రంగాన్ని ఆదుకోలేక పోయారు, బోర్లద్వారా సాగైయ్యే దాదాపుగా 75 లక్షల ఎకరాలలోని పంటను చేతికి అందకుండా చేశారు. ఏదో రకంగా చిన్న పరిశ్రమల్లో పనిచేసుకొని బ్రతికే కార్మికులకు ఉపాధి లేకుండా దాదాపుగా చిన్న కుటీర పరిశ్రమలన్నీ మూతపడడానికి కారకులయ్యారు. దానివల్ల పరిశ్రమలపై ఆధారపడిన 20 లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారు, అంతేకాకుండా వారి కుటుంబ సభ్యులను కలుపుకుంటే దాదాపుగా ఒక కోటి మంది కరెంటు కోతల కారణంగా పరిశ్రమలు మూతపడి రోడ్డున పడ్డారు. వీరందరికీ ఎవరు నష్టపరిహారమిస్తారు? మరలా సమ్మిట్ మీట్స్‌ని నిర్వహిస్తామంటారు, దానివల్ల సుమారు ఆరు లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెపుతారు. పరిశ్రమలు ఎక్కడ వస్తున్నాయి ? ఉన్న చిన్న కుటీర పరిశ్రమలను నడిపించలేక ప్రభుత్వం విఫలమై ఉంటే, ఇక భారీ పరిశ్రమలెలా తెచ్చుకోగలుగుతుంది? ఊరికే ప్రజలను మభ్యపెట్టడం తప్పితే మరేమి లేదు. వ్యవసాయ రంగంలోనే కాదు, పారిశ్రామికంగాను ఇతర అన్ని రంగాలలోకూడా ప్రభుత్వం విఫలం చెందింది.

మ.1.30

పదవ తరగతి విద్యార్థులు, ఇంటర్ మీడియట్ విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షల సమయంలో విద్యుత్ కోతల విషయమై వారి బాధను మాతోటి విన్నవించుకుంటున్నారు. విద్యార్థులు క్యాండిల్ వెలుతురులో ఎంత సేపు చదువుకోగలరో చెప్పండి అధ్యక్షా? ప్రభుత్వానికి ఈ విషయంలో కనీస ఇంగిత జ్ఞానం కూడా లేకుండా పోయింది. 2004వ సంవత్సరానికి ముందు రాష్ట్రంలో దాదాపు రూ.1000 కోట్ల రుణాలు ఏవైతే రైతుల మీద ఉన్నాయో, అవన్నీ తీర్చి, ఉచిత విద్యుత్ ఇచ్చి, రైతాంగానికి భరోసా కలిగించి, రాష్ట్రానికి, దేశానికి ఉపయోగపడే విధంగా ఆహార ఉత్పత్తులను ఎన్నో రకాలుగా పెంచిన వ్యక్తి డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి గారంటే ప్రభుత్వం అది కూడా ఒప్పుకునే పరిస్థితిలో లేదు. గత రెండు సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ఆర్థిక పెరుగుదల ఎలాంటి పరిస్థితిలో ఉందో తెలుసుకోవాలంటే సోషియో ఎకనామిక్ రిపోర్టులో 250వ పేజీ చూస్తే వాళ్లకే తెలుస్తుంది అధ్యక్షా. వ్యవసాయం, పారిశ్రామిక రంగాలు ఏ విధంగా నష్టాలు చవిచూస్తున్నాయో ప్రభుత్వం ఒక సారి ఆలోచన చేసుకుంటే బాగుంటుంది అధ్యక్షా. ఎస్.సి, ఎస్.టి సబ్ ప్లాన్ గురించి గౌరవ సభ్యులు అనేక రాకాలైన ఉపన్యాసాలిస్తున్నారు. సదరు ప్లాన్‌ను సరైన పద్ధతిలో నిర్వహించలేకపోతున్నారనే విషయం అందరికి తెలుసు. కేవలం పబ్లిసిటీ కోసం మాట్లాడుతున్నారు అధ్యక్షా. డా. రాజశేఖర్ రెడ్డిగారు ఎస్‌సి, ఎస్‌టిల కోసం ఆలోచన చేసి, వాళ్ల కాలనీలలో..

(అంతరాయం)

మిస్టర్ డిప్యూటి స్పీకర్: కొండ్రు మురళీ మోహన్ గారు..

శ్రీ కొండ్రు మురళీ మోహన్ (వైద్య, విద్యా శాఖా మంత్రి): సార్, చాలా సేపటి నుంచి శ్రీకాంత్ రెడ్డిగారు మాట్లాడుతున్నారు. ఆయన మాట్లాడిన మాటలన్నీ కూడా సాక్షి పేపర్‌లో అడ్డగోలుగా ఏమి రాస్తున్నారో అవే మాట్లాడుతున్నారు. చాలా అన్యాయంగా మాట్లాడుతున్నారు.

ఇవన్నీ ప్రజలకు తెలియాలి. మా ముఖ్యమంత్రి గారు వచ్చిన తర్వాత రైతులకు లక్ష రూపాయలు వడ్డీ లేని రుణం ఇస్తున్నారు. ముఖ్యమంత్రి గారి కొచ్చిన ఆలోచన మిగతా ప్రతిపక్ష నాయకులకు వచ్చిందా అని అడుగుతున్నాను. రాజశేఖర్ రెడ్డిగారు మా నాయకుడు. ఆయన పావలా వడ్డీ అమలుచేస్తే, దానిని ఇప్పుడు జీరో వడ్డీ చేశాం. అవి మా పార్టీ సిద్ధాంతాలు. వారు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. ఆరోగ్య రంగానికి సంబంధించి రూ.6500 కోట్లు ప్రభుత్వం ఖర్చుపెడుతున్నది. ఆరోగ్యశ్రీ పథకానికి ఆ రోజున రూ.130 కోట్లు కేటాయిస్తే, ఈ రోజున రూ.1400 కోట్లు ఖర్చుపెడుతున్నాం. ఉద్యోగస్తులకు, రిటైరైన ఉద్యోగులకు ఈ రోజున హెల్త్ కార్డులు జారీ చేస్తున్నాం. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ విషయమై పది సార్లు రాజశేఖర్ రెడ్డి గారున్నప్పుడే వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. అప్పుడు ఆయన చేయలేకపోయాడు. సోనియా గాంధీ గారిని ఆదర్శంగా తీసుకుని ఆ పని ఇప్పుడు మా నాయకుడు, శ్రీ ఎన్.కిరణ్ కుమార్‌రెడ్డిగారు చేశారు. దేశంలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులందరికీ కిరణ్ కుమార్‌రెడ్డిగారిని ఆదర్శంగా తీసుకోవాలని సోనియా గాంధీ గారు చెప్పారు. ఎస్‌సిఎస్‌టి సబ్‌ప్లాన్ ఈ రోజున ఇంప్లిమెంట్ అవుతుంది. ఎస్‌సి,ఎస్‌టిలు కాంగ్రెస్ పార్టీ ఉంటేనే మాకు భద్రత అని, గర్వంగా చెప్పుకుంటున్నారు. అది తెలుసుకుని మాట్లాడమని తెలియచేస్తున్నాను.

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డిః సోదరులు మురళీ గారు అవకాశం వచ్చినప్పుడు బాగా భజన చేశారు. చాలా బాగుంది. అధ్యక్షా, గతంలో రాజశేఖర్‌రెడ్డి గారి హయంలో ఎస్‌సి, ఎస్‌టి కాలనీలలో ఒక ఇంటికి దాదాపు 100 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు అది తీసివేసి వాళ్ల నడ్డి విరిచి, ఇళ్లలోని వస్తువులను తీసుకుపోతూ, వాళ్లని నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారా? లేదా? చెప్పమనండి. ఎస్‌సి,ఎస్‌టి సబ్ ప్లాన్ గురించి మాట్లాడటం కాదు అధ్యక్షా. ఇంతకు ముందు ప్రభుత్వం వాళ్లకు విద్యుత్ మీటర్‌లు పెట్టవద్దని చెప్పింది. ఇప్పుడు మీటర్‌లు లేవనే సాకుతో బలవంతంగా విద్యుత్ కనెక్షన్‌ను తొలగిస్తున్నారు.

శ్రీ కొండ్రు మురళీ మోహన్ః అధ్యక్షా, అలా 1983లో కొన్ని కాలనీలకు ఇవ్వడం జరిగింది. తర్వాత 2004వ సంవత్సరంలో తీసివేయడం జరిగింది. మేము అప్పుడు రాజశేఖర్ రెడ్డిగారికి పదిసార్లు ఏమని విన్నవించుకున్నామంటే "సార్ కొన్ని కాలనీలలో రైతులకు ఉచితంగా విద్యుత్ ఇస్తున్నారు. ఎస్‌సీలకు ఎక్కడా భూమి ఉండదు. కనీసం 50 లేదా 100 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వమని అడిగితే, కుదరదని అన్నారు". అలాగే మా ఎస్‌సీలు రూ.25000 రుణంతో ఇళ్లు కట్టుకోలేరు, మాకు సమాజంలో తగినంత స్థానం లేదు అని నేనే స్వయంగా మా ఎస్‌సి, ఎస్‌టి శాసన సభ్యులను కలుపుకుని వెళ్లి అడిగితే, ఎన్నికల ముందు వరకూ కూడా మంజూరు చేయలేనటువంటి పరిస్థితి. ఇప్పటి ముఖ్యమంత్రి గారు ఆ రుణాన్ని రూ.45000 నుంచి రూ.60000 పెంచడం జరిగింది. దానిని కూడా ఎస్‌సిఎస్‌టి సబ్ ప్లాన్‌లో రూ.1,00,000 పైబడి పెంచడానికి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామని తెలియచేస్తున్నాను. భవిష్యత్‌లో మీ పార్టీ ఎన్నికలలో గెలిస్తే ప్రజలకు ఏమి చేస్తారో అది చెప్పాలి కానీ, మా ప్రభుత్వాన్ని, మా ముఖ్యమంత్రి శ్రీ ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి గారిని విమర్శించే అర్హత వారికి లేదని తమరి ద్వారా తెలియచేస్తున్నాను.

మిస్టర్ డెప్యూటి స్పీకర్ః శ్రీ కె. శ్రీనివాసులుగారు..

శ్రీ కె.శ్రీనివాసులు (కోడూరు): అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు మాట్లాడుతూ, గతంలో ఎస్‌సీ, ఎస్‌టీ కాలనీలకు ఉచిత విద్యుత్ ఇవ్వమని అడిగామని చెబుతున్నారు. అది సత్య దూరం. గతంలో రాజశేఖర్‌రెడ్డిగారి హయంలో ఎస్‌సిఎస్‌టి కమీషన్‌లో నేనొక సభ్యుడిగా ఉన్నాను. చాలా గ్రామాల్లో ఉచిత విద్యుత్ క్రింద ఒక బల్బ్‌కి అవకాశం ఉండేది. వారం రోజుల క్రితం ఒక ఎస్‌సి కాలనీలో విద్యుత్ సరఫరా లేదని కాలనీ వాసులు నాకు తెలియచేశారు. ఆ విషయమై నేను సంబంధిత అధికారులను ప్రశ్నించగా, వారికి పై నుంచి ఆదేశాలు వచ్చాయని, ఖచ్చితంగా కాలనీ వాసులు అందరూ విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిందేనని తెలిపారు. పరీక్షల సమయాల్లో విద్యార్థులు విద్యుత్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. నేను స్వయంగా నాలుగు మండలాల్లో సంబంధిత ప్రాంత అధికారులతో పర్యటించాను. విద్యుత్ కోతల విషయంలో మేము ఏమి చేయలేం అని వారు చెప్పారు. రాజశేఖర్ రెడ్డి గారు ఇచ్చిన ఉచిత విద్యుత్‌ను ఇప్పటి ప్రభుత్వం తీసివేసింది అధ్యక్షా. రాజశేఖర్‌రెడ్డిగారి హయాంలో ఇచ్చినటువంటి ఉచిత విద్యుత్‌ను ఇప్పుడు కూడా కొనసాగించాలని గౌరవ ముఖ్యమంత్రిగారిని తమరి ద్వారా కోరుతున్నాను.

మిస్టర్ డెప్యూటి స్పీకర్: శ్రీకాంత్‌రెడ్డిగారు..

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి: అధ్యక్షా, ప్రభుత్వం ఏదైనా విషయం మీద అసెంబ్లీలో చర్చ జరపడానికి భయపడుతుంది.

(కాంగ్రెస్ పార్టీ సభ్యుల వైపు నుంచి ఆహా.. ఓహో.. అని వినపడింది)

వాళ్లు చెప్పినటువంటి గణాంకాలన్నీ బడ్జెట్‌లో ప్రతి ఒక్క అంశం పైన ప్రభుత్వాన్ని అడుగుదామని అనుకున్నాను. కానీ, మంత్రిగారితో తెలివిగా ఇప్పుడే మాట్లాడించారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా లక్ష రూపాయలు వడ్డీ లేని రుణాలు ఇస్తారని చెప్పుకుంటుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం సదరు రుణాన్ని 7 శాతం వడ్డీకి ఇస్తే, అప్పుడు రాజశేఖర్ రెడ్డిగారు 4 శాతం వడ్డీకి రైతులకు ఇచ్చేవారు అధ్యక్షా. అదే విధంగా మహిళా సంఘాలకు కూడా ఇచ్చేవాళ్లు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ వడ్డీని 7 శాతం నుంచి 4 శాతానికి తగ్గించింది. దానిని కూడా రాష్ట్ర ప్రభుత్వం వాళ్ల గొప్పతనంగా చెప్పుకుంటుంది.

శ్రీ గండ్ర వెంకట రమణారెడ్డి (మైకు లేకుండా): కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉంది ఎవరు సార్ అని అడిగారు.

శ్రీ జి.శ్రీకాంత్‌రెడ్డి: కేంద్ర ప్రభుత్వంలో అధికారంలో ఉంది మీ ప్రభుత్వమా? మా ప్రభుత్వమా అన్నది ముఖ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రజలకు మీరు ఏమి చేశారని అడుగుతున్నాను. అధ్యక్షా, ఈ విధంగా ప్రభుత్వం ప్రతి ఒక్క అంశం పైన వాస్తవ పరిస్థితులకు దూరంగా ఉంటుంది.

మ1.40

అప్పుడు రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈఆర్‌సి వారు ఛార్జీలు పెంచమని రెకమెండ్ చేయగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని పెంచ లేదు. ఉచిత విద్యుత్‌కి

సంబంధించి కూడా ఈఆర్‌సి వారు అలాగే చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలుగుతుందనే భావంతో ప్రజలకు ఉచిత విద్యుత్‌ని ఆనాడు రాజశేఖర రెడ్డిగారు అందించారు. ఈ ముఖ్యమంత్రి గారు మేము పెంచలేదు, ఈఆర్‌సి వారు చెప్పారు కాబట్టి అలా చేసామని చెబుతున్నారు. రాష్ట్రాన్ని పరిపాలించేది ముఖ్యమంత్రా లేక ఈఆర్‌సినా అనేది తెలియచేయాలి. ఇప్పుడు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి ఎవరు కారకులని ఆలోచిస్తే తెలుస్తుంది. ఎక్కడ చూసినా అన్ని రంగాలలో మూడు సంవత్సరాల నుండి సరైన ప్రణాళికలు రూపొందించకుండా రాష్ట్రానికి నష్టాన్ని చేకూర్చారు. అందుకుగాను బాధ్యులు ఎవరు?

తమిళనాడు రాష్ట్రంలో అక్కడ ఉన్న పరిశ్రమలను గమనించి ఆ ప్రభుత్వం జనరేటర్లకు సంబంధించి రూ.5.00 లక్షల వరకూ సబ్సిడీ ఇస్తోంది. అటువంటి మంచి ఆలోచన ఇక్కడ లేదు. ఇక్కడ జనరేటర్ల మీద వ్యాట్‌ని 5 నుండి 14 శాతానికి పెంచారు. ఎంత సేపూ ఆదాయ మార్గాలు చూస్తారుతప్ప ప్రజల, పరిశ్రమల ఇబ్బందులు పట్టించుకోరు. వారికి వెసులుబాటు ఆలోచన ఎప్పుడూ చేయరు. ఇంతకుముందు రూ.60,000 కోట్ల బడ్జెట్ ఉన్నప్పుడు పింఛనులను పెంచారు. రూ.70 నుండి రూ.200లకు పెంచారు. ఇప్పుడు బడ్జెట్ రూ.1,26,000 కోట్లు అయింది. బడ్జెట్ రెట్టింపు అయినా కూడా ఏమయినా చేయాలనే ఆలోచన వారికి లేదు. మావి, ఉద్యోగస్తుల జీతాలు పెంచారు. వృద్ధుల, వికలాంగులకు పింఛను పెంచలేదు. ఇప్పటికయినా ఈఆర్‌సి వారి మాటలు వినకుండా సంక్షేమానికి ఉపయోగపడే విధంగా రాయితీలను పెట్టాలని కోరుతున్నాను. ప్రభుత్వం వారు అన్ని వివరాలను తెప్పించుకొని క్యాలికులేట్ చేసుకొని చేయవచ్చు. అన్ని రిపోర్టులు తెప్పించుకోవచ్చు.

విద్యుత్ లేని కారణంగా ఎంతో మంది రైతులు పంట నష్టపోయారు. నీలం తుఫాను, జల్ తుఫాను బాధితులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తున్నట్లుగా, విద్యుత్ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని మా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాము. కొన్ని కొన్ని పరిశ్రమలవారికి నైతిక ధైర్యం కల్పించాలి. విద్యుత్‌ని బయట నుండి కొనుగోలు చేసే విషయంలో ఆలోచన చేయాలి. విద్యుత్ సరఫరా నిరంతరాయంగా రెండు గంటలయినా ఇవ్వమనండి కానీ, అప్పుడొక అరగంట, మరొక సారి అర గంట, ఇంకొక సారి అర గంట ఇవ్వడం కాదు. 7 గంటల విద్యుత్‌ని ఎలాగూ ఇవ్వలేరు. ఎంత సేపు ఇవ్వాలనుకుంటున్నారో, అంత విద్యుత్‌నే నిరంతరాయంగా ఇవ్వాలని కోరుతున్నాను. అప్పుడు రైతులకు కొద్దిగా వెసులుబాటు కలుగుతుంది. ఈ ప్రభుత్వం అన్ని రంగాలలోనూ విఫలమయింది. రాజశేఖర రెడ్డి గారు ఉన్నప్పుడు విద్యుత్, ఇతరత్రా ఏ ఛార్జీల పెంపుదలకు వెళ్లలేదు. ప్రజల మీద భారం మోపలేదు. ఈ ప్రభుత్వం ఆహారోత్పత్తి విషయంలో ఎందుకు శ్రద్ధ చూపడం లేదో తెలియడం లేదు.

ఆహారోత్పత్తి పెంచకుండా రాష్ట్రాభివృద్ధి జరగదు. మన వద్ద 66 శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడ్డారు. 19 శాతం పరిశ్రమల మీద ఆధారపడి జీవనోపాధి సాగిస్తున్నారు. రెండు సెక్టార్లను నాశనం చేసి ప్రజలకు ఏమి మేలు చేకూరుస్తారో ఆలోచన చేయాలి. ఇప్పటికయినా సరైన సూచనలు చేసి గ్రామీణ ప్రాంతాలలో ప్రతీ సబ్ స్టేషన్ వద్ద సరైన ఆదేశాలిచ్చి ఒక విడత లేదా రెండు విడతలుగా నిరంతర విద్యుత్ సరఫరాను ప్రకటించమనండి. ఆ విధంగా చేస్తే కనీసం రెండు శాతమయినా రైతులకు లాభం చేకూరుతుంది. అలా కూడా చేయడం లేదు. సబ్ స్టేషన్ల వద్ద బోర్డులు డిస్‌ప్లే చేయవలసిందిగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని తమ ద్వారా కోరుతున్నాను. ఆదేశాలు

ఇచ్చామని అంటున్నారు కానీ ఆచరణలో ఏమీ లేదు.  అన్ని ఛార్జీలు విపరీతంగా పెంచుతున్నారు. ప్రజలు అనేక రకాల ఇబ్బందులకు లోనవుతున్నారని నిరశనకు దిగితే అక్రమంగా నాయకులను అరెస్ట్ చేశారు.  ముఖ్యమంత్రి గారు ప్రతిసారి నేను ఎవరికి భయపడను, భయపడును అని అంటూ ఉంటారు. వారు భయపడాలని మేము చెప్పడం లేదు.

డా.ఎస్. శైలజానాథ్ (ప్రాథమిక విద్యాశాఖా మంత్రి) :  అధ్యక్షా, మిత్రులు చాలా సేపటి నుండి మాట్లాడుతున్నారు.  వారు చెప్పిన ఒక్క మాటకు నేను రెస్పాండ్ కాదలచాను.  మీరు ఏమి చేశారని వారు మమ్ములను ప్రశ్నించారు.   చాలా కాలంగా ఎస్‌సి కాలనీలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే డిమాండ్ ఆంధ్ర రాష్ట్రం యావత్ దళితులకు ఉంది.  తెలుగు దేశం పార్టీ కాలంలో అప్పుడు కారంచేడు ఘటన తరువాత కూడా డిమాండ్ చేయడం జరిగింది.   అప్పుడు వారు చేయలేదు.  అప్పుడు ఏ ఉత్తర్వు రాలేదు.   రాజశేఖర రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరువాత మేమందరం కలిసి రూ.150 కోట్లు అవుతుందని చెబితే, వారు చెప్పిన మాట ఏమిటంటే, ఉచితంగా విద్యుత్‌ని ఇవ్వడానికి సాధ్యం కాదు,  అప్పును కూడా పూర్తిగా మాఫీ చేయలేము, సగం వారు కడితే సగం ప్రభుత్వం రద్దు చేస్తుందని చెప్పారు.  మిత్రులు ఈ విషయాన్ని కరెక్ట్ చేసుకోవాలని చెబుతున్నాను.

2004 నుండి నేటి వరకూ  జరుగుతున్న పరిపాలన కాంగ్రెస్ పార్టీ పాలన.  మధ్యలో మా నాయకులు రాజశేఖరరెడ్డి గారు దివంగతులైనారు.  తరువాత మా పార్టీ నాయకత్వ సూచనల మేరకు పరిపాలన కొనసాగుతోంది.  నాకు అర్థం కాని విషయం ఒక్కటే.  ఈ మధ్య కాలంలో బయటకు వెళ్లి పార్టీ పెట్టుకొన్నవారు రాజకీయాలు  చేయడానికి పార్టీని పెట్టుకున్నారా అనేది తెలియడం లేదు.  వారు ఏమైనా చేశారా?

ఈ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు అనేకం ఉన్నాయి.  కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై ఆధారపడి కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తున్న పరిపాలన ఇది.  ఉదాహరణ తీసుకుంటే, భారత దేశంలో భూ సంస్కరణలు చేయవలసిన రోజున వేలాది ఎకరాలను భూస్వాముల చేతుల్లోంచి తీసుకోవడం జరిగింది.  కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న నరసింహారావుగారు  కాంగ్రెస్ పార్టీ విధానాన్ని అవగాహన చేసుకొని రాష్ట్రంలో భూ పంపిణీ కార్యక్రమాన్ని అమలుచేసి పేదలకు, హరిజనులకు భూములను పంచిన నాయకులు అప్పటి ముఖ్యమంత్రి అయిన వారు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులే.  బ్యాంకుల జాతీయికరణ ద్వారా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ఈ భారతదేశంలొ మనం అమలుచేసుకున్నాము. పెత్తందార్లు రాజ్యం ఏలే ప్రాంతంలో కూలీలకు రూ.20, రూ.30 మాత్రమే రోజుకు ఇచ్చేవారు.  ఆడవారికి, మగవారికి తేడా చూపించి ఉదయం నుండి సాయంత్రం వరకూ పని చేయించుకునే వారు.  కాంగ్రెస్ పార్టీ హయాంలో  సోనియా గాంధి గారి నాయకత్వంలో  జాతీయ ఉపాధి హామీ పథకాన్ని  రాష్ట్రంలో సమర్థవంతంగా అమలు చేసిన నాడు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నది రాజశేఖర రెడ్డిగారు.  కానీ ఈ రోజు కొత్తగా పెట్టుకొన్న పార్టీ కాదని గుర్తు చేస్తున్నాను.

కొత్తగా పార్టీని పెట్టుకున్న వారు ఏమి చేశారో చెప్పమనండి.   ఇందాక మిత్రులు కొండ్రు మురళిగారు చెప్పారు.  పావలా వడ్డీ నుండి, రైతులకు వడ్డీ లేని రుణాలను ప్రకటించి అమలు చేసింది కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డిగారి ప్రభుత్వం. వడ్డీలు లేవన్న తరువాత అంతకన్నా ఏమి కావాలి.  దేశంలో మన రాష్ట్రంలో  రూ.40,000 కోట్లకు సంబంధించిన మొత్తాన్ని  రైతాంగానికి

రద్దు చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే.

మ.1.50

భారతదేశంలో 20 సంవత్సరాలకు పైగా, 20 సంవత్సరాల క్రితం ఈ దేశంలో ఎస్.సి., ఎస్.టి.ల అభివృద్ధి నిమిత్తం నిధులను ప్రత్యేకంగా కేటాయించాలని శ్రీమతి ఇందిరాగాంధీ గారు ప్రత్యేకంగా లిఖితపూర్వకంగా చెపితే, ఈ రాష్ట్రంలో అనేక మంది మాట్లాడుతూ వస్తే, అవకాశం వచ్చిన రోజున, అధికారం చేతికి వచ్చిన రోజున శ్రీమతి సోనియా గాంధీ గారు ఈ కార్యక్రమంపై మరోమారు శ్రద్ధ తీసుకోగా, ఈ దేశం లో మొట్టమొదటి సారి ఎస్.సి., ఎస్.టి. సబ్ ప్లాన్‌ను చట్టబద్ధం చేసి భారతదేశానికి ఆదర్శంగా నిలిచిన ప్రభుత్వం కిరణ్‌కుమార్ రెడ్డి గారి నాయకత్వంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని తెలియజేస్తున్నాను. ఈ దేశంలో నీలం సంజీవ రెడ్డి గారు, పి.వి. నర్సింహారావు గారు, బ్రహ్మానందరెడ్డి గారు, రాజశేఖరరెడ్డి గారు, రోశయ్య గారు, కిరణ్ కుమార్ రెడ్డి గారు తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు జాతీయ కాంగ్రెస్ పార్టీ విధానం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల వారి కోసం కృషి చేశారు. రాజశేఖరరెడ్డి గారు అక్కడ కూర్చొని, 'ఈ దేశానికి రక్ష కాంగ్రెస్ పార్టీ. ఈ దేశ ప్రజలు నమ్మాల్సింది కాంగ్రెస్ పార్టీని. కాంగ్రెస్ పార్టీలో పనిచేయడమంటే, కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడమంటే, స్వప్రయోజనాలను విడనాడి హరిజన గిరిజన బడుగు బలహీన వర్గాల కోసం, మైనారిటీల కోసం, మహిళల కోసం పనిచేయాలని' అయన చెప్పారు. మీరెవరూ పార్టీకి వ్యతిరేకంగా పనిచేయకండి. పార్టీ అంటే కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీ అంటే భారత దేశమే. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేయడమంటే భారతదేశానికి పనిచేయడమే.

(అంతరాయం)

ఒక్క నిమిషంలో ముగిస్తాను. మా ముఖ్యమంత్రి గారు అమలు చేయని, కాంగ్రెస్ పార్టీ ప్రకటించని క్రొత్త కార్యక్రమం ఏమిటో చెప్పాలని కోరుతున్నాను. ఇప్పటికి మమ్మల్ని వదిలిపెట్టి పోయిన, మమ్మల్ని మోసం చేసి పోయిన, మాకు ద్రోహం చేసి పోయినా, మీరు మా వాసన పోగొట్టుకోలేక, మా కార్యక్రమాలను మీరు పదే పదే చెపుతున్నారు. ఈ దేశాన్ని, ఈ రాష్ట్రాన్ని కుదిపేసిన తెలంగాణా సమస్య విషయమై రాజశేఖరరెడ్డి గారు ఏమి మాట్లాడారు? పెదే పదే వారి పేరు తీసుకొని మీరేం మాట్లాడుతున్నారు. తెలంగాణా అంశంలో మేము సెంటిమెంట్‌ని గౌరవిస్తాం, సమస్యను పరిష్కరించండని తప్పించుకొనే విధంగా మాట్లాడుతున్నారు. వీరికి ఒక విధానం లేకుండా పోవడం మానుకోవాలి. రాజశేఖర రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీలో బడుగు, బలహీన వర్గాల కోసం ఎల్లప్పుడు పనిచేశారు.

శ్రీ మండవ వెంకటేశ్వరరావు (నిజామాబాదు-రూరల్) : అధ్యక్షా, సభలో పవర్ విషయమై చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలో పవర్ గురించో, లేక ఆ పార్టీలో రాజశేఖరరెడ్డి గారు ఎవరు? ఎవరు తక్కువనే విషయం కాదు. రాష్ట్రంలో 2004వ సంవత్సరం నుండి కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. ఒకటవ కృష్ణుడా, రెండవ కృష్ణుడా మూడవ కృష్ణుడా అని ఎవరో ఒకరు మాట్లాడినా, లేక తల్లి కాంగ్రెసా, లేక పిల్ల కాంగ్రెసా అని మాట్లాడినా అవి రెండూ ఒకటే. రాష్ట్రంలో పవర్ విషయంలో జరిగిన ల్యాప్సెస్ విషయమై మేం మాట్లాడాం. మీరు అధికారంలో ఉన్నప్పుడు రోల్‌బ్యాక్ విషయమేమైంది? మీరు చెప్పిన పి.పి.ఏ.లు ఏమయ్యాయి? 1989వ సంవత్సరంలో గౌరవ

ముఖ్యమంత్రి గారు కూడా సభ్యుడిగా ఉన్నారు. మేము ప్రతిపక్షంలో ఉన్నాం. రోశయ్య గారు పవర్ మినిస్టర్‌గా ఉండి సభలోకి తాడు తీసుకు వచ్చిన సంగతిని మీకు గుర్తు చేస్తున్నాను. 'ఈ రాష్ట్రంలో పవర్ కట్ ఎత్తేయకపోతే మూడేళ్లలో నేను ఉరేసుకొంటా' అని ఆయన చెప్పారు. ఆయన ఉరేసుకోలేదు. ఉరేసుకోమని నేను కోరుకోవడం లేదు. ఆ రకమైన విధానాల్ని నేను మాట్లాడుతున్నాను. ఇంతకు ముందు వెంకట రమణారెడ్డి గారు ఒక మాట చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో నేను, అరుణ గారు పవర్ గురించి అడిగాం, ఆయన ఇవ్వలేమని చెప్పినట్లు చెప్పారు. ఈ నిండు సభలో క్వశ్చన్ వస్తే కూడా 'పవర్ ఇవ్వలేకపోతున్నాం, విజయవాడ థర్మల్ పవర్ వచ్చిన తరువాత ఇస్తాం' అని చెప్పి దాట వేసిన సంఘటనలను కూడా నేను గుర్తు చేస్తున్నాను. ఈ రోజు మంచి జరిగితే మేం చేశామని అంటున్నారు. రాజశేఖరరెడ్డి గారి పాలనలో జరిగిన నష్టాల ఫలితమే ఈ రోజు పవర్ కట్ విషయంలో వచ్చిన ఇబ్బందులని నేను గుర్తు చేస్తున్నాను.

(అంతరాయం)

శ్రీ ఈటెల రాజేందర్ (హుజూరాబాదు): అధ్యక్షా, మంత్రి గారు బ్యాంకుల జాతీయ కరణ మా వల్లే జరిగిందని, ఎక్కడికి వెళ్లినా, ఏ గ్రామానికి వెళ్లినా ఇందిరమ్మ కాలనీలు కనిపిస్తుంటాయి, దున్నిన వాడికే భూమి వంటి కార్యక్రమాలన్నీ మా హయాంలోనే జరిగినట్లు చాలా గొప్పగా చెప్పుకొంటుంటారు. 2004వ సంవత్సరం కంటే ముందు కరెంటు విషయంలో జరిగిన చర్చలో చాలా చురుకుగా వ్యవహరించారు. ఆనాడు గ్రామాల్లో విజిలెన్స్ వారు దాడులు చేసి కేసులు పెడితే ఆ సందర్భంలో ప్రజలు జైళ్లకు వెళ్లినప్పుడు సంబంధిత అంశాన్ని సభలో చర్చించాం. ఈ రోజు ఏ గ్రామానికి వెళ్లినా, దళిత వాడల్లో దీపం పథకం క్రింద ఒక్క బల్బు కోసం, కరెంటు ఉచితంగా ఇస్తామని చెప్పి, 2004 కంటే ముందు ఏ విధంగా వేధించారో, పల్లెలను ఏ విధంగా అయితే చీకటి మయం చేశారో, దళిత ప్రజానీకంపై భారం మోపారో అదే విధంగా నేడూ జరుగుతున్న విషయాన్ని మరచి పోరాదని నేను తెలియజేస్తున్నాను. ఈ రోజ దళిత వాడల్లో జంపర్లు కట్ చేసి, కరెంట్ కట్ చేసి, కేసులు పెట్టి ప్రజలను జైళ్ల పాలు చేసిన ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. దీన్ని సవరించుకొనే ప్రయత్నం మీరు చేయండి. ఇక్కడ బాకా ఊదుకోవద్దని తెలియజేస్తున్నాను. నేను చెప్పేది కరెక్ట్ కాకపోతే 'నేను రాజీనామా చేస్తాను. మీ ప్రభుత్వానికి ౙౙ •• అధ్యక్షా.

మిస్టర్ డెప్యుటీ స్పీకర్ : దళిత వాడల్లో పవర్‌కట్ విషయమై ఏమైనా మాట్లాడితే మాట్లాడండి. Please enlighten the House.

డా. ఎస్.శైలజానాథ్ : ఎన్‌లైటెన్ చేసేంత గొప్పవాడిని కాదు. రెండు విషయాలు చెపుతాను. గౌరవ సభ్యులు రాజేందర్ మాట్లాడుతూ, బ్యాంకుల జాతీయకరణ చేసినట్లు బాకాలు ఊదుకొంటున్నారని అన్నారు. ఈ రాష్ట్రంలో దొరల పెత్తనాన్ని అణచింది ఈ కాంగ్రెస్ పార్టీ. ఆ పరిణామ క్రమంలో దళితవాడల్లో కరెంటు విషయమై మాట్లాడినప్పుడు నేను చాలా క్యాటగారికల్‌గా చెప్పాను. ఇందిరా గాంధీ గారు కాలనీలను కట్టిన తరువాత, ఆవిడ కాలం నుండి కరెంట్ బిల్లులు కట్టే ...

(అంతరాయం)

మిస్టర్ డెప్యూటి స్పీకర్ : దయచేసి కూర్చోండి.

•• Expunged as ordered by the Chair

మ. 2.00

Please sit down. You are a respectable Member. Please sit down Sailajanath garu. Please sit down.

DR.S.SAILAJANATH: Speaker Sir, I have to say something. మీకు, మాకు, వారికి, అందరికీ కూడా ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి దళిత ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో ఉండే విద్యుత్ సరఫరా మీద కచ్చితంగా మాట్లాడుకోవాల్సిన అవసరముంది. విద్యుత్ సరఫరా, విద్యుత్ కోత తదితర విషయాల్లో చర్చించుకోవాల్సినవి చాలా ఉన్నాయి. మీరు ప్రస్తావించిన అంశాలకు గాను I am trying to get the answer from the Government.

(అంతరాయం)

For S.C, S.T. Colonies, you have been raising the issue, I am trying to get the answer from the Government. Please co-operate. దయచేసి సభ్యులు సహకరిస్తే ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ప్రజలు విద్యుత్‌కు సంబంధించిన సమస్యలతో ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారనే విషయాన్ని పూర్తిగా అవగాహనతో మాట్లాడతాను. దయచేసి సహకరించవల్సిందిగా సభ్యులను మీ ద్వారా కోరుతున్నాను.

అధ్యక్షా, రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల విద్యుదీకరణ అంశాన్ని మొదలుపెట్టిన శ్రీమతి ఇందిరాగాంధీ గారి నాయకత్వంలోని నాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ కాలం నుండే ఎస్సీలకు, ఎస్టీలకు ప్రత్యేకంగా హౌసింగ్ ప్రోగ్రామ్ ఏర్పాటు కాబడింది. ఆ విషయాన్ని నేను గుర్తుకు తెచ్చుకుంటూ, ఆ కాలం నుంచి ఇప్పటి వరకు ఆ యా కాలనీవాసులు కరెంటు బిల్లులు కట్టనటువంటి సందర్భం ఎక్కడైనా ఉందేమో వారినే చెప్పమనండి. ఆ విధంగా కరెంటు బిల్లులు కట్టవద్దనే విధంగా ఏ ప్రభుత్వమైనా చట్టం చేసిందేమో కూడా వారినే చెప్పమనండి. కానీ మధ్యలో ఒకసారి ఆ ఇష్యూ చర్చకు వచ్చినప్పుడు, ఆనాడు డా.వైఎస్. రాజశేఖర్ రెడ్డి గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్సీ కాలనీల్లో కరెంటు బిల్లులు చెల్లించలేనటువంటి పరిస్థితుల్లో దళిత వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఆ విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఎస్సీ కాలనీల్లో బిల్లుల చెల్లింపును రద్దు చేయమని మేం వారిని కోరడం జరిగింది. కోరినప్పుడు వారు చెప్పిందేమిటంటే, ఆ విధంగా కరెంటు బిల్లుల చెల్లింపును రద్దు చేయడం కుదరదు, సగం ధర ప్రభుత్వమే చెల్లించాల్సి వస్తుంది, బిల్లులో సగం అమౌంట్ ఎస్సీ కాలనీలో విద్యుత్‌ను వినియోగించుకున్న వారే కడితే మిగతా సొమ్మును ప్రభుత్వం అడ్జెస్ట్ చేస్తుందనే మాటను ఆనాడు వారు చెప్పడం జరిగింది. ఆనాటి బకాయిలే ఈనాటి వరకు కూడా బకాయిలుగా మిగిలిపోయాయన్న వాస్తవాన్ని నేను చెబుతున్నాను. ఆ తరువాత "రాజీవ్ గాంధీ విద్యుత్ పథకం" ద్వారా రూ.125.00 లకే అర్హులైన వారందరికీ కరెంటు మీటర్లు ఇచ్చేటటువంటి కార్యక్రమం అమలుచేయబడింది. అయినప్పటికీ వేసవి కాలంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కరెంటు కష్టాలు తప్పడం లేదు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కరెంటు బకాయిలకు సంబంధించి అధికారులు అర్ధరాత్రి వేళల్లో ఆయా కాలనీల్లో కరెంటు సరఫరాను నిలిపివేసే పరిస్థితి ఆనాడు కూడా ఉండేది. ఆ సమయంలో మేం ఆ పరిస్థితిని అడ్డుకోవడం కూడా జరిగింది. ఆ విషయంలో ఈనాటి వరకు మేం గౌరవ ముఖ్యమంత్రి గారితో మాట్లాడుతున్నాం. కచ్చితంగా సానుకూలంగా వారు స్పందిస్తారనే నమ్మకం మాకుంది. గౌరవ ముఖ్యమంత్రి గారు మాటలు చెప్పే వారు కాదు చేతలతో ముందుకు వెళ్లే వ్యక్తి. సభలో ఉన్నవారందరూ గౌరవ ముఖ్యమంత్రి గారితో పనులు చేయించుకునేవారే. ఎస్సీ, ఎస్టీ

కాలనీల్లో పేద ప్రజానీకం ఎదుర్కొంటున్న కరెంటు బిల్లుల చెల్లింపు విషయంలో ఆనాటి ముఖ్యమంత్రి గారైన డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకున్నాం. మరి ఈనాడు అదే సమస్యపై పోరాడి గౌరవ ముఖ్యమంత్రి గారితో చర్చించి ఎస్సీ, ఎస్టీ పక్షాన నిలబడ్డానికి మేం వెనుకాడం. ఆ విషయాన్ని ఇంతకు ముందు మాట్లాడినటువంటి గౌరవ సభ్యులు గుర్తించాలి. నేను తప్పించుకోవడానికో, పారిపోవడానికో మాట్లాడడం లేదు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి గాను ఎన్ని కష్ట నష్టాలను ఎదురించైనా సరే వాటిని ఎదుర్కొనే ధైర్యం మా ముఖ్యమంత్రి గారికి ఉంది. ఆ విషయాన్ని ప్రతిపక్షపార్టీ సభ్యులు గ్రహించాలి. ఎన్ని కష్టాలు ఎదురైనా సరే ఈ రాష్ట్రంలోని హరిజన, గిరిజన,బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, శ్రేయస్సు కొరకు అహర్నిశలు కష్టపడే మనస్తత్వం కల్గిన ముఖ్యమంత్రి గారు మన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి గారనే విషయాన్ని నేను మీ ద్వారా సభకు తెలియజేస్తున్నాను. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం విషయంలో కూడా మేం రాజీలేని పోరాటం చేసి సమస్యల పరిష్కారం విషయంలో గౌరవ ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందనే విషయాన్ని కూడా నేను మీ ద్వారా గౌరవ సభ్యులకు తెలియజేస్తున్నాను.

మిస్టర్ డిప్యూటీ స్పీకర్: శ్రీకాంత్ రెడ్డి గారూ, మాట్లాడండి?

శ్రీ జి.శ్రీకాంత్ రెడ్డి: అధ్యక్షా, ఏ రకంగా చర్చ వెళ్తోంది,ఏ దిశ వైపుకు విద్యుత్‌కు సంబంధించిన చర్చ సాగుతోంది, విద్యుత్ సమస్య పరిష్కారం విషయంలో ప్రభుత్వం ఏ రకమైన సమాధానం చెబుతోందనే విధంగా అందరూ ఎదురుచూస్తుంటే గౌరవ మంత్రి గారు వారికి వారే సన్మాన కార్యక్రమంలో మాట్లాడినట్టుగా మాట్లాడుతున్నారు. గౌరవనీయులైన మంత్రి గారు శ్రీ పి.వి.నరసింహరావు గారు ఏదో చేశారని చెప్పారు. ఆయన చేసినందుకేమో గానీ ఆయనకు 1998వ సంవత్సరంలో ఎన్నికల్లో టికెట్ కూడా ఇవ్వకుండా ఆయన్ని గౌరవించారు వీళ్లు. వాళ్లే పెత్తందారి పార్టీలో భాగం. వారు మాట్లాడుతూ ఈరోజున ప్రజలు ఎక్కడికెళ్లినా ఆదరిస్తున్నారు అంటే అందుకు కారణం ఎవరు మంచి కార్యక్రమాలను చేస్తే వాళ్లని ప్రజలు ఆదరిస్తారు. అందుకు వీళ్ల బాధపడితే ఎట్లా? మీరూ మంచి పనులు చేయండి మంచి మంచి కార్యక్రమాలను చేయండి. ప్రజల ఆదరణ పొందండి. అంతేగానీ సన్మాన సభలో మాట్లాడినట్టుగా మాట్లాడి ప్రజల ఆదరణ పొందాలంటే కాదు. ప్రజలు ఈనాడు వైఎస్ఆర్‌సిపిని ఆదరిస్తున్నారంటే అందుకు కారణం ఆనాడు డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలే. డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారి నాయకత్వంలోని ఆనాటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులన్నీ ప్రైవేట్ రంగానికి కాకుండా ప్రభుత్వ రంగం వైపు ఉండాలనేటటువంటి ఆలోచన చేసిన వ్యక్తి రాజశేఖర్ రెడ్డి గారు. అంతేగానీ అన్నింటినీ ప్రైవేట్ రంగానికి కట్టబెట్టాలనే ఆలోచన చేసిన వ్యక్తి శ్రీ చంద్రబాబునాయుడు గారే. ఉదాహరణకు వైఎస్ఆర్ కడప జిల్లాలోని ముద్దనూరులో 450 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును 2004వ సంవత్సరంలో ప్రారంభించి కంప్లీట్ చేసిన ఘనత డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారిదే. అదే విధంగా భూపాలపల్లిలో 500 మెగావాట్ల సామర్థ్యం కల్గిన విద్యుత్ ప్లాంట్‌కు సంబంధించిన పనులను ప్రారంభించి, సకాలంలో పూర్తి చేసిన ఘనత కూడా వారికే చెందుతుంది. మరో 600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ కూడా వారి కారణంగానే మన రాష్ట్రానికి ఆనాడు వచ్చింది. అదే విధంగా 500 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఖమ్మం జిల్లా కొత్తగూడెం ప్రాంతంలో, మరో 500 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ విజయవాడ నగరం నందు గానీ, విశాఖపట్టణం నందు దాదాపు 1600 మెగావాట్ల విద్యుత్ ప్లాటు విషయంలో గానీ, ఇవే గాకుండా అల్ట్రా మెగా పవర్ ప్రాజెక్ట్‌ను విశాఖపట్టణంలో, అది కూడా ప్రభుత్వ రంగంలో ఉండాలనే ఉద్దేశంతో కష్టపడి పనిచేసి రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత కూడా వారిదేననే విషయాన్ని నేను మీ ద్వారా సభకు గుర్తుచేస్తున్నాను. లాభాపేక్షతో గాకుండా ఆయా విద్యుత్

సంస్థలు ప్రభుత్వ జవాబుదారితనంగా వ్యవహరించాలనేటటువంటి ఆలోచన చేసినటువంటి వ్యక్తి డా.వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారనే విషయాన్ని కూడా అందరూ గుర్తు చేసుకోవాలి. పూర్తిగా విద్యుత్ సమస్యల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించాలనేటటువంటి దృఢ సంకల్పంతో ముందుకుపోయి విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పితే ఈనాటి ప్రభుత్వం విద్యుత్ ప్లాంట్ల విషయంలో ముఖ్యంగా పవర్ జనరేషన్ విషయంలో నిర్లక్ష్య దోరణి ప్రదర్శిస్తూ, బొగ్గు నిక్షేపాల్ని సరైన పద్ధతిలో ఉపయోగించుకోకుండా, గ్యాస్ ఆధారిత ప్రాజెక్టుల విషయంలో కూడా సరైన ముందస్తు ప్రణాళికను రూపొందించుకోకుండా ప్రభుత్వం ఈ పరిస్థితికి రాష్ట్రాన్ని దిగజార్చింది. గౌరవ సభ్యులు విద్యుత్ విషయంలో మాట్లాడిన మాటలు సమంజసంగా లేవు. ప్రభుత్వానికి ప్రజలను పాలించే విషయంలో ఒక రెస్పాన్స్‌బిలిటీ ఉండాలి.

(అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Srikanth Reddy garu, please conclude........

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డిః Sir, నేను మాట్లాడినప్పుడల్లా వాళ్లు అడ్డుకొని ఆటంకం కల్గించారు. నన్ను మాట్లాడనీయండి. దయచేసి కొంచెం సమయం ఇవ్వండి. ఇంకొకటి అధ్యక్షా, సభ్యురాలు చెబుతారు. ప్రభుత్వం పాలించే టైంలో ఆ ప్రభుత్వానికి ఒక రెస్పాన్సిబిలిటీ వుండాలి.

అధ్యక్షా, లెట్ మి కంప్లీట్....... ఎప్పుడూ అన్నీడిస్టర్బెన్సెస్ ...... నన్ను పూర్తిగా మాట్లాడనివ్వండి....... ఇంతకుముందు మేం చెప్పాము. దాదాపుగా అంతకు ముందున్న పేద రైతులందరి కోసం దాదాపు వెయ్యి కోట్ల రూపాయలకు పైగా రుణాలను మాఫీ చేసిందెవరధ్యక్షా? కంటిన్యువస్‌గా ఒక్క రూపాయి కూడా ఏ రకమైన ఛార్జీలు పెంచకుండా పాలించిందెవరధ్యక్షా? ఎన్నికల సమయంలో రోజుకు తొమ్మిది గంటల పాటు విద్యుత్‌ను రైతులకు ఇస్తామని చెప్పి వాగ్దానం చేసి దానిని కూడా ఒకటి రెండు నెలలు అటూ ఇటూగా చేస్తామని కాన్ఫిడెంటుగా చెప్పి అమలు చేసిందెవరధ్యక్షా? రాజశేఖర రెడ్డి గారు. ఇప్పుడు అందరూ అంటున్నట్లుగా ఈ ప్రభుత్వానికి ప్రస్తుతం సలహాదారుడు చంద్ర బాబు నాయుడు గారు. ఎందుకంటే ఈయన ఎనిమిదేళ్లలో తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే వీళ్లు ఇప్పటికి దాదాపుగా నాలుగోసారి విద్యుత్ ఛార్జీలు పెంచబోతున్నారు. రు. 32 వేల కోట్లు ఎక్కడ నుంచి భరిస్తారు అధ్యక్షా ప్రజలు? వ్యవసాయం లేకుండా పోతున్నది. ఇండస్ట్రీస్ మూతపడుతున్నాయి. ఏ రకంగా కడతారు అధ్యక్షా వాళ్లు?

మిస్టర్ డెప్యూటీ స్పీకర్ః ప్లీజ్ కంక్లూడ్......

మ.2.10

శ్రీ జి. శ్రీకాంత్ రెడ్డిః ఇన్ని రకాలుగా ప్రభుత్వం విఫలమైంది. ఈ ప్రభుత్వం సరైన పాలన అందించలేదని, ప్రభుత్వాన్ని ఎండగడదామని అవిశ్వాస తీర్మానం పెట్టినప్పుడు తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వంతో ప్యాకేజి ఫిక్స్ అయి ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారు. ఎక్కడ సిబిఐ ఎంక్వైరీ వస్తుందోనని భయపడి ఫిక్స్ అయింది వాళ్లు. అవిశ్వాసానికి మద్దతు ఇవ్వలేదు. ఎవరైనా అధికార పక్షం వైపు ఎందుకు చూస్తారు. ప్రజలలో ఉన్న మా పార్టీ వైపు ఎందుకు వస్తారో ఒకసారి ఆలోచించుకుంటే మంచిది. మా పార్టీ తరఫున ఎవరు సూట్‌కేసులు మోస్తున్నారు? ఎవరు కుమ్మక్కయ్యారో అందరికీ

తెలుసు. అందుకే మేము అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇచ్చాము. చిదంబరంగారితో చీకటి ఒప్పందాలు చేసుకున్న మీరు మాట్లాడితే ఎలా?

శ్రీ డి. నరేంద్రకుమార్‌: అధ్యక్షా, ..........

శ్రీ జి. శ్రీకాంత్‌రెడ్డి: ఎన్‌టిఆర్ బొమ్మ వాడుకున్నప్పుడు ఈయన ఏ పార్టీలో ఉన్నాడు? గొర్రెలమందలాగ వైశ్రాయ్ హోటల్‌కి తోలినప్పుడు ఏ రకమైన పాలన అందించారో వాళ్ళ, అందరికీ తెలుసు. వాళ్ళు ఏమి మాట్లాడుతారు? వాళ్ళు మా పై ఆరోపణలు చేస్తారా? ముఖ్యమంత్రిగారు ప్రతి శాసనసభ్యునికి పనిచేస్తారు. మేము వెళితే కనీసం సిఎమ్ రిలీఫ్ ఫండ్ కూడా ఇప్పించుకోలేకపోతున్నాము. వాస్తవాలు మాట్లాడితే కోపాలు ఎందుకు? మా పార్టీ తరపున ఏడు గంటలు విద్యుత్ నిరాటంకంగా సరఫరా చేయాలని కోరుతున్నాము. ప్రభుత్వం పెంచిన ఇంధన సర్‌ఛార్జ్ రేట్సును ప్రభుత్వమే భరించాలి.

(ఈ దశలో టిడిపి నుండి అంతరాయం)

వాళ్ల బాధ చూడండి అధ్యక్షా. నాన్ టెలిస్కోపిక్ విధానాన్ని పెట్టారు. ముందున్న టెలిస్కోపిక్ విధానాన్ని కొనసాగించాలి. అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసి విద్యుత్ కోతలను నివారించాలి. ప్రయివేటు సంస్థలకు అనుమతులు రద్దుచేసి, జెన్‌కో ద్వారా విద్యుత్ ప్లాంట్ నిర్మించాలి. గ్యాస్, బొగ్గు నిక్షేపాలు రాష్ట్రానికే కేటాయించాలి. మా పార్టీ తరపున డిమాండ్ చేసిన విషయాన్ని ఆచరించమని చెబుతున్నాను. చేతకాని ప్రభుత్వం ఉన్నప్పుడు వాళ్లు ఎందుకు మద్దతు ఇచ్చారు? దానికి సమాధానం మాత్రం చెప్పరు. ఎదురుదాడి చేయడం తెలుసు. వాళ్లు వాళ్లు ఎంత కుమ్మక్కు అయినా మాకు అనవసరం . ఏ రకమైన పాలన చేసుకుంటారో మాకు అనవసరం . ప్రజల కోసం పోరాడుతున్న మమ్ములను అవమానపరచే విధంగా మాట్లాడడం తప్పు. ఏరకమైన హామీ అయినా తీసుకోనివ్వండి, అట్‌లీస్ట్ ప్రజలకు సంబంధించిన విద్యుత్ సమస్యలపైన దృష్టి పెట్టి ఈ రాష్ట్రాన్ని అధోగతిపాలు కాకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. చర్చలు జరిపి ఊరికే వాళ్లకు వాళ్లే సన్మానసభలు ఏర్పాటు చేసుకుంటారో ఏమో మాకు తెలియదు. ఛార్జీలు పెంచము, పెంచిన ఛార్జీలను వెనుకకు తీసుకుంటామని ఒక స్టేట్‌మెంట్ ఇవ్వండి. చర్చల ఫలితంగా ప్రజల కోసం నిలబడినందుకు ఏదైనా సాధించినవాళ్లమవుతాము. వినియోగదారులపై భారం మోపకుండా, రాష్ట్రం అధోగతిపాలు కాకుండా కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాము. అవసరమనుకున్నప్పుడు కుమ్మక్కై రకరకాల రాజకీయాలు చేస్తున్న వీళ్లు ఎటువంటి వారో రాష్ట్ర ప్రజలకు తెలిసిన అంశమే. ఎంత అరిచినా నమ్మే వాళ్లు లేరు.

శ్రీ మోత్కుపల్లి నర్సింహులు (తుంగతుర్తి): సర్, ఇద్దరు ఒకరికొకరు సిగలు పట్టుకొని కొట్టుకుంటున్నారు. ఈ సందర్భంగా ఒక మాట అడుగుతున్నాను. ఈ కరెంటు కష్టాలు రాష్ట్రానికి 2004లో మొదలయ్యాయి. రాజశేఖర్‌రెడ్డిగారు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్ర భవిష్యత్తు మొత్తం, రాష్ట్ర ప్రగతి మొత్తం, రాష్ట్రంలోని భూములు మొత్తం సర్వం అన్నీ అమ్ముకొని డబ్బుకోసం రాష్ట్ర ప్రగతిని నాశనం చేసిన వ్యక్తి ఆయన. పవర్ ప్రాజెక్ట్స్ అన్నీ ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చేశాడు. 23 పవర్ ప్రాజెక్ట్సును ప్రయివేటు వ్యక్తులకు దారాదత్తం చేసి కమీషన్లు తీసుకొని రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసిన వ్యక్తి ఆయన. ఎపి జెన్‌కోను అడ్డం పెట్టుకొని వాళ్ల కొడుకుకు సిక్కింలో 1100 మెగావాట్సు గల ఎతేనా పవర్ ప్రాజెక్టును పెట్టించాడు. అరుణాచల్‌ప్రదేశ్‌లో జెన్‌కోను అడ్డం

పెట్టుకొని జగన్మోహన్ రెడ్డి కోసం పవర్ ప్రాజెక్టును అక్కడ ఏర్పాటు చేసుకున్నారు. ఈ రాష్ట్రం చీకటిమయం కావడానికి, చీకటి రాజ్యంగా మారడానికి పూర్తిగా కారణం రాజశేఖర్ రెడ్డిగారేనని తెలియచేస్తున్నాను. అంతేకాదు ఆయన వల్ల రాష్ట్రం సర్వతోముఖంగా నాశనమైందని తెలియ చేస్తున్నాను.

(ఈ దశలో శ్రీ కె. రాంభూపాల్ రెడ్డి పోడియం వద్దకు వచ్చి సభకు అంతరాయం కలిగించసాగారు.)

ఎస్‌సి, ఎస్‌టి వాడలలో కరెంటు ఉందా? ఎస్‌సిల పేరు చెప్పే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదు. వైఎస్‌ఆర్‌సిపికి అసలు లేదు. వారిద్దరూ కలిసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు.

( శ్రీ కె. రాంభూపాల్ రెడ్డి పోడియం వద్ద నుండి తన సీటుకు వెళ్లారు.)

ముఖ్యమంత్రిగారు వినాలి. వై.ఎస్.గారు చేసిన పథకాలు అన్నీ చెబుతున్నారు. సిబిఐ ఎంక్వైరీలో రాజశేఖర్ రెడ్డిగారు తప్పు చేశాడని తేలింది. రూ.43000 కోట్లు ఎక్కడ నుండి వచ్చాయి? అవి పవర్ ప్రాజెక్ట్సను అమ్ముకోవడం వల్ల వచ్చాయి. ఎస్‌సిల ఇళ్లలో కరెంటు లేదు. ఈ రాష్ట్రంలో కరెంటే లేదు. కరెంటు లేకపోవడానికి కారణం ఎవరంటే తల్లి కాంగ్రెస్, పిల్ల కాంగ్రెస్‌లే. ఇద్దరూ ద్రోహులే. మీ వల్లనే కరెటు రావడం లేదని తెలియ చేస్తున్నాను. అందరూ దీనిని గమనించవలసిన అవసరం ఉందని తెలియచేస్తున్నాను.

మ.2.20

శ్రీ కె. పార్థసారధి (మాధ్యమిక విద్యా శాఖా మంత్రి) : అధ్యక్షా, నర్సింహులు గారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఎస్.సిలకు ఏమి చేసిందని అన్నారు. ఆయనకి కళ్లు ఉండి, ఒక దళిత నాయకుడిగా ఈ విధంగా మాట్లాడడం చాలా అన్యాయం. దేశంలో మొట్టమొదటి సారిగా, ఎస్.సి, ఎస్.టి సబ్‌ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చింది ఈ ప్రభుత్వం. మేము దళితులకు, గిరిజనులకు రూ. 18,000 కోట్లు కేటాయించాము. అలాగే బలహీన వర్గాలకు రూ. 4,000 కోట్లు కేటాయించాము. దళితులకు, గిరిజనులకు న్యాయం చేయాలనే ఆలోచన తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడైనా చేసిందా అని అడుగుతున్నాను. ఇందిర జల ప్రభ పథకం ద్వారా 65,000 ఎకరాల భూమిని దళితులకు, గిరిజనులకు పంపిణీ చేయడం జరిగింది. ఏదో భూములు వాళ్ల మొహాన పడేసి, సాగుచేసుకోడానికి వీలు లేకుండా చేయలేదు. కొన్ని వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి ఎండిపోయిన భూములను సాగులోకి తీసుకొచ్చాము. గృహనిర్మాణానికి సంబంధించి రాజశేఖర రెడ్డి గారు చేశారు. వారు చెప్పుకుంటే చంద్రబాబు నాయుడు గారి పేరు చెప్పుకుంటారు ఎందుకంటే వాళ్ల అధ్యక్షుడు కాబట్టి. మేము చెప్పుకుంటే కిరణ్‌కుమార్ రెడ్డి గారి పేరు చెప్పుకుంటాము. చాలా దౌర్భాగ్యం ఏమిటంటే వాళ్లు జగన్మోహనరెడ్డి గారి పేరు చెప్పుకొని మాట్లాడుతున్నారు. మా జగన్మోహన్ రెడ్డి రెండు సంవత్సరాలు పార్లమెంట్ సభ్యుడిగా ఉండి, పార్లమెంట్‌లో ఈ విధంగా పోరాటం చేశారు, రాజకీయాలలో ఉండి ఈ విధంగా చేశారని మాట్లాడాలి. అంతేకాని, జైల్లో ఉండి, రాజశేఖరరెడ్డి గారి పేరు చెప్పుకొని మాట్లాడడం దౌర్భాగ్యం. మీరు మీ అధ్యక్షులు జగన్మోహన రెడ్డి గారి పేరు చెప్పుకొని మాట్లాడండి. ఆయన పార్లమెంట్ సభ్యునిగా ఉండి, ఈ రాష్ట్రం కోసం ఈ విధంగా న్యాయం చేశారని మాట్లాడండి. రైతులకు రుణమాఫీ చేశామని వాళ్లు మాట్లాడుతున్నారు. రూ.13,000 కోట్లు రుణమాఫీ చేసిన ఘనత ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది. సోనియా గాంధీ గారి పేరుచెప్పుకొని

పార్లమెంట్ సభ్యునిగా గెలిచిన జగన్మోహన రెడ్డి ఈరోజు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం ఏవిధంగా సబబో చెప్పాలి. ఫ్యాక్టరీలన్నీ మూతపడ్డాయన్నారు. యస్, దమ్ముంటే రమ్మనండి. SPDCL, EPDCL లలో దాదాపు 70 ఫీడర్స్‌కి ఏడు గంటలు కరెంట్ ఇస్తున్నాం. వాళ్లు ఏడుగంటలు కరెంట్ ఇవ్వడం లేదని అన్నారు. మేము ఏడు గంటలు కరెంట్ ఇస్తున్నాం. నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. నేను ఛాలెంజ్ చేస్తున్నాను. ప్రజలకు వాస్తవాలు తెలుసు. మేము ఏడు గంటల కరెంట్ ఇచ్చామో లేదో అడగమనండి. మా చంద్రబాబు నాయుడు గారు వ్యవసాయం దండుగ అని ఎక్కడన్నారు అని మాట్లాడారు. చంద్రబాబు గారి "మనసులో మాట" అనే పుస్తకం గురించి తెలుసు. దాంట్లో చాలా స్పష్టంగా చెప్పారు. నేను ఆ పుస్తకాన్ని మీకిస్తాను. మీకు దమ్ముంటే వాళ్ల మీద కేసు వేసుకోండి. దాంట్లో "Yes, I committed mistakes" అన్నారు. హిందూ పేపర్ కి చాలా క్రెడిబిలిటీ ఉంది. దాంట్లో ఏమన్నారంటే, 'Mr. Naidu's reported remark is that agriculture is waste. In his lengthy reply, Mr. Naidu said: 'Yes. I have committed some mistakes, but I am ready to rectify the same.' వ్యవసాయం దండగ అని అన్నారు, సాక్షి పేపర్‌లో వచ్చింది. బలహీన వర్గాలకి రూ. 150 కోట్లు కూడా ఇవ్వలేదు. తొమ్మిది సంవత్సరాలు అధికారంలో ఉండి మేము కష్టపడ్డామని చెప్పుకోవడం దళిత నాయకుడిగా నర్సింహులు గారికి తగదని చెబుతున్నాను.

శ్రీ కాపు రామచంద్రారెడ్డి (రాయదుర్గ్): అధ్యక్షా, అనంతపురం జిల్లాలో దివంగత ఫాదర్ విన్సెంట్ గారు దళితుల్లో దేవుడిగా ఉంటూ ఆర్‌డిటి అనే సంస్థ ద్వారా లక్షల ఇళ్లు కట్టించారు. ఆర్‌డిటి కాలనీలకి ఊరు బయట, ఊరికి దూరంగా దళితులకు, గిరిజనులకు ఇళ్లు కట్టించారు. ఆ కాలనీలలో కరెంట్ లేదు. అవి ఇందిరమ్మ ఇళ్లు కాదు, ప్రైవేట్ ఇళ్లు. గవర్నమెంట్ ఆర్‌డిటి కాలనీలకు కరెంట్ ఇవ్వమని చెబుతున్నారు. అనంతపురం జిల్లాలలోని ఆర్‌డిటి కాలనీలలో దళితులకు విద్యుత్‌సరఫరా కల్పించాలని ముఖ్యమంత్రి గారిని కోరుతున్నాను. వారికి తాగునీటి సౌకర్యం కూడా లేదు. దళితులు వేరే వాళ్ల ఇళ్లకి వెళ్లలేక, తాగడానికి నీరులేక చస్తున్నారు. మా దగ్గర 25,000 మంది దళితులున్నారు. అవి ప్రైవేట్ కాలనీలై ఉండొచ్చు. వాళ్లు కూడా మన లాంటి మనుషులే కాబట్టి ఆర్‌డిటి కాలనీలకు మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నాను.

శ్రీ ఇ. రాజేందర్ : అధ్యక్షా, టి.ఆర్.ఎస్ పార్టీ తెలంగాణా అంశం కోసం పట్టుబడుతున్నది. మీరు చూస్తూనే ఉన్నారు. ఆ అంశం కంటే కూడా, రైతుల కన్నీళ్లు తుడవాలని, దళితులకు కరెంటు వస్తుందని సభలో చర్చ జరుగుతుంటే ఈ చర్చలో పాల్గొన్నాము. మంత్రి గారికి ముఖ్యమంత్రి గారిపై ప్రేమ ఉండొచ్చు. హుస్నాబాద్ నియోజకవర్గంలో కస్తూరిబా కాలనీ అని ఒక దళిత కాలనీ ఉంది. అది ఇందిరమ్మ కాలనీ. ఆనాటి నుండి ఈనాటి వరకూ ఎప్పుడూ అక్కడ కరెంట్ పోలేదు. మీ ప్రభుత్వ హయాంలో ఆ కాలనీకి విద్యుత్ కోత విధించిన మాట వాస్తవం. హుస్నాబాద్‌లో దమ్మపేట గ్రామంలో దళితునిపై విద్యుత్ విజిలెన్స్ కేసు పెడితే, ఆ దళిత బిడ్డ ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. మామిడాలపల్లి గ్రామంలో దళిత కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ పెట్టించమంటే, కరెంట్ కనెక్షన్స్‌కి డబ్బులు కట్టనందున దళిత కాలనీలలో ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోయినా పెట్టించమని అన్నారు. దళిత కాలనీలల్లో ఒక్క బల్బు ఉన్న ఇంటికి ఫ్రీ కరెంట్ ఇస్తామని అన్నారు. దానిని అమలుచేస్తారా లేదా అనేది ముఖ్యమంత్రి గారు ప్రకటించాలి. ఎండిపోతున్న పొలాల కోసం ఏడు గంటల కరెంట్ ఇస్తారని రైతులు ఆశతో ఎదురుచూస్తుంటే, రాజకీయాలు మాట్లాడుకోవడం, సభను తప్పుదోవ పట్టించడం కరెక్ట్ కాదు. అందు కోసం ఈ సభ లేదు. రైతాంగానికి ఏడు గంటల కరెంట్, దళిత కాలనీలకు కరెంట్, విద్యార్థులకి ఎగ్జామ్స్ జరుగుతున్నాయి కాబట్టి వారిని దృష్టిలో

పెట్టుకొని వారు చదువుకోడానికి వీలుగా కరెంట్ ఇవ్వాలని, అందుకోసమే ఈ చర్చ అని తెలియజేస్తున్నాను.

మ.2.30

(తెలుగుదేశం సభ్యులు శ్రీ మోత్కుపల్లి నర్సింహులు, తదితరుల నుంచి అంతరాయం)

శ్రీ జి.మల్లేశ్: అధ్యక్షా,

(అంతరాయం కొనసాగింపు)

నర్సింహులు గారూ, కూర్చోండి.

(డా.ఎస్.శైలజానాథ్‌చే అంతరాయం)

మంత్రి గారూ, కాస్త ఆగండి.

మిస్టర్ డెప్యూటీ స్పీకర్: శైలజానాథ్ గారూ, దయచేసి కూర్చోండి.

శ్రీ జి.మల్లేశ్: అధ్యక్షా, అమూల్యమైన ఈ సభా సమయం వృథా కాకుండా ప్రధానంగా చర్చ జరగాలని అనుకొన్నాం. కాని ఇవాళ జరుగుతున్న పద్ధతి చూస్తుంటే హృదయం కాలిపోతుంది. కరెంట్ ఎలా కాలుతుందో అలా కాలుతుంది. ఒకరి మీద ఒకరు ఆరోపణలు చేయడానికి ఇది సమయమా అధ్యక్షా? వారి గొప్పతనాలు చెప్పడానికి ఇది సమయమా? ఇవాళ ప్రధానంగా మూడు రోజుల నుంచి వామపక్ష పార్టీలు విద్యుత్ సమస్యపైన నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్నాయి. రాష్ట్రమంతా విద్యుత్ సమస్య పైన చాలా ఆందోళనగా ఉంది. దానిని పట్టించుకోకుండా మా కాలంలో ఇది జరిగింది, మీ కాలంలో ఇది జరిగిందని చెప్పడానికా ఈ సభ? దయచేసి సభ్యులందరూ అదుపులో ఉండాలి. వ్యక్తిగత గొప్పతనాల కంటె సమాజ గొప్పతనాన్ని చెప్పాల్సిన అవసరముంది. అందుకు మీరు అటువంటివారిని ప్రోత్సహించాలి తప్ప సంబంధిత అంశం గాకుండా ఇతర అంశాలను మాట్లాడేవారిని అరికట్టాలని కోరుతున్నాను.

(డా.ఎస్.శైలజానాథ్‌చే అంతరాయం)

శ్రీ గొల్ల బాబూరావు (పాయకరావుపేట): అధ్యక్షా, మంత్రి గారూ ఒక్క నిమిషం.

MR.DEPUTY SPEAKER: Do you have to say anything on power in SC/ST Colonies?

శ్రీ గొల్ల బాబూరావు: అధ్యక్షా, గౌరవ మంత్రివర్యులు డా.శైలజానాథ్ గారు, కొండ్రు మురళి గారు ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ గురించి మాట్లాడుతున్నారు.

(డా.ఎస్.శైలజానాథ్‌చే అంతరాయం)

MR.DEPUTY SPEAKER: Do you have to say anything on power in SC/ST Colonies?

శ్రీ గొల్ల బాబూరావుః అధ్యక్షా, ఇక్కడ అరచేతుల్లో వైకుంఠం చూపిస్తున్నట్లు రాష్ట్రంలో ఉన్న పేద దళిత ప్రజలందరూ ఒకేసారి దారిద్ర్యరేఖకు ఎగువకు వచ్చినట్లు మాట్లాడుతున్నారు. నేను ఒక విషయం ఈ సభ దృష్టికి తీసుకొస్తున్నాను. ఇపుడు కాంగ్రెస్ పార్టీకి మీద్వారా నేను తెలియజేసేదేమంటే, 117వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ రోజు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని దళితులకే కాక, దేశంలోని దళితుల కోసం రాజ్యసభలో ఆమోదం పొందిన బిల్లు ఇంతవరకు లోక్‌సభలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదు? మీకు నిజంగా మా దళితుల పట్ల ప్రేమ, అభిమానం ఉన్నవారైతే ఈ బిల్లును లోక్‌సభలో ఎందుకు ప్రవేశపెట్టడం లేదు? రెండోది మీరు కేవలం దళితుల ఓట్ల కోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను తీసుకొొచ్చి దళితుల ఓట్లు పొందాలని అనుకుంటున్నారు. కానీ వైఎస్ రాజశేఖర రెడ్డిగారు ప్రవేశపెట్టిన పథకాల వల్ల మా దళితుల ఓట్లు అన్నీ కూడా ఎపుడూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే వెయ్యాలని దళితులు ఎపుడో నిర్ణయించుకున్నారు. మీరు ఎన్ని పాట్లు పడినా, ఎన్ని కష్టాలు పడినా దళితుల నుంచి ఒక్క ఓటు కూడా కాంగ్రెస్ పార్టీకి వచ్చే పరిస్థితి లేదని మీ ద్వారా కాంగ్రెస్ వారికి చెబుతున్నాను.

శ్రీ పితాని సత్యనారాయణ (సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి)ః అధ్యక్షా, గౌరవసభ్యులు ఒక సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అని నాకు తెలుసు. ఆ సామాజిక వర్గం అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది. వారి అభ్యున్నతికి 1980లోనే సబ్‌ప్లాన్ పెట్టాలని ఆలోచించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తీసుకొచ్చింది.

(తెలుగుదేశం పార్టీ సభ్యులు శ్రీ మల్లెల లింగారెడ్డిచే అంతరాయం)

ఆ సామాజిక వర్గానికి సంబంధించినంతవరకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల ఫలాలు అందడం లేదని ఆలోచించి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అప్పట్లో ఆ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం చేస్తున్న ప్రక్రియను హేళన చేస్తుండడం గర్హనీయం. ఆ సామాజికవర్గం ఓట్ల కోసం, రాజకీయాల కోసం ఒక పార్టీ కోసం, సామాజికవర్గం అభ్యున్నతి కోసం చేస్తున్న కార్యక్రమాలను ఆ విధంగా హేళన చేయడాన్ని ఖండిస్తున్నాను. రాజకీయాల కోసం ఆ విధంగా మాట్లాడవద్దని చెబుతున్నాను. అటువంటి మాటలను చెప్పే సభ్యుల మాటలను రికార్డుల నుంచి తొలగించాలని కోరుతున్నాను. ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం సబ్‌ప్లాన్ కార్యక్రమాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం కేటాయించే ప్రతి పైసా వారికి అందేలా చూడడంకోసం ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టినపుడు ఆ పార్టీ ఆ చట్టానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. ఆ విషయాన్ని ఈ రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. అదే సబ్‌ప్లాన్ చట్టాన్ని హేళన చేస్తున్న కార్యక్రమం చూస్తుంటే బాధ కలుగుతుంది. అటువంటి వ్యాఖ్యలను చేస్తున్న ఆ పార్టీ ఆ సామాజికవర్గ అభ్యున్నతికి ఎటువంటి కార్యక్రమాలు చేస్తుందో తెలియదు కానీ, ఈ విధంగా హేళన చేయవద్దని ప్రత్యేకంగా కోరుతున్నాను.

MR.DEPUTY SPEAKER: Discussion on Power will be continued tomorrow. Now the House is adjourned to meet again tomorrow at 9-00 am.

(The House then adjourned at 2-37p.m. to meet again at 9.00 a.m. on Tuesday, the 26th March, 2013).